జడ్పీ సర్వసభ్య సమావేశం అర్థవంతంగా సాగింది. గత రెండు సమావేశాలకు భిన్నంగా అందరూ హాజరయ్యారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు అంతా వైసీపీ వారే కాగా.. మంత్రులు, ఎమ్మెల్యేలు వారే అధికంగా ఉండి గత మూడేళ్ల సమావేశాలు ఏకపక్షంగా సాగాయి. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది మూడో సమావేశం. తొలి రెండుసార్లు కూటమి ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. జిల్లా అధికారులంతా గత ప్రభుత్వంలో నియమితులైన వారే కావడం ఇందుకు కారణం. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కుదుటపడింది. అధికశాతం మంది అధికారులు మారారు. ఈనేపథ్యంలో మంగళవారం జరిగిన జడ్పీ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అంతేకాక కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు.


జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్, వేదికపై మరో మంత్రి స్వామి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, కలెక్టర్ అన్సారియా


సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు

- క్రియాశీలకంగా మంత్రులు స్వామి, గొట్టిపాటి
- ప్రజా సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు, సభ్యులు
- అధికారుల అలసత్వాన్ని ప్రశ్నిస్తూనే మెరుగైన చర్యలకు సూచనలు
- రాజకీయ వివక్షకు తావులేకుండా అర్హులకు ప్రభుత్వ సాయం అందించాలని స్పష్టం
- వైసీపీ ప్రతినిధుల ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు

సరికొత్తగా.. అర్థవంతంగా..

జడ్పీ సమావేశంలో కీలక అంశాలపై విస్తృత చర్చ

ఒంగోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం, లోటుపాట్లు లేకుండా చూడాలి. అంతకు మించి రాజకీయ వివక్షకు తావులేకుండా అర్హత కలిగిన లబ్ధిదారులకు పథకాలు చేర్చాలి. నష్టపోయిన బాధితులకు పరిహారం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. తదనుగుణంగా ఆయా శాఖల అధికారులు మసలుకోవాలి' అని మంత్రులు డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్ సూచించారు. స్థానిక పాత జడ్పీ సమావేశపు హాలులో మంగళవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షత జరిగింది. మంత్రులు స్వామి, రవికుమార్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ శ్రీకాంత్, వైసీపీకి చెందిన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా అజెండాలో ప్రకటించిన డ్వామా, డీఆర్‌డీఏ, వైద్యారోగ్యశాఖ, హౌసింగ్ శాఖలతోపాటు ఇటీవలి వర్షాలు, పంట నష్టాల అంశాన్ని ప్రత్యేకంగా చర్చించారు.

ఆలస్యంగా ప్రారంభం

సమావేశం ఉదయం పదిన్నరకు ప్రారంభం కావాల్సి ఉండగా గంట ఆలస్యంగా మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు వచ్చారు. తొలుత ఒంగోలులోని టీడీపీ కార్యాలయానికి మంత్రులు, ఎమ్మెల్యేలు చేరుకొని అక్కడి నుంచి అందరూ

మిగతా 6వ పేజీలో

అన్ని ప్రాంతాలకూ ప్రాధాన్యం

- మిత్రపక్షాలకు కూడా నామినేటెడ్ పదవులపై టీడీపీ నేతల విస్తృత చర్చ
- వెలిగొండ ప్రాజెక్టు, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవిపై ప్రధాన సమీక్ష
- రేపు అమరావతిలో భేటీ, ముఖ్యమంత్రిని కలిసే అవకాశం
- ఒంగోలులో సమావేశమైన మంత్రులు, శాసనసభ్యులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

నామినేటెడ్ పదవుల విషయంలో జిల్లాలోని అన్ని ప్రాంతాలకూ అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. అలాగే రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు జనసేన, బీజేపీలను కూడా కలుపుకుపోయి అవసరమైన మేరకు వారికీ పదవులు కేటాయించాలనుకున్నారు. ప్రధానంగా సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ పదవిపైన, వెలిగొండ నిర్మాణ పనులపైన సమీక్షించుకున్న నేతలు అమరావతిలో సమావేశం కావాలని, అవకాశం దొరికితే సీఎంను కలవాలని తీర్మానించుకున్నారు. ఉమ్మడి ప్రకాశంకు చెందిన ఇద్దరు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామిలతోపాటు అందుబాటులో ఉన్న

మిగతా 6వ పేజీలో

వైసీపీ ప్రభుత్వ దారుణాలతోనే విద్యుత్ భారాలు

- అంతకుముందు ఐదేళ్ల టీడీపీ పాలనలో చార్జీలు పెంచకుండా మిగులు కరెంటు ఇచ్చాం
- జగన్ విధానాలతో వ్యవస్థ నాశనం
- ప్రైవేటు పెట్టుబడిదారులను వేధించారు
- ఆ భారం ఇప్పుడు ప్రజలపై పడిందే తప్ప కూటమి ప్రభుత్వం చార్జీలు పెంచలేదు
- పెద్దఎత్తున గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి చర్యలు
- విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్
- మానవత్వం చాటుకున్న గొట్టిపాటి
- రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి ఆసుపత్రికి తరలింపు

వివరాలు మెయిన్‌లో..


జాతి పుంజుతో కోళ్లఫారం నిర్వాహకుడు నాగేశ్వరరావు

కొక్కొరో..క్రేజ్

నాటుకోళ్లవైపు జనం పరుగులు

- పోషకుల్లోనూ పెరుగుతున్న ఆసక్తి
- మాంసం విక్రయాల్లోనూ హెచ్చు
- రూ.లక్షలు పలుకుతున్న పందెం పుంజులు
- గోదావరి జిల్లాల నుంచి తెచ్చి పెంపకం
- కొండపి నియోజకవర్గంలో వ్యాపారం వృద్ధి

7

చేతిదాకా వచ్చి నీటిపాలు



- సజ్జ పంట వర్షార్పణం
- రంగు మారి మొలకెత్తుతున్న కంకులు
- హతాశులైన రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

7



కమిషనరేట్‌కు చేరిన ఎక్సైజ్ గోల్‌మాల్

- అవినీతి లెక్కతేల్చిన అధికారులు
- రూ.30 లక్షలు రికవరీ
- మాల్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి నోటీసులు
- మధ్యవర్తుల ద్వారా కానిస్టేబుల్ రమణతో చర్చలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖలో చోటుచేసుకున్న అవినీతిపై జిల్లా అధికారులు లెక్కతేల్చారు. కమిషనర్‌కు మంగళవారం నివేదిక పంపారు. ఆ ప్రకారం ఒంగోలులో ఉన్న రెండు ఎలైట్ మాల్స్‌లో రూ.2.34 కోట్లు గోల్‌మాల్ అయ్యాయి. ఆ విషయాన్ని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ మొత్తంలో ఆ మాల్స్ వెరిఫికేషన్ అధికారి అయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ సూత్రధారిగా ఉన్నప్పటికీ 'తిలాపాపం తలా పిడికెడు' అన్నట్లు అక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ల పాత్రను కూడా లెక్కతేల్చారు. మొత్తం ఎనిమిది మంది ప్రైవేటు ఉద్యోగులు పనిచేస్తుండగా వారికి నోటీసులు

మిగతా 6వ పేజీలో

బదిలీల ఆర్డర్లలో భారీ అవినీతి

- చేతులు మారిన రూ.లక్షలు
- ఫోన్‌పే, గూగుల్‌పే, ఆన్‌లైన్ ద్వారా పేమెంట్లు
- ఉత్తర్వులు పొందేందుకు పడిన పాట్లను ఏకరువు పెట్టిన సచివాలయ కార్యదర్శులు
- రెండో రోజూ విచారణను కొనసాగించిన త్రిసభ్య కమిటీ
- పూర్వ డీపీవో వ్యవహారశైలిపై విచారణాధికారుల అసంతృప్తి
- మేడం చెప్పినట్లే చేశాం... ఇందులో మా తప్పేమీ లేదు
- అధికారుల ఎదుట కార్యాలయ ఉద్యోగుల ఆవేదన
- నేడు నివేదికను కలెక్టర్‌కు అందజేసే అవకాశం


గ్రేడ్ 5,6 ఉద్యోగులను విచారిస్తున్న త్రిసభ్య కమిటీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ పరిధిలోని గ్రేడ్-5, 6 (సచివాలయ ఉద్యోగుల) బదిలీల్లో భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్లు త్రిసభ్య కమిటీ విచారణలో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. కమిటీ చైర్మన్ అయిన ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్ లోకేశ్వరరావు, ఇద్దరు సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి బదిలీలు పొందిన ఉద్యోగులతో మాట్లాడి వివరాలను సేకరించారు. మరోవైపు కలెక్టరేట్‌లోని ఫారెస్టు సెటిల్‌మెంట్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించిన విచారణను మంగళవారం కూడా కొనసాగించారు. పూర్వ డీపీవో ఉషారాణితోపాటు బదిలీలు పొందిన వారు, ఇప్పటివరకు బదిలీ ఉత్తర్వులు పొంది మండలాల్లో చేరకుండా ఉన్న ఉద్యోగులు హాజరయ్యారు. జరిగిన పరిణామాలన్నింటినీ త్రిసభ్య కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. ఇంకోవైపు విచారణ కమిటీ ముందు చెప్పేందుకు భయపడుతున్న ఉద్యోగుల నుంచి రాతపూర్వకంగా సమాచారాన్ని తీసుకున్నట్లు తెలిసింది. బదిలీల ఆర్డర్లు పొందేందుకు భారీగా చేతులు

మిగతా 6వ పేజీలో



పాత సింగరాయకొండ సమీపంలోని పెరల్ డిస్టిలరీ

పెరల్ డిస్టిలరీలో సీఐడీ తనిఖీలు

- డీఎస్పీ ఆధ్వర్యంలో 15 మంది సిబ్బంది ముమ్మర సోదాలు
- రాత్రి వరకూ కొనసాగింపు
- వైసీపీ ప్రభుత్వంలో చేసిన మద్యం ఉత్పత్తిపై ఆరా
- క్షుణ్ణంగా రికార్డుల పరిశీలన
- ముఖ్యమైనవి కొన్ని స్వాధీనం

సింగరాయకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలో ఉన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి చెందిన పెరల్ డిస్టిలరీలో సీఐడీ, ఎక్సైజ్ అధికారులు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. విజయవాడ సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలు, 10 మంది సిబ్బంది ఉదయం 9 గంటలకు సోదాలను ప్రారంభించి రాత్రి వరకూ కొనసాగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం

మిగతా 6వ పేజీలో

సాగని వేట.. గడవని పూట..

- బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు
- మత్స్యకారుల ఇక్కట్లు
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

కొత్తపట్నం (ఒంగోలునగరం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరుస అల్పపీడనాలతో తీరంలోని మత్స్యకారులు పూట గడవక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జూలై నుంచి బంగాళాఖాతంలో వాయుగుండాలు ఏర్పడుతూనే ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఆగస్టు చివరివారంలో బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. సెప్టెంబరు మొదటివారంలో మరో తుఫాన్ అతలాకుతలం చేసింది. దాని కారణంగా కురిసిన భారీవర్షాలకు విజయవాడ నగరం మునిగిపోయింది. వారం క్రితం మరో వాయుగుండం తమిళనాడులో తీరం దాటింది. మళ్లీ సోమవారం నుంచి అల్పపీడనం ఏర్పడటంతో మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలా నెలల తరబడి వేట లేకపోవడంతో వారు పూట గడవక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో తీరం వెంబడి ఉన్న 72 తీరప్రాంత


కొత్తపట్నం తీరంలో ఒడ్డున ఉన్న బోట్లు

మిగతా 6వ పేజీలో


మర్రిపూడి నుంచి పిచ్చిరెడ్డికుంటకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న వాగు

వామ్మో.. వాగు

- భారీ వర్షాలకు ఆరడుగుల గొయ్యి
- పది రోజులుగా నిలిచిన రాకపోకలు
- పొలాలకు వెళ్లలేకపోతున్న రైతులు

7వ పేజీలో

సరికొత్తగా.. అర్థవంతంగా..

(5వ పేజీ తరువాయి)

కలిసి 11.40 గంటల ప్రాంతంలో సమావేశానికి వచ్చారు. అయితే సమావేశం ప్రారంభం నుంచి ఒక్క నిమిషం కూడా వృథాకాకుండా మధ్యాహ్నం 2.40 గంటల వరకు ఆయా అంశాలపై విస్తృతంగా చర్చించారు. అది కూడా అర్థవంతంగా నిర్దిష్ట పరిష్కారాలు, ప్రశ్నలు, సమాధానాలతో సాగింది. తద్వారా సమస్యల పరిష్కారానికి, పథకాల పురోగతికి దోహదపడేలా చేయడంతోపాటు మూడు గంటల పాటు సమావేశంలో ఇరువురు మంత్రులు పూర్తి సమన్వయంతో వ్యవహరించారు. వివిధ అంశాలపై వైసీపీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, ప్రత్యేకించి మండల స్థాయి ప్రజాప్రతినిధులైన జడ్పీటీసీ సభ్యులు ఎంపీపీలకు అవకాశం ఇస్తూ వారు ప్రస్తావించిన విషయాలకు అధికారులు నుంచి వివరణలు ఇప్పించడంతోపాటు అవసరమైన వాటిని వారే స్వయంగా సమాధానాలు ఇచ్చి సంతృప్తిపరిచారు. ప్రధానంగా డ్వామా, పంట నష్టాలు, హౌసింగ్ తదితర అంశాలపై అలా వ్యవహరించారు.

వైద్యారోగ్యశాఖపై అసంతృప్తి

వైద్యారోగ్యశాఖ పనితీరులో లోపాలు, అధికారుల అలసత్వాన్ని మంత్రి స్వామి ప్రశ్నిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే తాను ప్రాతినిథ్యం వహిస్తున్న విద్యుత్ శాఖకు సంబంధించి జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలు, మరింత మెరుగైన చర్యలకు మంత్రి గొట్టిపాటి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. పలు కీలక అంశాలపై ఇలా అర్థవంతమైన చర్చ సాగేలా చేసిన మంత్రులు ఇరువురు పలు సందర్భాలలో ఆయాశాఖలను గాడిలో పెట్టేందుకు, ప్రభుత్వం ఆశించిన విధంగా పనులు సాగేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా, బాపట్ల జేసీ జైన్‌లను ఆదేశించారు.

గతంలో వలే వివక్ష, కక్షసాధింపులు ఉండవు

గత వైసీపీ ప్రభుత్వంలో వలే రాజకీయ వివక్ష, కక్షసాధింపు చర్యలు తమ ప్రభుత్వంలో ఉండవని మంత్రులు తేల్చిచెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించడం, ప్రజాసమస్యల పరిష్కారం చేయడంలో ఆ తరహా విధానాన్ని అధికారులు విడనాడాలని ఎక్కడైనా ఒకట్రెండుచోట్ల తమ పార్టీ నాయకులు ఒత్తిడి చేసినా పట్టించుకోకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించాలని స్పష్టం చేశారు. త్వరలో ఇళ్ల స్థలాల మంజూరు, రూ.4 లక్షలతో గృహ నిర్మాణం, గ్రామాల్లో ఉపాధి పథకం మెటీరియల్ ద్వారా నిర్మాణాలు పూర్తి, వైద్యశాలల్లో సౌకర్యాలు మెరుగు, సబ్‌స్టేషన్ల ఏర్పాటు, తదితర అంశాలపైనా వివరిస్తూ వాటి ఆధారంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాధారణంగా జడ్పీ చైర్మన్, కలెక్టర్లు ఆయా అంశాలపై చొరవ తీసుకొని మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పరిష్కారాలు లేదా జిల్లాలో జటిలంగా ఉండే అంశాలపై మంత్రులు ఇలాంటి సమావేశాల్లో మాట్లాడతారు. అయితే ఈ సమావేశాన్ని అంతా తామై ఇరువురు మంత్రులు నడిపించారు.



గ్రామాలలో తాగునీరు ఇబ్బందిలేకుండా చూడాలి

గ్రామాలతో తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలి. ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి. ఇరిగేషన్ పరిధిలోని చెక్‌డ్యామ్‌ల పనులు త్వరితగతిన చేపట్టాలి. అలాగే గతంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి. ఇప్పటికే బిల్లులు మంజూరులో జాప్యం జరిగిందువలన పనులు చేసినవారు ఇబ్బందులు పడుతున్నారు. జడ్పీ సమావేశం మందిరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో పెట్టలేదు. ప్రతి ఆఫీసులో సీఎం ఫోటో ఉండాలి.

- దామచర్ల జనార్దన్, ఎమ్మెల్యే, ఒంగోలు



పశ్చిమ ప్రాంతంలో తాగునీటి ఇబ్బంది తీర్చాలి

పశ్చిమ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగుంటినందున తాగునీటి సమస్య ఉంది. తూర్పు ప్రాంతాలకంటే ప్రత్యేకించి మార్కాపురం నియోజకవర్గ ప్రజలు ఫ్లోరైడ్ నీరు తాగాల్సిన పరిస్థితి వస్తుంది. జిల్లా ఏరియా ఆసుపత్రి ఉన్నా, రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదు. క్యాజువాలిటీ ఉన్నా, ఐసీయూ లేని కారణంగా అత్యవసర వైద్యసేవల కోసం ఒంగోలు రావాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల కాలంలో ఓ వ్యక్తి కూడా మార్గ మధ్యంలోనే చనిపోయారు. ఆసుపత్రిలో రక్త నిల్వల కోసం అవసరమైన బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలి.


- కందుల నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే, మార్కాపురం



ప్రభుత్వ వైద్యశాలలో సమస్యలు పరిష్కరించాలి

కనిగిరి ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలు అందడం లేదు. అవసరం లేని చోట ఇద్దరు వైద్యులు ఉంటున్నారు. అవసరమైన చోట ఒక్కరు కూడా ఉండటం లేదు. గతంలో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు 150 కాన్పులు జరిగేవి, ఇప్పుడు ఒకటి, రెండు కూడా జరగడం లేదు. అదేమంటే వైద్యులు తమ ప్రవేటు ప్రాక్టీస్ పోతుందని అంటున్నారు. కనీసం అంబులెన్స్‌కు డ్రైవర్ కూడా లేకపోవడం బాధకరం. పామూరు ఆసుపత్రిలో ఇద్దరు మత్తు డాక్టర్లు ఉంటే ఒకరు జిల్లాకో ఆర్డినేటర్ అయ్యారు. మరో డాక్టర్ ఉన్నా, శెలవు పెడితే పరిస్థితి ఏమిటి. మార్చురీ గది కూలిపోయే దశలో ఉంది. దానిని తొలగించి, పునఃనిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించనప్పుడు రాజీనామా చేస్తే పోతుంది. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలి. అలాగే గతంలో ఇందిరమ్మ, ఎన్టీఆర్ హయంలో నిర్మించిన ఇళ్ళు పాడైపోయాయి. వాటిని తొలగించి, కొత్త ఇళ్ళు మంజూరులో పాతవారికి కూడా అవకాశం కల్పించాలి.


- డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఎమ్మెల్యే, కనిగిరి



పంట నష్టం అంచనాలలో అందరికీ న్యాయం చేయాలి

ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రాప్ వేసిన వారిలో ప్రత్యేకించి ముండ్లమూరు మండల పరిధిలో మిర్చి పంట అధికంగా వేశారు. అయితే అక్కడ రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇంతవరకు ఎంతమేర నష్టం జరిగిందో అధికారులు అంచనాలు కూడా వేయలేదు. ఒకసారి క్షేత్రస్థాయిలో పర్యటించి, దర్శి నియోజకవర్గంతోపాటు జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో పంట నష్టాలను అంచనాలు వేసి, రైతులను ఆదుకోవాలి. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

- బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే, దర్శి



నియోజకవర్గంలో అధికారుల మధ్య సమన్వయం లేదు

కందుకూరు నియోజకవర్గ పరిధిలో అధికారుల మధ్య సమన్వయం లేదు. అభివృద్ధి అంశాలపై స్పష్టత లేదు. నియోజకవర్గ స్థాయిలో అన్నీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కరించాలి, అలాగే ఇప్పటికే పలు సమస్యలను ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్ళాము. త్వరితగతిన పరిష్కరించేలా చూడాలి. **- ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే, కందుకూరు**



కలెక్టర్ ఆదేశించినా అధికారులు పనిచేయడం లేదు

గిద్దలూరులో పేరుకు 100 పడకల అసుపత్రి అన్నారు. అక్కడ డాక్టర్లు ఉండరు, మత్తు డాక్టర్ లేరు. అంతెందుకు కనీసం అంబులెన్స్‌కు డ్రైవర్ కూడా లేకపోవడం మరీ దారుణం, ఆసుపత్రి అధ్వాన్నంగా ఉంది. వర్షం వస్తే బాగా కారిపోతుంది. ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళడం జరిగింది. కలెక్టర్ తనిఖీ చేసి రెండు, మూడు నెలలు అయింది. అయినా నేటికి ఆ సమస్యను పట్టించుకున్న అధికారులు లేరు. కలెక్టర్ ఆదేశాలను కూడా అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. జిల్లా కేంద్రం ఒంగోలుకు గిద్దలూరు దూరంగా ఉండటం, పశ్చిమ ప్రాంతం కావడంతో రోగులకు రక్త సమస్య ఎదురవుతుంది. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలి. **- ముత్తుముల అశోక్ రెడ్డి, ఎమ్మెల్యే, గిద్దలూరు**



నిరుపయోగ స్థలాలను వినియోగంలోకి తేవాలి

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయాలి, అవసరం అయితే నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను బాగు చేయించి క్రీడాకారులకు వినియోగంలోకి తీసుకురావాలి. అసంపూర్తిగా ఉన్న అంగన్ వాడీ భవనాలను గుర్తించి పూర్తి చేయించాలి. వాటితోపాటు, పాడైపోయి, శిధిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను కూడా గుర్తించి, వాటిని తొలగించి కొత్తవాటిని నిర్మించడానికి చర్యలు చేపట్టాలి. రెవిన్యూతో కలిసి పనులు చేయించాలి. **- కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ**

- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

హైవే-216పై ప్రమాద ఘంటికలు

- ఆది నుంచీ విస్తరణ పనుల్లో ఆరోపణలు
- డివైడర్లు, జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు
- హడలెత్తుతున్న వాహనదారులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం త్రోవగుంట నుంచి కత్తిపూడి వరకు ఉన్న జాతీయరహదారి-216పై ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలెత్తుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ఏ రూపంలో ప్రమాదం పొంచి ఉందో అర్థంగాక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. అదుపు తప్పి గానీ లేదా వాహనం తగిలి కింద పడితే ఇక అంతే సంగతులు. సిమెంటు రోడ్డు ధాటికి తలలు పగిలి మృత్యువాత పడాల్సిందే. ఈ జాతీయ రహదారి నిర్మాణంలో పలు లోపాలున్నాయని ఆది నుంచే అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. జాతీయ రహదారికి సిమెంటు రోడ్డు నిర్మించడం మంచిది కాదని, అనేక ఇబ్బందులు తలెత్తుతాయని అప్పటో ప్రజలు పెదవివిరిచారు. భూసేకరణ మొదలు రహదారి పనులు పూర్తి అయ్యే నాటివరకు గుత్తేదారు, పనులు పర్యవేక్షించిన అధికారుల తీరును ప్రజలు నేరుగా, సోషల్‌మీడియాలోనూ విమర్శలు వచ్చినా ఏమాత్రం పట్టించుకోకుండా పనులు కానిచ్చారు. వెరసి ఇప్పుడు రోడ్డు ప్రమాదాలకు కారణమౌతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూల మలుపులు అధికం

ప్రధానంగా జాతీయరహదారి-216పై మూల మలుపులను నియంత్రించి నేరుగా రహదారి నిర్మించాల్సి ఉండగా ఆ దిశగా ఆలోచించకుండా అప్పట్లో సిఫార్సుల మేరకే భూసేకరణ చేసినట్లు వార్తలు గుప్పుమన్నాయి. గతంలో ఉప్పుగుండూరు నుంచి త్రోవగుంట వరకు 20 కిలోమీటర్ల పరిధిలో 20 మూల మలుపులు ఉండగా నేడు జాతీయరహదారిగా రూపాంతరం చెందిన తర్వాత కూడా సుమారు 15 వరకు ఉండటం ప్రమాదాలకు ఒక కారణమన్న విమర్శలున్నాయి. ఇక ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్నవాగు, పొలిమేర, వారాహి కోల్డ్‌స్టోరేజి మలుపు వద్ద నుంచి ఇంకొల్లు రోడ్డు జంక్షన్ వరకు సమారు ఐదు కిలోమేటర్ల మేర ప్రమాదాల నిలయంగా మారిందని పోలీసులు బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. నాగులుప్పలపాడు మండల కార్యాలయాల సముదాయం, మద్రికుంట, పశుక్షేత్రం, చదలవాడ ఎస్సీకాలనీ, రామన్న చెరువు ప్రాంతం, గుండ్లకమ్మ బ్రిడ్జి, మద్దిరాలపాడు దక్షిణం వైపు జంక్షన్, చేకూరపాడు బస్టాండ్, అరవకుంట, నేలకుంట మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలకు నెలవుగా మారడంతో పోలీసులు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేయడం జరిగింది.



ఉప్పుగుండూరు వద్ద లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న కారు (ఫైల్)

జంక్షన్లలో ప్రమాదాలు

ఈ రహదారి నుంచి మద్దిరాలపాడు, చదలవాడ, ఇంకొల్లు, ఉప్పుగుండూరు గ్రామాల్లోకి వెళ్లే జంక్షన్‌ల వద్ద ఎక్కువగా వద్ద ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. ఆయా జంక్షన్ల వద్ద డివైడర్‌లతో కూడిన రహదారి నిర్మాణం ఇరుకుగా ఉండి ముందు వెళుతున్న వాహనాలను వెనక నుంచి వచ్చే వాహనాలు అధిగమించే సమయంలో, రాత్రి వేళ్లల్లో డివైడర్ వద్ద సూచికలు లేకపోవడం, డివైడర్లకు రేడియం రంగులు లేక రాత్రి వేళ్లల్లో లారీలు, కార్లు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక ఇంకొల్లు జంక్షన్ వద్ద ప్రత్యేక సూచికలతో కూడిన డైవర్షన్ ఏర్పాటు చేయకపోవడంతో అక్కడ మూడు వైపుల నుంచి వాహనాలు ఒకేసారి వచ్చినపుడు ప్రమాదాలు జరుగుతున్న సందర్భాలు అనేకం. మిగిలిన ప్రాంతాల్లోని జంక్షన్‌ల వద్దా ఇదే పరిస్థితి నెలకొంది.

గత ఆరు నెలల్లో..

ఉప్పుగుండూరు వద్ద నుంచి చదలవాడ గుండ్లకమ్మ బ్రిడ్జి వరకు నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్, అక్కడి నుంచి త్రోవగుంట వరకు ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయి. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత ఆరు నెలల నుంచి అధికారికంగా 70కి పైగా రోడ్డు ప్రమాద కేసులు నమోదు కాగా అనధికారికంగా మరెన్నో ప్రమాదాలు జరిగినట్లు సమాచారం. రోడ్డు ప్రమాదానికి గురైనవారు కేసులకు బయపడి దెబ్బతిన్న తమ వాహనాలతో అక్కడ నుంచి జారుకొన్న సంఘటనలున్నాయి. మరికొన్ని రాజీ చేసుకొన్న సందర్భాలు అనేకం. ఆయా ప్రమాదాలలో సుమారు పదిహేను మంది మృతి చెందగా పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగిలినట్లుగా పోలీసులు తెలిపారు. 216 జాతీయ రహదారిగా విస్తరణ చెందిన నాటి నుండి పోలీస్ హైవే మొబైల్ వాహనం పర్యవేక్షణ కూడా లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైవేపై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నాగులుప్పలపాడు వద్ద తరచూ ప్రమాదాలు జరిగే మలుపు



రేడియం గుర్తులు లేని డివైడర్

కమిషనరేట్‌కు చేరిన ఎక్సైజ్ గోల్‌మాల్

(5వ పేజీ తరువాయి)

జారీ చేశారు. వారు సుమారు రూ.50లక్షలు మాయం చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. మిగిలిన రూ.1.74 కోట్లు రమణ దుర్వినియోగం చేసినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. కొంతమంది మధ్యవర్తుల ద్వారా అధికారులు అజ్ఞాతంలో ఉన్న రమణతో చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు సంబంధించి రూ.1.20కోట్లు దశలవారీగా ఇచ్చేందుకు అంగీకారం కుదిరిందని సమాచారం. ఈమేరకు సోమ, మంగళవారాల్లో రూ.30 లక్షలు ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. ప్రైవేటు ఉద్యోగుల నుంచి నగదు రాబట్టే ప్రయత్నంలో ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కమిషనర్ వద్దకు పంచాయితీ

విజయవాడలో ఉన్న ఎక్సైజ్ కమిషనర్ వద్దకు మంగళవారం ఒంగోలు ఈఎస్, ఒంగోలు ఎక్సైజ్ సీఐలు వెళ్లారు. శాఖలో దుర్వినియోగమైన నగదు గురించి నివేదిక ఇచ్చి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నారు. అయితే ప్రైవేటు ఉద్యోగుల మాత్రం తమకు ఏమి సంబంధం లేదు, మొత్తం రమణనే బాధ్యుడని చెబుతున్నారు. ఇదిలాఉండగా అతను అజ్ఞాతంలో ఉండి మధ్యవర్తుల ద్వారా రూ.30లక్షలు జమ చేసినట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులు గోల్‌మాల్ అయిన నగదు రికవరీపై దృష్టిపెట్టారు. అందుకు సంబంధించి ప్రభుత్వపరంగా ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నను విచారణ అధికారిగా నియమించారు. ఈమేరకు ఆమె విచారణ చేసి నివేదిక ఇచ్చారు. అదేక్రమంలో ఒంగోలు ఏఈఎస్ ఈ.వెంకట్ శాఖాపరమైన విచారణ చేశారు. చర్యల కంటే కూడా నగదు రికవరీపైనే ఎక్కువగా దృష్టిపెట్టినట్లు సమాచారం. కాగా కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అన్ని ప్రాంతాలకూ ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు మంగళవారం మధ్యాహ్నం ఒంగోలులోని ఎమ్మెల్యే జనార్దన్ ఇంట్లో సమావేశమయ్యారు. మంగళవారం జరిగిన జడ్పీ సమావేశానికి మంత్రులతోపాటు టీడీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సోమవారం రాత్రి టెలీకాన్ఫరెన్స్‌లో నేతలంతా మాట్లాడుకుని జడ్పీ సమావేశానికి రావాలని నిర్ణయించుకున్నారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే జనార్దన్ ఇంట్లో మంత్రులు రవికుమార్, స్వామిలతోపాటు ఎమ్మెల్యేలు జనార్దన్, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌లు భేటీ అయ్యారు. డ్రోన్ సమ్మిట్ పనుల్లో ఉన్న ఎమ్మెల్యే సాంబశివరావు అందుబాటులో లేని విజయ్‌కుమార్, కొండయ్యలు హాజరుకాలేదు.

పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవిపై ప్రధాన చర్చ

నామినేటెడ్ పదవుల అంశంపై ప్రధాన చర్చ జరిగింది. అన్ని ప్రాంతాలకూ, అన్ని సామాజికవర్గాల వారికీ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరు మంత్రులతోపాటు కొత్తగా వచ్చిన కార్పొరేషన్ పదవులు కూడా తూర్పు ప్రాంతానికే దక్కాయి. దీంతో భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల విషయంలో అన్ని ప్రాంతాలకు న్యాయం జరిగేలా చూడాలని ఉగ్ర ప్రతిపాదించారు. ఆ వెంటనే మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు తమ ప్రాంతాలకు ఇంతవరకూ ఎలాంటి అవకాశాలు ఇవ్వలేదని, కార్యకర్తల నుంచి ఒత్తిడి ఉందని చెప్పారు. జిల్లాస్థాయిలో సెంట్రల్ బ్యాంక్, డీసీఎంఎస్, కోల్ సొసైటీ, పొగాకు సమాఖ్య, వక్ఫ్‌బోర్డు, గ్రంథాలయం, ఓడా చైర్మన్ తదితర పదవులపై చర్చ జరిగింది. వీటిని అన్ని ప్రాంతాలు, సామాజికవర్గాలకు అవకాశం కల్పించేలా ఎంపిక చేసుకోవాలని నిర్ణయించారు.

అదేసమయంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన జనసేన, బీజేపీల అంశం కూడా చర్చకొచ్చింది. ఆ పార్టీ నేతలతో కూడా చర్చించి రాష్ట్ర పార్టీ నిర్ణయానికి అనుగుణంగా వారికి అవకాశాలు ఇచ్చి ముందుకుపోవాలని నిర్ణయించుకున్నారు. మంత్రులు రవి, స్వామిలు చేసిన ప్రతిపాదనలకు మిగిలిన వారు అంగీకారం తెలిపారు.

వెనక్కివచ్చే ప్రసక్తే లేదు

ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంక్ పదవిపై వారి మధ్య చర్చ సాగినట్లు తెలిసింది. ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ ఇప్పటికే డాక్టర్ సీతారామయ్య పేరును ఆ పదవికి ప్రతిపాదించారు.

ఆయనతోపాటు కొత్త ప్రకాశం జిల్లాలోని మిగిలిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఆయన సిఫార్సు లేఖపై సంతకాలు చేయగా, మంత్రి రవి, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావులు అందరితో మాట్లాడి నిర్ణయిద్దామంటూ సంతకాలు చేయలేదని తెలిసింది. ప్రస్తుతం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఆయన్ను నియమిస్తే ఆరు నెలల్లో జరిగే ఎన్నికల్లో అవసరమైన ఆర్థిక ఏర్పాట్లు చేసు కోగలరా? అని ఉగ్ర ప్రశ్నించినట్లు తెలిసింది. దామచర్ల అందుకు ఆయన సిద్ధం అని చెప్పగా మంత్రి రవి జోక్యం చేసుకుని మీరు చెప్పండని సీతారామయ్యను అడిగినట్లు సమాచారం. వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని, ఎన్నికలు వచ్చినా తాను అన్నివిధాలా సిద్ధమేనని డాక్టర్ సీతారామయ్య చెప్పినట్లు తెలిసింది. అలాగైతే తమకు ఇబ్బందిలేదని, సమావేశంలో ఎక్కువమంది మద్దతు ఇచ్చినట్లు సమాచారం. మంత్రి రవి మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తూ మరికొందరు ఎమ్మెల్యేలు లేనందున గురువారం అమరావతి ప్రాంతంలో జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుందామని, అక్కడికి డాక్టర్ కూడా రావాలని చెప్పినట్లు తెలిసింది.

వెలిగొండపై పట్టు

వెలిగొండ ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదని, ఈ విషయమై ప్రభుత్వం స్పందించకపోవడంతో పశ్చిమప్రాంత ప్రజలు ఆందోళనలో ఉన్నారని మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి సమావేశంలో ప్రస్తావించారు. తక్షణం పనులపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వెంటనే రవికుమార్, స్వామి నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడుకు ఫోన్ చేసి ఆ విషయంపై మాట్లాడారు. ఈ విషయాన్ని సీఎం వద్ద చర్చించాల్సిన అవసరం ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. తదనుగుణంగా మిగిలిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు కూడా ఉంటే బాగుంటుందని భావించి గురువారం అమరావతిలో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధలు, ఇన్‌చార్జిలు భేటీ కావాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత సీఎంను కలవాలని కూడా తీర్మానించారు.

బదిలీల ఆర్డర్లలో భారీ అవినీతి

(5వ పేజీ తరువాయి)

మారినట్లు విచారణాధికారులు గుర్తించినట్లు సమాచారం.

ఎవరికిచ్చారు.. ఎందుకిచ్చారు?

ఫొన్ నంబర్ల ఆధారంగా ఎవరి ఫోన్ నంబర్లకు ఎంత అమౌంట్ ఇచ్చారు? అది బదిలీల కోసమే ఇచ్చారా? తదితర అంశాలపై వివరాలు సేకరించినట్లు తెలిసింది. బదిలీల సమయంలో ఉద్యోగులు డబ్బులను పూర్వ డీపీవో ఉషారాణి కుటుంబ సభ్యులకు ఫోన్‌పే ద్వారా చెల్లించినట్లు విచారణాధికారులు గుర్తించినట్లు సమాచారం. మరోవైపు ఉషారాణి మాత్రం తాను నిజాయితీగా పనిచేశానని, బయట జరిగే పరిణామాలకు తనకు ఏమి సంబంధమని కమిటీనే ఎదురుప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో విచారణాధికారులు బ్యాంకు లావాదేవీలను నేరుగా ప్రస్తావించడంతో ఏమీ చెప్పలేని పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. అయితే జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఇతర ఉద్యోగులపై కూడా ఆ నెపం నెట్టివేసే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయితే విచారణాధికారులు అవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం బదిలీల కోసం మార్గదర్శకాల జారీచేసిన నాటి నుంచి బదిలీల ఆర్డర్లు ఇచ్చేంతవరకు జరిగిన పరిణామాలపై ప్రశ్నిస్తుంటే ఇతర అంశాల ప్రస్తావించడం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది.

సీసీ పుటేజ సేకరణ

రెండోరోజైన మంగళవారం జరిగిన విచారణలో కూడా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సచివాలయ ఉద్యోగులు తాము ఎవరికి డబ్బులు ఇచ్చింది విచారణాధికారులకు పూసగుచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. కార్యాలయంలో పనిచేసే వివిధ హోదాల్లోని ఉద్యోగులను కూడా విచారించి రాతపూర్వకంగా వివరణ తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు సీసీ పుటేజ్‌లో కొన్ని విషయాలు సేకరించినట్లు సమాచారం. పూర్తిస్థాయిలో విచారణ ముగియడంతో బుధవారం నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు సమాచారం. దాని ఆధారంగా ఎవరిపై వేటుపడుతుందో వేచిచూడాల్సి ఉంది.

మేడం చెప్పినట్లే చేశాం

బదిలీలను మేడం ఉషారాణి చెప్పినట్లే చేశామని, అందులో తమకు ఎలాంటి సంబంధం లేదని జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు విచారణ కమిటీ ఎదుట తెలిపినట్లు సమాచారం. తాము చిరుద్యోగులమని, పై అధికారి ఏవిధంగా చెప్తే అలా మసలుకోవడమే తమ విధి అని అన్నట్లు తెలిసింది. ఆమె ఎవరికి ఇవ్వమంటే వారికి ఆర్డర్లు ఇచ్చామని, అందులో తమ తప్పేమీ లేదని కొంతమంది కన్నీరుపెట్టుకున్నట్లు సమాచారం. ఇదేవిషయాన్ని రాతపూర్వకంగా ఇవ్వాలని సూచించడంతో ఆ విధంగా ఉద్యోగులు ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు ఒక సచివాలయ ఉద్యోగి ఫోన్‌పే ద్వారా తాను డబ్బులు చెల్లించిన తర్వాతనే తనకు ఆర్డర్ ఇచ్చారని విచారణాధికారులకు చెప్పినట్లు తెలిసింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఉషారాణి.. ఎప్పుడు ఇచ్చావని ఫైర్ అయినట్లు తెలిసింది. ఆ ఉద్యోగి కార్యాలయంలో పనిచేస్తున్నట్లు కూడా తనకు తెలియదని ఉషారాణి చెప్పినట్లు సమాచారం.

ఉద్యోగులు సస్పెండయ్యాక ఆర్డర్లు

జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు సస్పెండ్ అయ్యాక కార్యాలయంలో పనిచేసే ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ద్వారా ఆర్డర్లు ఇచ్చి డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో బహిర్గతమైనట్లు సమాచారం. ఆ ఉద్యోగి రూ. 2లక్షలకుపైగా నగదును నేరుగా ఉషారాణికి ఇచ్చినట్లు తెలిసింది. ఆయనకు ఈనెల 9వ తేదీన బదిలీ ఉత్తర్వులు ఇచ్చినట్లు విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ముందు ఆ ఉద్యోగి ఎవరో తెలియదని ఉషారాణి బుకాయించగా, తాను డీఎల్‌డీవో కార్యాలయానికి వచ్చి డబ్బులు ఇవ్వలేదా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. మరోవైపు పూర్వ డీపీవో ఉషారాణి ఫీల్డ్ విజిట్ సమయంలో వాట్సాప్ గ్రూపుల్లో జరిగిన మెసేజ్‌లను కూడా విచారణాధికారులు ఆధారాలతో సహా ఆమె ముందు ఉంచినట్లు సమాచారం. కాగా మార్కాపురంలో మహిళా ఉద్యోగి వేధింపుల విషయంలో అక్కడి డీఎల్‌డీవో సస్పెండ్ అయ్యారు. ఆయనకు అనుకూలంగా నివేదిక ఇస్తానని పూర్వపు డీపీవో రూ.50వేలు తీసుకున్నట్లు సమాచారం. ఆ విషయమై సస్పెండ్ అయిన డీఎల్‌డీవోనే నేరుగా విచారణాధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు సమాచారం.

పెరల్స్ డిస్టిలరీలో సీఐడీ తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

ఉత్పత్తికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వం (2019-24)లో మద్యం తయారీ కంపెనీల్లో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయి. వైసీపీ అధినేతలు కొందరు బినామీల ద్వారా కొన్ని లిక్కర్ కంపెనీలను స్వాధీనం చేసుకొని నాసిరకం మద్యాన్ని ఉత్పత్తిచేసి అధిక ధరలకు అమ్మి రూ.వేలకోట్లు కొల్లగొట్టారు. వైసీపీకి చెందిన వారి బినామీ కంపెనీలలో పెద్దఎత్తున మద్యం ఉత్పత్తి చేశారు. వారికి లొంగని కంపెనీల్లో మాత్రం ఉత్పత్తి అమాంతంగా పడిపోయింది. దీంతో గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకల నిగ్గుతేల్చడానికి తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఎంపీ మాగుంటకు చెందిన పెరల్స్ డిస్టిలరీలో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రోజుకు 10 లక్షల కేసుల మద్యం ఉత్పత్తి జరిగేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక కేవలం రోజుకు 1 లక్ష నుంచి 2 లక్షల మద్యం కేసులు మాత్రమే ఉత్పత్తి చేశారు. దాదాపు వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ 80 శాతం ఉత్పత్తి తగ్గిపోయింది. నాటి సర్కారు బినామీ కంపెనీలకు పలురకాల బ్రాండ్ల ద్వారా నాసిరకం మద్యం ఉత్పత్తికి విరివిగా అనుమతివ్వగా మిగతా కంపెనీలకు వారి పాత బ్రాండ్ల ఉత్పత్తికి అవకాశం ఇవ్వకపోవడమే ఇందుకు కారణమైంది. దీంతో కంపెనీ ఉత్పాదక సామర్థ్యంలో భారీ వ్యత్యాసాలు వచ్చాయి. ఆనాటి వైసీపీ ప్రభుత్వం అనైతిక నిర్ణయాలతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్రంలో పలు డిస్టిలరీలలో సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహించడంతో వైసీపీ కీలక నేతల్లో కలవరం మొదలైంది.

సాగని వేట.. గడవని పూట..

(5వ పేజీ తరువాయి)

గ్రామాల్లో నివాసం ఉంటున్న మత్స్యకారుల్లో 90శాతం మంది చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వేటకు పోనిదే కుటుంబం గడవటం కష్టంగా మారుతోంది. రెండు మూడు నెలలుగా నెలలో వారంపాటు కూడా వేట సాగడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెక్కాడితేనే డొక్కాడేది

జిల్లాలో ఎక్కువమంది మత్స్యకారులు అవుట్ బోట్ మోటార్ల మీదే వేట సాగిస్తున్నారు. సంప్రదాయ పడవలకు ఇంజన్లు అమర్చుకుని సముద్రంపైకి వెళ్తారు. వేకువజామునే వేటకు వెళ్లి సాయంత్రానికి తిరిగి వస్తారు. ఇన్‌బోట్ మోటార్లు, మర పడవల మీద వేట సాగించే వారు తక్కువగానే ఉంటారు. అవుట్ బోట్ మోటార్లు మీద వేట చేసి జీవించే మత్స్యకారులకు నెలల తరబడి వేట సాగటం లేదు. ఇన్‌బోట్, పెద్ద పడవలకు కూడా సముద్రంపైనే లంగరు వేసి ఉంచి మత్స్యకారులు తీరం చేరతారు. వరుస అల్పపీడనాల కారణంగా సముద్రం ఏమాత్రం వేటకు అనుకూలించడం లేదని వారు వాపోతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని తమ బతుకులు తుఫాన్ల కారణంగా ఇబ్బందుల్లో పడ్డాయంటూ ఆవేదన చెందుతున్నారు. వాయుగుండాల కారణంగా తీరప్రాంత గ్రామాల్లో చలి తీవ్రత ఎక్కువగానే ఉంటోంది. ఒకవైపు ఆకలి ఇంకోవైపు చలితో తాము ఇబ్బందులు పడుతున్నామంటూ గంగపుత్రులు వాపోతున్నారు. మత్స్యకారుల్లో ఆర్థికంగా ఇబ్బంది లేని వారు కొందరే. రోజూ వేటకు పోతేనే ఆ పూటకు తిండి గడిచే కుటుంబాలే అధికంగా ఉన్నాయి. సముద్రం కాస్తన్నా శాంతిస్తే వేటకు పోదామనుకుంటున్న సమయంలో మళ్లీ మరో తుఫాన్ అంటూ హెచ్చరికలు వస్తుండటంతో మత్స్యకారులు కలవరపడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం బియ్యం అయినా పంపిణీ చేసి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వేటసాగటం లేదు.. ప్రభుత్వం ఆదుకోవాలి

నెలరోజులుగా సక్రమంగా వేట సాగడం లేదు. వాయుగుండం ఏర్పడితే పదిరోజులపాటు సముద్రంలోకి వెళ్లడానికి వీలులేదు. ఈఏడాది తుఫాన్లు ఎక్కువగానే ఉన్నాయి. ఈప్రభావం వలన భారీ వర్షాలు కురుస్తున్నాయి. మత్స్యకారులకు తీవ్ర ఇబ్బంది జరుగుతోంది. ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

- నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు, కె.పల్లెపాలెం



వేటకు వెళ్లలేకపోతున్నాం..

సునామీ తర్వాత వేట అంటేనే మత్స్యకారుల్లో భయం కలుగుతోంది. వాయుగుండం ఏర్పడితే సముద్రం అల్లకల్లోలంగా మారిపోతోంది. ఆ సమయంలో వేటకు వెళ్తే పడవలు బోల్తాపడి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. దీంతో సముద్రంలో ఏమాత్రం అలజడి కనిపించినా వేట చేయలేక మానుకుంటున్నాం.

- రమణయ్య, మత్స్యకారుడు కె.పల్లెపాలెం



పస్తులు ఉంటున్నాం..

ఈనెలలో పట్టుమని పదిరోజులు కూడా వేట చేయలేకపోయాం. వేటకు వెళ్లి నాలుగు చేపలు పట్టుకుని అమ్ముకుని ఆ పూట గడుపుకుంటాం. తుఫాన్ అంటే అందరి కంటే మాకే ముందు తెలుస్తుంది. సముద్రం రంగు మారి అల్లకల్లోలంగా కనిపిస్తుంది. వేటకు ఏమాత్రం అనుకూలంగా ఉండదు. దీంతో వేట చేయకుండా పడవలను ఒడ్డుకు చేర్చుకున్నాం.

- కోటి, మత్స్యకారుడు, పల్లెపాలెం



'తింటే గారెలు తినాలి.. వింటే భారతం వినాలి' అనే నానుడి కాస్తా 'తింటే నాటు కోడి తినాలి....' అన్నట్టు మారిపోయింది. దాని మాంసం మధురంగా ఉంటుంది. ఆరోగ్యానికీ శ్రేష్టమే. అందుకే చికెన్ తింటే నాటుకోడి మాంసమే తినాలంటారు. అంతేకాదు బరిలోకి దిగా అది పులిగా ఎగిరి పడుతుంది. ప్రత్యర్థిని పడగొట్టేవరకూ పోరాడుతుంది. అప్పుడు దాని రాజసం వేరే స్థాయిలో ఉంటుంది. అందుకే కరోనా తరువాత ఆరోగ్యంపై ప్రజలకు శ్రద్ధ పెరగడంతో నాటుకోళ్లవైపు మళ్లారు. దానికి అనుగుణంగా వ్యాపారం కూడా పెరిగింది. ఈ క్రమంలో కొండపి నియోజకవర్గంలో నాటుకోళ్ల పెంపకంపై ప్రత్యేక కథనం..

కొక్కొరో.. క్రేజ్

నాటుకోళ్ల వైపు జనం పరుగులు

- పోషకుల్లోనూ పెరుగుతున్న ఆసక్తి
- మాంసం విక్రయాల్లోనూ హెచ్చు
- రూ.లక్షలు పలుకుతున్న పందెం పుంజులు
- గోదావరి జిల్లాల నుంచి తెచ్చి పెంపకం
- కొండపి నియోజకవర్గంలో వ్యాపారం వృద్ధి

కొండపి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు వ్యవసాయం చేసుకునే రైతులు, కూలీలు, గ్రామీణులు పాడిపరిశ్రమతోపాటు అదనపు ఆదాయ వనరుగా నాటుకోళ్లను పెంచుకునేవారు. రాను రానూ వాటి పెంపకం తగ్గిపోయింది. వినియోగదారులు కూడా నాటుకోళ్లను వదిలేసి ఫారం, బాయిలర్ కోళ్ల మాంసం తినడానికి అలవాటు పడ్డారు. కరోనా తర్వాత పౌష్టికాహారంపై పెరిగిన అవగాహనతో తిరిగి నాటుకోళ్ల మాంసంవైపు మళ్లారు. వీటి పెంపకం కూడా గ్రామాల్లో చిన్నతరహా పరిశ్రమగా వృద్ధి చెందుతోంది. కంచెతోపాటు షెడ్లు వేసి పెంచి ఆదాయం పొందుతున్నారు.



తాటాకులపాలెం వద్ద సాయికృష్ణ పెంచుతున్న నాటుకోళ్లు

ఆశాజనకంగా నాటుకోళ్ల వ్యాపారం



పొదుగుతున్న కోడి

- మర్రిపూడి మండలంలోని రామాయపాలెం వద్ద కొండపి మండలం పెట్లూరు గ్రామానికి చెందిన పాలకీర్తి నాగేశ్వరరావు దాదాపు 200 కోళ్లను పెంచుతున్నారు. వీటితోపాటు భీమవరం, పాలకొల్లు, కైకలూరు, ఉండి ప్రాంతాల నుంచి జాతిగల పందెం పుంజులు తెచ్చి, మేలైన కోడిపెట్టలతో సంక్రమింపజేస్తున్నారు. వాటి గుడ్లను పొదిగించి మేలైన పుంజులను, పెట్టలను ఉత్పత్తి చేస్తున్నారు.
- కొండపి మండలంలోని తాటాకులపాలెం వద్ద ఎకరం పొలం లీజుకు తీసుకుని గుడ్లూరు మండలం సీతారామపురానికి చెందిన పేరం సాయికృష్ణ నాటుకోళ్లు పెంచుతున్నారు. 100 కోళ్లకుపైగా ఉన్నాయి. గోదావరి జిల్లాలోని భీమవరం సమీప గ్రామాల్లో కోడి నెమలి, కాకి డేగ, కక్కెర, పచ్చకాకి, సేతువ లాంటి జాతి రకాల కోళ్లను కొని ఇక్కడికి తీసుకొచ్చి పెంచుతున్నారు. ఒక్కొక్క కోడి రూ.లక్ష వరకు ఉంటుందని ఆయన చెబుతున్నారు. సకాలంలో వ్యాక్సిన్‌లు వేయిస్తే బతుకుతాయని, లేకపోతే కొక్కెర తెగులు వచ్చి చనిపోయే అవకాశం ఉంటుందని వివరించారు. మాసంకోళ్లు సగటున కేజీ రూ.750 విక్రయిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని గుర్రప్పడియ, కొండపి ప్రాంతాల్లో కూడా నాటుకోళ్ల వ్యాపారం రోజురోజుకూ పెరుగుతోంది.



రూ.లక్షల్లోనే పందెం పుంజులు

పందెం పుంజులు, నాటుకోళ్లు 400 పెంచగలిగితే ఏడాదికి రూ.6 లక్షలకుపైగా నికరాదాయం పొందొచ్చు. మా దగ్గర లక్ష రూపాయల విలువైన పందెం పుంజు నుంచి రూ.20 వేల కోడిపెట్టలు ఉన్నాయి. సంక్రాంతి సమయంలో పందెం పుంజుల్లో కొన్ని రకాలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. అప్పుడు ఒక్కొక్క పందెం కోడి ధర రూ.లక్షల్లో ఉంటుంది. **- సాయికృష్ణ, తాటాకులపాలెం**





సీఎం చంద్రబాబును కలిసి సమస్యలను వివరిస్తున్న డాక్టర్ లక్ష్మి

'దర్శి' అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి

సీఎంకు విజ్ఞప్తి చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. అమరావతిలో మంగళవారం సీఎంను కలిసిన సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దర్శి నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయని, అభివృద్ధికి తక్షణమే నిధులు ఇవ్వాలని కోరారు. వర్షాలకు సాగులో ఉన్న మిర్చి, బొప్పాయి, సజ్జ, పత్తి, వైట్‌బర్లీ, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు.

విమానాశ్రయం అభివృద్ధిపై కేంద్రమంత్రికి విజ్ఞప్తి

దొనకొండ : దొనకొండలో బ్రిటీష్ కాలంనాటి విమానాశ్రయం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లి వివరించినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన డ్రోన్ సమ్మిట్ సమావేశంలో ఆమె పాల్గొని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో దొనకొండ విమానాశ్రయం అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుపై చర్చించారు. దొనకొండలో విమానాశ్రయానికి ఉన్న భూమికి అదనంగా కేటాయించిన భూమి తదితర అంశాలతో విమానాశ్రయం నిర్మాణ సాధ్యసాధ్యాలను వివరించారు. ప్రభుత్వ భూముల్లో వలసలు నివారించే లక్ష్యంతో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు చర్యలు చేపట్టి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి పూర్తి నివేదికతో అధికారులతో కలిసి రావాలని, చర్చించి తగిన నిర్ణయం తీసకుందామని మంత్రి హామీ ఇచ్చినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు.

వామ్మో.. వాగు!

● భారీ వర్షాలకు ఆరడుగుల గొయ్యి ● పది రోజులుగా రాకపోకలు బంద్

మర్రిపూడి, అక్టోబరు 22 : మండల కేంద్రమైన మర్రిపూడి పంచాయతీ పరిధిలోని పిచ్చిరెడ్డికుంటకు వెళ్లేదారిలో వాగు ప్రమాదభరితంగా మారింది. చిన్ననర్సింహులు వాగు, పందికుంట వాగు కలయికతో వర్షాల సమయంలో అక్కడ నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామానికి చెందిన వంద కుటుంబాల రైతులు పొలాలకు ఈదారి నుంచే వెళ్లాల్సి ఉంది. ఇటీవల వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో అక్కడ ఆరు అడుగులలోతున గొయ్యిపడింది. దీంతో పది రోజులుగా పొలాలకు వెళ్లలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కంది, బొబ్బర, పొగాకు వంటి పంటలను సాగుచేసిన వారు వాటిని పరిశీలించేందుకు కూడా వెళ్లలేకపోతున్నారు. రెండు సంవత్సరాల క్రితం ఆకస్మికంగా వచ్చిన వరదలకు రైతులు, కూలీలు వాగు అవతల ఒడ్డున చిక్కుకుపోయారు. అప్పట్లో తాడు, నిచ్చెనల సహాయంతో వారిని కాపాడారు. ఈ వాగుపై చప్టా నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా రైతులు కోరుతున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతోనైనా రహదారికి పడిన గండిని పూడ్చించాలని రైతులు కోరుతున్నారు. శాశ్వత పరిష్కారంగా నేల చప్టా నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పిచ్చిరెడ్డికుంట దారిలో ప్రమాదకరంగా ఉన్న వాగు

పొదుపు సంఘాలకు రూ.100 కోట్ల రుణాలు

● డాక్యుమెంటేషన్ పూర్తి చేయాలని పీడీ ఆదేశం

ఒంగోలు నగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పొదుపు సంఘాలకు రూ.100 కోట్ల రుణాలను అందించేందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా డీఆర్‌డీఏ, వెలుగు పీడీ వసుంధర కోరారు. మంగళవారం స్థానిక వెలుగు టీటీడీసీ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని కెనరా బ్యాంకు బ్రాంచిల ద్వారా రూ.100 కోట్ల రుణాలను ఇచ్చేందుకు పొదుపు సంఘాలకు గుర్తించటం, వారికి రుణాలు అందించేందుకు అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఈ రుణాలతో పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకుని జీవనోపాధులను పెంపొందించుకోవాలని కోరారు. ఈ నెల 25వ తేదీన స్థానిక ఎ1 ఫంక్షన్ హాలులో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని రుణాలను అందజేస్తామని తెలిపారు. సమావేశంలో కెనారా బ్యాంకు అధికారులు, వెలుగు కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రతి ఒక్కరికీ భరోసా

● ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం (పుల్లలచెరువు) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ భరోసా ఉంటుందని, వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మంగళవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, క్లస్టరు ఇన్‌చార్జులు, బూత్ లెవల్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తను, వారి కుటుంబ సభ్యులకు పార్టీ సభ్యత్వం కట్టించాలన్నారు. రూ.100తో సభ్యత్వం తీసుకుంటే ప్రమాదబీమా రూ.5 లక్షలు, మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందుతాయన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

కొండపి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కొండపిలో ఆర్టీసీ బస్‌స్టేషన్ మహిళలతో మాట్లాడారు. తెలంగాణలోలాగా ఇక్కడ కూడా వెంటనే అమలు చేయాలని కోరారు.

25 నుంచి పశుగణన

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు 21వ అఖిల భారత పశుగణన సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

మార్కాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అధికారి పార్టీ కార్మికుల ఉపాధిని ఊడగొట్టే చర్యలను మానుకొని అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రాత్రి ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22: జిల్లాలో భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో మంగళవారం నుంచి గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రీ సర్వేలో జరిగిన అనేక అవకతవకలతో భూ యజమానులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు కూటమి ప్రభుత్వం గుర్తించింది. దీంతో కూటమి ప్రభుత్వం రీ సర్వే జరిగిన గ్రామాల్లో సభలను నిర్వహించి వాటి ద్వారా సమస్యలను పరిష్కరించేలా విధంగా శ్రీకారం చుట్టింది. మండల స్థాయి గ్రామసభలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల భూసర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్‌లు ఈ గ్రామసభల్లో పాల్గొన్నారు. మంగళవారం నుంచి వచ్చేనెల 22 వతేదీ వరకు గ్రామసభలు నిర్వహించేందుకు మండల స్థాయిలో గ్రామాల వారీగా షెడ్యూల్‌ను కూడా ప్రకటించారు. దాని ప్రకారం గ్రామ సభలు నిర్వహించి అందుకు సంబంధించిన సమస్యలను రైతులతో చర్చించి వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో డివిజన్ స్థాయి ఆర్డీవోల పర్యవేక్షణలో ఈ గ్రామ సభలు జరుగుతున్నాయి. 298 రెవెన్యూ గ్రామాల్లో భూములపై గ్రామసభలను నిర్వహిస్తున్నారు.

టీజేఆర్ అక్రమాలపై సీఐడీకి ఫిర్యాదు చేస్తాం

● మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సృజన్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలంలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబు చేసిన అవినీతి, అక్రమాలపై సీఐడీకి ఫిర్యాదు చేయనున్నట్లు మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్ తెలిపారు. మంగళవారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో జరిగిన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా హోంశాఖ మంత్రి అనితపై టీజేఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. సుధాకర్‌బాబు రాజకీయజీవితమంతా అవినీతి, అక్రమాల మయమని ఆరోపించారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్ల కాలంలో సంతనూతలపాడు నియోజకవర్గంలో దళితులు, బడుగులు, నిరుపేదల వద్ద నుంచి వారికి ఇచ్చిన ఉద్యోగానికి లక్షలు వసూలు చేసి దోచుకున్నారన్నారు. మల్లవరంలో పంట కాలువను అక్రమించి భవనం నిర్మించడం వాస్తవం కాదని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాల్లో కూరకపోయిన టీజేఆర్, హోంమంత్రి అనితపై అవాకులు చవాకులు పేలితే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.



వర్షానికి ముందు ఇలా..

చేతిదాకొచ్చి నీటిపాలు

- సజ్జ పంట వర్షార్పణం
- హతాశులైన రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



వర్షం తరువాత ఇలా..

చీమకుర్తి, అక్టోబరరు 22(ఆంధ్రజ్యోతి) : సజ్జ పంట సాగుచేసిన రైతులపై ప్రకృతి పగబట్టింది. పంట విత్తిన నాడు కాలానికి విరుద్ధంగా కాసిన ఎండలతో పంట తొలినాళ్లలోనే ఎండిపోగా, శ్రమకోర్చి నీరుపెట్టిన పంట ఏపుగా పండి మరికొద్ది రోజుల్లోనే చేతికందే వేళ కురుస్తున్న వర్షాలతో కళ్ల ముందే కంకులు ఎందుకు పనికిరానికిపోకుండా పోతున్నాయి. దీంతో సజ్జపంట సాగుచేసిన రైతుల పరిస్థితి హృదయవిదారకంగా మారింది. పెట్టుబడిలో కనీస మొత్తం కూడా రాని దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆపన్న హస్తం అందించాలని పంట నష్టపోయిన రైతులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

500 ఎకరాలకు పైగా..

మండల పరిధిలో మంచికలపాడు, పల్లామల్లి, బండ్లమూడి, బూదవాడ తదితర ప్రాంతాల్లో దాదాపు 500ఎకరాలకు పైగా ఖరీఫ్ పంటగా సజ్జను రైతులు సాగుచేశారు. కొంతమేర నెలకొన్న బెట్ట పరిస్థితుల్లో కొంత పంట నష్టపోవటం జరిగింది. మిగిలిన పంట బాగా పండి కంకులు వచ్చి ఇంకా రెండురోజుల్లో కోతకు సిద్ధమవుతుండగా ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతుండటంతో కంకులు కాస్తా రంగుమారాయి. మొలకలు సైతం వచ్చాయి. కాస్త తెరిపించటంతో కంకులు కోసి ఆరబెట్టుకోగా మంగళవారం పల్లామల్లి కురిసిన వర్షం మరింత నష్టాన్ని మిగిలించింది. గ్రామంలో మరో పదిఎకరాల్లో కోతకు వచ్చిన పంటను కోయలేక చేలోనే కంకులు మొలకలు రావటం చూసి రైతులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన చెన్నంశెట్టి ఆంజనేయులు తన నాలుగు ఎకరాల్లో పంట వేయగా రెండు ఎకరాలు ఎండలకు ఎండిపోగా, మిగతా రెండు ఎకరాల్లో బాగా పండింది. అయితే ఈ పంట వర్షార్పణం కావటంతో దిగాలు పడ్డారు. ఇదే పరిస్థితి మిగతా గ్రామాల్లో పంట సాగుచేసి వర్షం వల్ల కోతకోయలేని వారికి నెలకొంది.



రంగుమారిన కంకి

కన్నీటి పర్యంతం అవుతున్నాం



నాలుగు ఎకరాల్లో సజ్జ పంట సాగుచేశా. ఎండలకు నీరందివ్వలేక రెండు ఎకరాల్లో ముందే పంట నష్టం అయ్యింది. చేతికి వచ్చిన సమయంలో వర్షం కారణంగా కళ్లముందే నాశనం కావటం తట్టుకోలేకపోతున్నా. ప్రభుత్వం ఆదుకోవాలి.

- చెన్నంశెట్టి ఆంజనేయులు, పల్లామల్లి

నష్టం వివరాల నమోదు ప్రారంభించాం



మండలంలో వర్షం వలకల దాదాపు 50 హెక్టార్లలో సజ్జ పంటకు నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా గుర్తించాం. మంగళవారం నుంచి వివరాలు నమోదు చేస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు అందించే సాయం నష్టపోయిన రైతులకు అందుతుంది.

- భాస్కర్, ఏవో, చీమకుర్తి

రోడ్డు ప్రమాదాలు నివారించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం సాయంత్రం రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సింగరాయకొండ వద్ద జాతీయ రహదారిపై విమానాల ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం నిర్మించిన స్ట్రెచ్‌లో అధికంగా ప్రమాదాలు జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ శాశ్వత ప్రాతిపదికన లైటింగ్, ఇతర వసతులు ఏర్పాటు చేసేందుకు విమానయానశాఖ నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉందని సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు స్ట్రెచ్‌లో ప్రత్యామ్నాయంగా వాటర్ బ్యారికేడ్స్, రేడియం స్టిక్కర్లు, ఇల్యుమినేషన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీధి వ్యాపారులు రహదారులను ఆక్రమించకుండా చూడాలన్నారు. జాతీయ రహదారుల్లో కలుస్తున్న సర్వీసు రోడ్లలో అవసరమైన స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు, వైద్యులు, ఇతర అధికారులు ఐ- ర్యాడ్ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మర్రిచెట్లపాలెం నుంచి చీమకుర్తి వరకు దెబ్బతిన్న రహదారిని వెంటనే మరమ్మతులు చేసేందుకు క్వారీల యజమానుల సహాయం తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీటీసీ సుశీల, జీజీహెచ్ సూపరిటెండెంట్ దుర్గాదేవి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ దేవానంద్, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, వ్యవయశాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఫంక్షన్ హాలు ప్రారంభం



ఫంక్షన్‌హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం బొద్దులూరివారిపాలెంలో నూతనంగా నిర్మించిన సూర్యావతి ఫంక్షన్‌హాలును ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మంగళవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన దామచర్లకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఫంక్షన్లు నిర్వహించేందుకు ప్రత్యేకంగా హాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తకోట వాగుకు మళ్లీ వరద

నాగులుప్పలపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి మండల పరిధిలోని కొత్తకోట వాగుకు మరలా వరదనీరు చేరింది. మేదరమెట్ల, రావినూతల ప్రాంతాలలో మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి దిగువప్రాంతమైన కొత్తకోట వాగుకు సాయంత్రం వరద నీరు చేరి నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు దృష్టి సారించి కొత్తకోట వాగుపై బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

వాహనచోదకులకు జరిమానా

టంగుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం సింగరాయ కొండ సీఐ హజరత్తయ్య, ఎస్‌ఐ నాగమల్లీశ్వరరావు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్‌తోపాటు లైసెన్స్, ఇతర ధ్రువీకరణ పత్రాలు లేని 20 మందికి రూ.15,300 జరిమానా విధించారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ అనూక్

పొన్నలూరు (కొండపి): ద్విచక్రవాహనదారులు వాహనాలను నడిపేట ప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ అనూక్ సూచించారు. మంగళవారం ఆయన పొన్నలూరులోని ప్రధాన రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలులేని వారికి జరిమానా విధించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



వీఏఏ సౌమ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

టంగుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈమేరకు కొణిజేడులోని సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.సౌమ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణం అందేలా చూడాలన్నారు. అన్ని రాయితీలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం టంగుటూరు మండల నాయకులు వి.మోజెస్, షేక్ మీరాస్, మక్కెన శ్రీనివాసరావు, ఎం.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదయాన్నే రేషన్ పంపిణీ ప్రారంభించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రవి

సింగరాయకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే ఎండీయూలు కార్డుదారులకు రేషన్ పంపిణీ ప్రారంభించాలని తహసీల్దార్ రవి ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల ఎండీయూ, రేషన్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ 200 నుంచి 250 కార్డులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. చౌక ధరల దుకాణాల వద్ద స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివరామకృష్ణ, ఆర్ఐ వి.ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

సింగరాయకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డి.జయమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి 25 వరకూ మూలగుంటపాడులో, 22, 23 తేదీల్లో శానంపూడి, 24వ తేదీ కనుమళ్ల, 25న సోమరాజుపల్లిలో క్యాంపులు ఉంటాయని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కమాండోకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు, ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్

కొండపి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మండలంలోని పెరిదేపి గ్రామంలోని మోటా ఆంజనేయులు స్మారకస్థూపం వద్ద మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కొండపి ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్, సిబ్బంది నివాళులర్పించారు. జూనియర్ కమాండో అయిన ఆంజనేయులు 2008లో ఆంధ్ర-ఒడిసా సరిహద్దులోని బలిమెల వద్ద మావోయిస్టుల దాడిలో మరణించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆంజనేయులు త్యాగం మరువలేనిదన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో రౌడీషీట్ నమోదై ఉన్న షీటర్లకు మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ అజయ్‌బాబు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బంది కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో సమాజంలో మంచిపేరు సంపాదించుకుని జీవనం గడపాలని తెలిపారు. ఎక్కడికైన వెళ్లినా స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్‌ఐ బి.శ్రీకాంత్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రశాంతంగా జీవించాలన్నారు. గ్రామాల్లో వివాదాలు, అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవని, నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని హెచ్చరించారు.







సంతనూతలపాడు-మైనంపాడు జంక్షన్, ఎండ్లూరు డొంకవద్ద స్పీడ్ బ్రేకర్ల వద్ద గోతులు

పోలీస్‌స్టేషన్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద.

బ్రేక్ వేస్తే బోల్తా..!

స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రమాద ఘంటికలు

రోడ్లపై పెద్దపెద్ద గోతులు ● వాహనదారుల భయాందోళన

సంతనూతలపాడు, అక్టోబరు 22: సంతనూతలపాడు మండలంలో పలుప్రాంతాల్లోని రహదారులపై ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద పెద్ద గుంతలు ఏర్పడి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంతనూతలపాడులోని కర్నూల్‌రోడ్డుపై మూడు ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్ల ముందు పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద, ఎండ్లూరు డొంకవద్ద, అలాగే సంతనూతలపాడు నుంచి వెళ్లే మైనంపాడు జంక్షన్ సమీపంలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలో నీరు నిలిచి వాహనదారులు గుర్తించలేక కింద పడి గాయాలపాలవుతున్నారు. నిత్యం ఈ రోడ్డుపై రోజూ వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అటువంటి కర్నూల్‌రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్ల వద్ద పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి సంతనూతలపాడు నుంచి మద్దులూరు వెళ్లే రోడ్డులనోనూ ఉంది. అధికారులు గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్డీవో లక్ష్మీప్రసన్న

రీ సర్వే గ్రామాల్లో సభలు ప్రారంభం



నందిపాడులో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న



జీడీకంద్రిగలో పాసు పుస్తకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

మద్దిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆదేశించారు. మంగళవారం నందిపాడులో భూ సర్వే తహసీల్దార్ సృజనకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ రైతులు తమ రెవెన్యూ సమస్యల గురించి అర్జీలు ఇస్తే క్షేత్రస్థాయిలో తక్షణమే వాటిని పరిష్కరించాలని సూచించారు. విధులపట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

47 అర్జీలు

సంతనూతలపాడు: వి.గుడిపాడు గ్రామంలో మంగళవారం జరిగిన రీసర్వే, ఇతర భూసమస్యలకు సంబంధించి 47 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. సర్పంచ్ కె.పుష్ప అధ్యక్షతన జరిగిన సభలో తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యల అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ మాబు సుభానీ, ఆర్ఐ రామ్‌తేజ, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరి బాబు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల వెల్లువ

చీమకుర్తి: భూముల రీసర్వే చేసిన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారించే నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక రెవెన్యూ సదస్సుల గ్రామసభలను మంగళవారం నుంచి చేపట్టారు. ఈ మేరకు మంచికలపాడు గ్రామంలో నిర్వహించిన సదస్సులో సమస్యలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ సమస్యలపై ఆందోళన చెందవద్దని, అన్నింటిని సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు. విస్తీర్ణంలో వ్యత్యాసంపై 10 అర్జీలు, జాయింట్ పొలాల విభజన కోసం 13, మ్యూటేషన్‌కు 11 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జీడీకంద్రిగలో..

కొండపి: రీసర్వే పూర్తయిన గుర్రప్పడియ దుర్భాకులవారి కంద్రిగలో గ్రామ సభ నిర్వహించారు. విస్తీర్ణంలో తేడాలు, భూమి యాజమాన్య హక్కులు నమోదుకాకపోవడం, జాయింట్ పట్టా సమస్యలపై పలువురు రైతులు తహసీల్దార్ పి.మురళికి అర్జీలు అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కాశయ్య, మండల సర్వేయర్ ఫయాజ్, ఆర్ఐ ఎం.శ్రీనివాసులు, వీఆర్వోలు మాధవి, రామాంజనేయులు, గ్రామ సర్వేయర్ గాలెయ్య, టీడీపీ గ్రామ నాయకుడు మారెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

● ఎంపీడీవో మహాలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీడీవో మహాలక్ష్మి

నాగులుప్పలపాడు అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో వై.మహాలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. వర్షాల వల్ల నీరు నిలిచి దోమల వ్యాప్తి అధికమవుతుందని, తద్వారా ప్రజలు విషజ్వరాల బారిన పడే ప్రమాదముందని చెప్పారు. తాగునీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. సైడు కాలువల్లో పూడికలు తీయించి నీరు సక్రమంగా వెళ్లేలా చూడాలని, ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్ చల్లించాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురళీకృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చూడాలని ఎంపీడీవో వి.జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడు మండల కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వర్షాలకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. డాక్టర్ ఆనంద్ మోహన్ మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపరచాలి

సంతనూతలపాడు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వాటర్ ట్యాంకులు, సైడ్‌కాలువలు శుభ్రం చేసేలా చూడాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమన్, ఏఈ శాంతిప్రియ, సూపర్‌వైజర్ పద్మావతి, నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● వ్యవసాయశాఖాధికారులు



బండ్లమూడిలో కందిపంటను పరిశీలిస్తున్న ఏవో భాస్కర్

మర్రిపూడి, అక్టోబరు 22: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో వెంకటేష్ కోరారు. మంగళవారం మండలంలోని అగ్రహారం, కెల్లంపల్లి గ్రామాల్లో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాటాడారు. రైతులు పచ్చిశనగ విత్తనాల కోసం పేర్లను ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపించాలన్నారు. చీడపీడలు ఆశించగానే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి వారు ఇచ్చే సలహాలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా అగ్రహారంలో కందిపైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి కృష్ణ, వ్యవసాయ సహాయకుడు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పొందూరు, ఎం.నిడమలూరుల్లో..

టంగుటూరు : శనగలో విత్తనశుద్ధి ప్రధానమని మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలత అన్నారు. పొందూరు, ఎం.నిడమలూరు పంచాయతీ కార్యాలయాల వద్ద మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు స్వర్ణలత పలు సూచనలు చేశారు. తహసీల్దార్ అంజనేయులు మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపుకార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ధనలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ అధికారి వై.వెంకట్రావు, ఎం.నిడమలూరు ఉపసర్పంచ్ కాకుమాను సుబ్బారావు, పొందూరు ఎంపీటీసీ సభ్యుడు పమిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో బహుళ ప్రయోజనం

చీమకుర్తి: పచ్చిరొట్ట పైరులతో రైతులకు బహుళ ప్రయోజనం చేకూరుతుందని ఏవో భాస్కర్ తెలిపారు. మండలంలోని బండ్లమూడి, తొర్రగుడిపాడు గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగుచేసిన వరి, కంది పంటలను అధికారులు పరిశీలించారు. సస్యసంరక్షణా చర్యలను, యాజమాన్య పద్ధతులను వివరించారు. కౌలురైతులు కార్డులను తీసుకొని ఈ-క్రాప్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● జూనియర్ సివిల్ న్యాయాధికా నిఖిల్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న న్యాయాధికారి నిఖిల్‌రెడ్డి

సింగరాయకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కందుకూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి నిఖిల్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. తొలుత తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని కళాశాల బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన పరిశీలించారు. ఆహర పట్టికలో సూచించిన విధంగా భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. బీసీ బాలికల హాస్టల్ పరిసర ప్రాంతాల్లో చీకటిగా ఉండటాన్ని గుర్తించి లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ ఆహారాన్ని రుచి చూశారు. రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సై మహబూబ్‌బాషా, పంతగాని వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

● జిల్లా ఉప కార్మిక కమిషనర్ గాయత్రి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకుంటే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రి హెచ్చరించారు. బాల కార్మికుల విముక్తి కోసం మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సహాయ కార్మిక అధికారి ఎం.ఎలిజబెత్తమ్మ నగరంలో గాంధీరోడ్డు, వీఐపీరోడ్డు, సౌత్ బైపాస్‌రోడ్డుల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నలుగురు బాల కార్మికులను గుర్తించి సంబంధిత దుకాణాదారులపై కేసులు నమోదు చేశారు. 16ఏళ్ళలోపు బాలలతో పనిచేయిస్తే వారిని బాల కార్మికులుగా పరిగణించి ఆయా సంస్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా బాలలను పనిలో పెట్టుకున్న తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు, పోలీస్, సోషల్ వెల్ఫేర్, డీఎల్ఎస్ఏ, శిశు సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

వైద్యకళాశాలకు వెంకయ్య పేరుపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ పతకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య పేరును మచిలీపట్నం వైద్యకళాశాలకు పెట్టేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల జైకృష్ణ బీసీ సమితి వ్యవస్థాపకులు, ద్రావిడ దేశం కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంలోనే అనేక ఆర్థిక సంస్కరణలు అమలు చేయడమే కాకుండా బుడమేరు వరదల వల్ల ఏర్పడిన విపత్కర పరిస్థితులను సైతం యుద్ధప్రాతిపదికన అనతి కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికమించారన్నారు. ప్రస్తుతం మరుగునపడ్డ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నేటి యువత తెలుసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయని పేర్కొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నిర్మూలన



మాట్లాడుతున్న ఏపీఎం నరేంద్ర

నాగులుప్పలపాడు అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే హెచ్ఐవీ నిర్మూలన సాధ్యమవుతుందని ఏపీఎం బత్తుల నరేంద్ర పేర్కొన్నారు. ఎయిడ్స్ నిర్మూలన, నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నాగులుప్పలపాడులోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా గ్రూపు మహిళలకు మీకు తెలుసా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న హెచ్ఐవీ వల్ల ప్రపంచంలో ప్రతి ఏటా లక్షల మంది మరణిస్తున్నారని చెప్పారు. దాని బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 2030 నాటికి ఎయిడ్స్‌ను సమూలంగా నిర్మూలిచాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేయాలని సూచించారు. ఎవరైనా హెఐవీ బారిన పడితే ప్రభుత్వ ఐసీటీసీ కేంద్రాలను సందర్శించి మందులు, వైద్య సలహాలను పొందాలన్నారు. బాధితుల పట్ల వివక్షత చూపకూడదని చెప్పారు. టోల్‌ఫ్రీ నంబరు 1097పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీఐ ఎం.మల్లేశ్వరి సిబ్బంది కృష్ణవేణి, దివ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రేపు పీడీఎస్‌యూ మహాసభ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో ఈనెల 24వతేదీన జరగనున్న పీడీఎస్‌యూ అర్థశతాబ్ద ఉత్సవాల మహాసభను విజయవంతంచేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక మాదాల నారాయణస్వామిభవన్‌లో మంగళవారం ఈ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, శాస్త్రీయ విద్యా సాధన కోసం 1974లో ఏర్పడిన పీడీఎస్‌యూ గత 50 ఏళ్ళ నుంచి నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. ఈ మహాసభల్లో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు నవంబరు 5వతేదీన విజయవాడలో పీడీఎస్‌యూ సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్యామ్, జిల్లా కార్యదర్శి జెల్లి వెంకటేష్, కోశాధికారి కోటయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

25న వినికిడి యంత్రాల పంపిణీ

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 22 : రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం, దీన దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ద్వారా జిల్లాలో వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి ఈనెల 25న ఒంగోలులోని ప్రభుత్వఆస్పత్రిలో ఉచిత వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ భగీరథ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి యంత్రాలను అవసరమైన వారికి ఉచితంగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే వారు రేషన్‌కార్డు జీరాక్స్ ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టులు, గతంలో వినికిడి పరీక్ష చేయించుకున్న నివేదికలతో హాజరుకావాలని వారు కోరారు.

అయోడిన్ రుగ్మతలపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ భగీరథి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అయోడిన్ లోపం వల్ల చిన్నారులలో వచ్చే రుగ్మతలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్రీయ బాల్య స్వాస్థ్య జిల్లా అధికారి డాక్టర్ భగీరథి కోరారు. స్థానిక రామనగర్‌లోని పాఠశాలలో మంగళవారం అయోడిన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల చిన్నారులలో ఎదుగుదల లోపించడం, బుద్ధి మాంద్యం, పెద్దల్లో థైరాయిడ్ సమస్యలు వస్తాయని తెలిపారు. అయోడిన్ శారీరక పెరుగుదలకు, అభివృద్ధికి, మానసికవృద్ధి, గర్భస్థపిండం, చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదలకు, తెలివితేటలకు దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయితీపై శనగవిత్తనాలు : ఏవో



మాట్లాడుతున్న ఏవో పావని

సంతనూతలపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి రైతు సేవాకేంద్రాల ద్వారా రాయితీ విత్తనాలను అందిస్తున్నట్లు ఏవో పావని తెలిపారు. మంగళవారం మండలంలోని గుర్వారెడ్డి పాలెం, రుద్రవరం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనగ జేజీ-11 రకం క్వింటా ధర రూ. 9,400 కాగా సబ్సిడీపై రూ.7,050కే అందిస్తున్నట్లు తెలిపారు. కేఏకే-2 రకం రైతుకు రూ.9,075కు అందిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన రైతులు సమీప రైతుసేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎరువులు, పురుగుల మందులను అందిస్తామని పేర్కొన్నారు.

మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానం

● దోమలతో అల్లాడుతున్న జనం



గ్రామంలో పేరుకున్న మురుగు

మద్దిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారయింది. మురుగు కుంటల్లో నీరు చేరి దోమలు వృద్ధి చెంది ప్రజలను పీక్కు తింటున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటితే దోమల దండయాత్ర ప్రారంభమవుతుంది. ప్రధానంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో అవి దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. ఆయా ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్, మలాథిన్ పిచికారి సక్రమంగా జరగటం లేదు. ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నా వాటిని వాడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక శివారు కాలనీల్లో దోమలు బెడద మరింత ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అవీ..ఇవీ

మద్యం లారీ బోల్తా

• ఎదురుగా వస్తున్న గేదెను తప్పిస్తుండగా ఘటన



బోల్తాపడిన మద్యం లారీ

గిద్దలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం చెర్లోపల్లి గ్రామసమీపంలో ఎదురుగా వస్తున్న గేదెను తప్పించబోయి మద్యం లోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. ఈ లారీ నంద్యాల నుంచి విజయవాడకు మద్యం తీసుకెళుతోంది. ఈక్రమంలో రోడ్డు అంచులోని పొలాల్లో బోల్తా పడింది. డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఎలాంటి ఆస్తినష్టం సంభవించ లేదు. మద్యం సీసాలు అన్నీ ప్లాస్టిక్‌వి కావడంతో పగిలిపోలేదని, మద్యానికి ఎలాంటి నష్టం లేదని, లారీకి మాత్రమే డ్యామేజ్ జరిగిందని ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న స్కిల్‌డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఫిరోజ్‌గాంధీ

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాబ్‌మేళాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ మార్కాపురం ఇన్‌చార్జ్ ఫిరోజ్ గాంధీ అన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీకే శిక్షణ కేంద్రంలో మంగళవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలలో ఇన్నోవా స్టోర్స్ ఎస్‌బీఐ కార్డ్స్, నవభారత్ ఫర్టిలైజర్, కల్లం టెక్స్‌టైల్స్ కంపెనీలు పాల్గొన్నాయి. 82 మంది జాబ్‌మేళాకు హాజరయ్యారు. వీరిలో 22 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 12 మంది రెండో రౌండ్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.12,500 నుంచి రూ.20000 వరకు వేతనం ఇస్తారని ఎంప్లాయిమెంట్ కార్యాలయ ప్రొఫెసర్ రమేష్ బాబు తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొని ఒకరి మృతి

బేస్తవారపేట,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ట్రాలీ ఆటో ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటుచేసుకొంది. ఎస్సై రవీంద్రారెడ్డి కథనం మేరకు మార్కాపురం మండలం నికరంపల్లె గ్రామానికి చెందిన అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి(55) సోమవారం తర్లుపాడు మండలం గోల్లపల్లి గ్రామంలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. రాత్రి హైవేలోని ఒక లాడ్జిలో బస చేశాడు. మంగళవారం ఉదయం తన గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బేస్తవారపేట వైపు నుండి గిద్దలూరు వైపునకు వెళుతున్న బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో రామకృష్ణారెడ్డిని వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపినట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు.

ఆరోపణలపై విచారణ

గిద్దలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ ఎస్.సూరిబాబుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి గుంటూరు డీసీహెచ్‌ఎస్ మజీదాబీ మంగళవారం విచారించారు. మత్తు డాక్టర్‌గా బాధ్యతలు నిర్వహించాల్సిన డాక్టర్ సూరిబాబు ఆపరేషన్లు చేసేవాడని, మందుల కొనుగోలులో అవినీతికి పాల్పడ్డాడని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించాడని ఆర్‌టీఐ కార్యకర్త యామా సంజయ్ వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు గతంలో విచారణ చేపట్టినప్పటికీ చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ యామా సంజయ్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో డాక్టర్ మజీదాబీ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. సిబ్బంది, డాక్టర్లను విచారించి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డాక్టర్ మజీదాబీ విలేకరులకు వివరించారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

పొదిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీని తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని కరుణా ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వినియోగదారులు గ్యాస్ కనెక్షన్‌ను బేసిక్ సేఫ్టీ చెకప్ చేసుకోవాలన్నారు. వీటి కోసం తమ సిబ్బందిని సంప్రదించాలన్నారు. వీటికి ఎలాంటి పైకము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమానికి ఇండేన్‌గ్యాస్ విజయవాడ డివిజన్ సేల్స్ హెడ్ భాస్కర్‌రావు పాల్గొని మాట్లాడారు. వాడుక సమయంలో మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని వెలిగించి మరొకపనికి వెళ్ళవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ దుగ్గినేని భాస్కర్, ప్రిన్సిపల్ కుమార్, ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

రీసర్వే చిక్కులపై కదలిక

- జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన గ్రామసభలు
- సమస్యల పరిష్కారం కోసం రైతుల ఎదురుచూపు
- ప్రస్తుతానికి వినతుల స్వీకరణకే పరిమితం

గ్రామాల్లో రైతాంగం ఎదుర్కొంటున్న రీసర్వే సమస్యపై ప్రభుత్వంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ముందుగా రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. సమస్యల పరిష్కారం ఎప్పుడనేది అధికారులకు స్పష్టత లేనప్పటికీ, ప్రజల నుంచి అర్జీలు మాత్రం స్వీకరిస్తున్నారు. మరోవైపు రైతాంగం మాత్రం సమస్యలను తర్వగా పరిష్కరించాలని కోరుకొంటోంది.

మార్కాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పేరుతో గత వైసీపీ ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. మండలానికి ఒక చిన్న గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని భూములను సర్వే చేసింది. ఆయా గ్రామాల్లోనే లోపాలు తలెత్తినా వాటిని సవరించకుండా మండలంలోని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వేను కొనసాగించింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ బొమ్మలు ముద్రించిన నూతన పాసుపుస్తకాల మంజూరు, సర్వే రాళ్ల ఏర్పాటుపైనే నాటి ప్రభుత్వం దృష్టిసారించింది. వాస్తవానికి ప్రజలకు సర్వేతో మేలు జరగాలి. కానీ రీసర్వేతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రధానంగా భూముల విస్తీర్ణాలు తగ్గడం, ఒకరి భూమిని మరొకరి పేరున నమోదు చేయడం, పాతసర్వే నంబర్లస్థానే ఎల్‌పీ నంబర్లు కేటాయించడంతో రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారికి చిక్కులు ఏర్పడ్డాయి. ఆయా గ్రామాల్లో క్రయ విక్రయాలు చేసుకునేందుకు తీవ్ర అవరోధం ఏర్పడింది. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వాళ్లు రీషెడ్యూల్ చేసుకోవడానికి లేకపోవడంతో రుణాలు మొత్తం చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది.

చిక్కులు తీర్చాలని రైతుల మొర

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసింది. రీసర్వేపై నిర్ణయం తీసుకోవడానికి నెలలపాటు వేచి చూసింది. సర్వేను కొనసాగిస్తామని నిర్ణయించినప్పటికీ, స్పష్టమైన విధి విధానాలు రాలేదు. దీనికి తోడు మీ కోసం కార్యక్రమానికి సైతం రీసర్వే సమస్యలే ఎక్కువగా వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఇబ్బందులు పడుతున్న వారినుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా మంగళవారం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మండలస్థాయి రెవెన్యూ అధికారులు, సర్వే విభాగం మండల, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. ప్రధానంగా ఏ విభాగానికి సంబంధించిన సమస్యను ఆ విభాగంలో అర్జీల రూపంలో స్వీకరించి పొందుపరుస్తున్నారు. విస్తీర్ణంలో తేడాలు, ఎల్‌పీ నంబర్లలో తేడాలపై ఎక్కువగా అర్జీలు అందాయి. ఈ అర్జీలపై ప్రస్తుతానికి ఆన్‌లైన్‌లో మార్పులు చేర్పులు చేయడానికి మండల స్థాయి అధికారులకు అవకాశం రాలేదు. ఈ అర్జీలను ఎలా సరి చేయాలనే దానిపై ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని డివిజన్‌లోకి ఓ తహసీల్దార్ పేర్కొవడం గమనార్హం. ఏదిఏమైనా రీసర్వేతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నందున త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



తర్లుపాడు మండలం కారుమానుపల్లె అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఉదయ్‌కుమార్



గొబ్బూరులో అర్జీలు స్వీకరిస్తున్న డీటీ ఖలీల్

రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తాం

తర్లుపాడు : గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను గ్రామసభల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలో మిర్జపేట పంచాయతీ కారుమానుపల్లెలో రీసర్వే జరిగిన గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది రైతులు తమ పొలం కంటే తక్కువ నమోదు అయిందని ఫిర్యాదు చేశారు. తప్పులు ఎందుకు జరిగాయంటూ తహసీల్దార్‌తో రైతులు వాగ్వివాదం చేశారు. ప్రస్తుతం సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

● రాయి ఈశ్వర్‌రెడ్డికి చెందిన సర్వేనెంబర్ 38-1లో 2.40 ఎకరాలు ఉండగా 40 సెంట్లు తక్కువగా నమోదైంది. మరో రైతు టి.ఈశ్వర్‌రెడ్డికి చెందిన 2.97 సెంట్ల భూమి ఉండవల్సి ఉండగా 5.31 ఎకరాల భూమి చూపుతూ ఎక్కువగా నమోదైనట్లు అర్జీలు ఇచ్చారు.

● దొండపాటి నడిపి వెంకటేశ్వర్లుకు 11-1లో 3.75 ఎకరాల భూమికి గాను 3.02 ఎకరాల భూమి మాత్రమే నమోదైనట్లు వాపోయారు. సర్వే నెంబర్ 42-3లో 86సెంట్ల భూమి ఉండాల్సి ఉండగా అసలు ఆన్‌లైన్ లో కనిపించలేదు. ఇలాంటి సమస్యలపై మొత్తం 65 అర్జీలు వివిధ సమస్యలపై వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వో నాగరాజుకుమారి, సర్వేయర్ జి.వాణి, గ్రామ సర్వేయర్లు శ్రీను, రవళి, రవీంద్ర, మస్తాన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : మండలంలోని నాగంపల్లి, వింజవర్తిపాడు గ్రామాలలో మంగళవారం జరిగిన రీసర్వే గ్రామ సభలో తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. రీసర్వేలో మీభూమికి సంబంధించిన కొలతలు, విస్తీర్ణంలో ఏటువంటి తేడాలు ఉన్నా, మీ గ్రామాలలో జరిగే రీసర్వే గ్రామ సభలలో వెల్లడించాలన్నారు. పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఆర్‌ఐ మహాదేవరెడ్డి, వీఆర్‌వోలు సుబ్బారెడ్డి, జానయ్య, నాయకులు తాతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, సర్వేయర్లు, పలువురు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలు త్వరితగతిన పరిష్కారం

పెద్దారవీడు : రీసర్వేలో తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఖలీల్ అన్నారు. ప్రభుత్వం తలపెట్టిన రీసర్వే పూర్తయిన గ్రామాలలో గ్రామసభల నిర్వహణలో భాగంగా మంగళవారం మండలంలోని గొబ్బూరులో సభ నిర్వహించారు. రీ సర్వే సమస్యలపై వచ్చిన అర్జీలను 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. గొబ్బూరు గ్రామసభలో భూరీసర్వే సందర్భంగా 29 వినతిపత్రాలు రైతుల నుంచి రెవెన్యూ అధికారులు స్వీకరించారు. అందులో 18 ఎల్‌పీఎం నంబరు కేటాయింపులో తేడాలు, 8 భూ విస్తీర్ణంలో తేడాలు, 3 పేర్లు తప్పుగా నమోదైనట్లు అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ గోపీ వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

22 నుంచి రీసర్వేపై గ్రామసభలు

కంభం : కంభం మండలంలో గతంలో రీసర్వే పూర్తయిన గ్రామాలలో రీసర్వేకు సంబంధించిన రైతుల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత గ్రామాలలో ఈ నెల 22 నుంచి 29 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు కంభం మండల తహసీల్దార్ కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగంగుంట్ల గ్రామంలో ఈనెల 21వ తేదీ, 24న నడింపల్లి, 26న కాగితాలగూడెం, 29న కందులాపురంలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అకాల వర్షాలతో పైర్లకు భారీగా నష్టం



వర్షాలకు దెబ్బతిన్న రైతు ఆవులరాజు మిరపతోట

తర్లుపాడు, అక్టోబరు 22 ఆంధ్రజ్యోతి: వారంరోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలో పొంగి ప్రవహించాయి. దీంతో పొగాకు, మిర్చి, బొబ్బర్లు, టమాటా, మొక్కజొన్న పంటలకు భారీనష్టం వాటిల్లింది. ఆకస్మికంగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా పొగాకు, మిర్చి, టమాటా, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలో దాదాపుగా ఇప్పటి వరకు 1000 ఎకరాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మిర్చి పంట 500 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు నివేదికలు తయారు చేస్తున్నారు. ఎకరాకు మిర్చి పంటకు ఎకరాకు రూ.70 వేలు, పొగాకు సాగుకు రూ.50 వేలు, పెట్టుబడి అయినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతన్నలు భారీగా నష్టపోయామని బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పత్తితోటను పరిశీలిస్తున్న ఏవో

తర్లుపాడు : ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిపైరు పూర్తిగా దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారి టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బోరుగుంతలపాడు, బుడ్డపల్లె గ్రామాల్లో 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి, మిరప, పొగాకు తోటలను పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు శంకర్, బాబు, శ్వేత, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

రాయితీ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొదిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో షేక్ జైనులుబ్దీన్ కోరారు. మంగళవారం మండలం లోని మల్లవరం, అక్కచెరువు గ్రామాల్లో జరిగిన పొలంబడి కార్యక్రమంలో దర్శి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కందిలో ఎక్కువగా వెర్రితెగులు వస్తుందన్నారు. ఈవైరస్ ఇరియోఫిడ్ నల్లి ద్వారా వ్యాపిస్తుందన్నారు. దీని నివారణకు లీటర్ నీటిలో 5ఎంఎల్ వేపనూనె, 30 నుండి 40 రోజులు వచ్చిన తరువాత లీటర్‌నీటికి 3గ్రాములు గంధకం పిచికారి చేయలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ రమేష్ మాట్లాడుతూ కందిలో మారుకమచ్చ తెగులు కూడా ఎక్కువగా ఆశించే ప్రమాదం ఉందన్నారు. ఈ పురుగు ఆకు, పూత, పిందె, కాయలను గూడుగా చేసుకొని విత్తనాలను తిని డొల్ల చేస్తుందన్నారు. వ్యవసాయ ఉపసంచాలకులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెగులు, పురుగులను గుర్తించిన వెంటనే రైతులు మండల వ్యవసాయ సలహాలను తీసుకొని ఒకేసారి నివారణ చర్యలు చేయడం మంచిదన్నారు. పంటల్లో చీడపీడలను నివారించుకోవాలన్నారు. వర్షాలకు నీరు నిల్వలేకుండా బయటకు పెట్టాలన్నారు.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి

కొమరోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజన ల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మస్తాన్‌వలి మాట్లాడుతూ ఇటీవల మండలంలో తరచూ కురుస్తున్న వర్షాలకు దోమలతో విషజ్వరాలు రాకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి చైతన్యదీపక్ ఈఓఆర్‌డీ దేవరశెట్టి బ్రహ్మయ్య, వైద్యులు రజియాభాను, పంచాయతీ కార్యదర్శులు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్‌కేంద్రాన్ని తనిఖీచేసిన ఎంపీడీవో

స్థానిక కొమరోలు పంచాయతీ కార్యాలయంలోని ప్రభుత్వ ఆధార్‌కేంద్రాన్ని ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, ఈవోపీఆర్‌డీ దేవరశెట్టి బ్రహ్మయ్యలు మంగళవారం పరిశీలించారు. ఆధార్ సేవలపై సెంటర్‌కు వచ్చిన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్‌ల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ కార్పొరేషన్ వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ, స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుర మంగళవారం ఏజెంట్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా లియాఫి అధ్యక్షుడు ఏవీ.సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఆల్ ఇండియా డీఆర్‌బీ, డివిజన్ కమిటీ నిర్ణయం మేరకు ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబరు 1 నుంచి ఎల్‌ఐసీ ఏజెంట్ల కమిషన్ తగ్గించడాన్ని నిరసిస్తున్నామన్నారు. క్లబ్ బ్యాక్ కమిషన్ విరమించుకోవాలన్నారు. పాలసీదారులపై జీఎస్‌టీ ఎత్తివేయాలన్నారు. బోనస్ పెంచాలని, గ్రామీణ ప్రాంతాల వారికి అనుకూలంగా ఉండే విధంగా కనీస బీమా మొత్తాన్ని లక్ష పాలసీ ఉంచాలన్నారు. కార్యక్రమంలో లియాఫి కార్యదర్శి అల్లూరయ్య, సుబ్రహ్మణ్యం, ఇమామ్‌సాహెబ్, అంజనేయులు, తిరుపతిరెడ్డి, సుబ్బారావు, శంకరయ్య, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు



అధ్వానంగా ఉన్న మిట్టమీదిపల్లి-రాజుపేట తారురోడ్డు

గిద్దలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టమీదిపల్లె నుంచి రాజుపేట వరకు ఉన్న తారురోడ్డు అధ్వానంగా మారింది. వర్షం నీరు అటూ ఇటూ వెళ్లలేక తారురోడ్డుపైనే నిలిచి ఉంటూ గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు చాలాచోట్ల మట్టిరోడ్డు కంటే అధ్వాన్నంగా తయారైంది. గుంతలను పూడ్చి వర్షం నీరు రోడ్డుపై నిలబడకుండా చూడాలని ఆప్రాంతవాసులు కోరుతున్నారు.

రేపు రక్తదాన శిబిరం

గిద్దలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీసుశాఖ సహకారంతో ఈ నెల 24వ తేదీ గురువారం గిద్దలూరు పోలీసుస్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు 'మేమున్నాము' సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యువకులు, రక్తదాతలు పెద్దఎత్తున హాజరై రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

సభ్యత్వ నమోదుపై సమీక్ష



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పై ఆ పార్టీ నాయకులు సమీక్ష నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అత్యధిక సభ్యత్వాలు నమోదుకు ప్రతిఒక్కరూ ప్రయత్నించాలని పేర్కొన్నారు. క్రియాశీలక సభ్యత్వం పొందేందుకు 50 సాధారణ సభ్యత్వాలు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, ఎస్సీ మోర్చ ఇన్‌చార్జ్ బి.జయప్రసాద్, పలువురు బీజేపీ నాయకులు ప్రసంగించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ



విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ వెంకటేష్

పొదిలి, అక్టోబరు 22 : మండలంలో ఇటీవల రియల్ ఎస్టేట్ దాందాలు వడ్డీ వ్యాపారుల ఆగడాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేష్ సూచించారు. మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5వ తేదీన ఓంకార్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి జరిగిందని, ఆ దాడిలో ఓంకార్ అనే వ్యక్తికి 90 కుట్లు పడ్డాయన్నారు. పొల్లా రమేష్, ఓంకార్‌ల మధ్య భూములు, స్థలాల కొనుగోళ్ల మధ్య వివాదాలే దీనికి కారణమన్నారు ఓంకార్‌ను కిరాయి హంతకులతో హతమార్చేందుకు పొల్లా రమేష్ పథకం పన్నార్నారు. రమేష్ అనేవ్యక్తి భూవివాదాల్లో ఆరితేరిన వ్యక్తని పొలం లేదా స్థలం కొనిపెడతానని డబ్బుల తీసుకోవడం పదిరోజులు తనతో తిప్పుకోవడం ఆ తరువాత ఏదో విధంగా భయానికి గురిచేయడం తీసుకున్న డబ్బులు ఎగ్గొట్టడం లాంటి దందాలు చేస్తుంటాడన్నారు. అంతేకాకుండా డబ్బులు తీసుకున్న వ్యక్తులు డబ్బులు ఇవ్వాలని గట్టిగా అడిగితే పలు విధాలుగా ఇబ్బందులకు గురి చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అసైన్డ్ భూములు, డబుల్ రిజిస్ట్రేషన్‌లు లాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ఓంకార్ కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్న పొల్లా రమేష్‌ను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు. ఎవరికైనా రమేష్ ఆచూకి తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచడంతోపాటు తగిన రివార్డు అందజేస్తామన్నారు. భూముల క్రయ విక్రయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ వేమన ఉన్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన డ్రైవర్ల మధ్య వివాదం

పొదిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రెండురోజుల క్రితం కురిచేడులో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సు డ్రైవర్ల మధ్య జరిగిన వివాదం మంగళవారం పోలీసుల చెంతకు చేరింది. వివరాల్లోకి వెళితే పొదిలి నుండి బీహెచ్‌ఈఎల్‌కు ఆర్టీసీ బస్సు వెళుతోంది. కురిచేడు సమీపంలోకి వెళ్లేసరికి ఆర్టీసీ డ్రైవర్ సత్తార్ ముందు వెళుతున్న కావేరి బస్సును సైడు ఇవ్వాలని హారన్ మోగించాడు. అతను ఎంతసేపటికి సైడు ఇవ్వక పోవడంతో ఆగ్రహించాడు. దీంతో ప్రైవేటు బస్సును క్రాస్ చేసిన అనంతరం సత్తార్ బస్సును రోడ్డుపై నిలిపాడు. ప్రయాణికుల కోసం వేచిచూస్తున్నట్లు తెలిపారు. తనకు సత్తార్ సైడు ఇవ్వలేదని ప్రైవేట్ బస్సు డ్రైవర్ ఆరోపించాడు. ఈ క్రమంలో కొన్ని ప్రైవేటు బస్సులు అక్కడకు చేరుకున్నాయి. అందరు కలిసి తనపై దాడి చేశారని సత్తార్ ఆరోపించారు. ఆ తరువాత ఇరువురు బీహెచ్‌ఈఎల్‌కు చేరుకున్నారు. తిరిగి మంగళవారం పొదిలికి వచ్చారు. ముందుగా వచ్చిన ఆర్టీసీ డ్రైవర్ సత్తార్ పొదిలికి వచ్చాడు. తోటి సిబ్బందిని తన బంధువులను వెంటబెట్టుకొని ప్రైవేట్ బస్సులను ఆపి డ్రైవర్లలో ముగ్గురిపై విచక్షణారహితంగా దాడి చేసినట్లు తెలిసింది. అయితే ఈ కేసులో ఇరువురి తొందరపాటు చర్యలున్నాయని, యూనియన్ నాయకులతో చర్చలు జరిపి రాజీ కుదుర్చుకున్నారని సీఐ వెంకటేష్ తెలిపారు. ఇలాంటి ఘర్షణలను సహించేది లేదన్నారు.

నిరుపేద వృద్ధురాలికి చేయూత



పట్టను అందజేస్తున్న నిర్వాహకులు

మార్కాపురం రూరల్ అక్టోబర్ 22 : మండలంలోని గజ్జలకొండ గ్రామంలో నిరుపేద వృద్ధురాలికి దాతలు ఇంటి పైకప్పునకు అవసరమైన పట్టను మంగళవారం అందజేశారు. గ్రామంలో జమ్మలమూడి బాలనాగమ్మ అనే వృద్ధురాలు నివసిస్తోంది. ఆమె ఇంటి పైకప్పు సరిగా లేకపోవడంతో ఇటీవల కురిస్తున్న వర్షాలకు ఇంట్లో ఉండేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో ఆమెకు ఇంటి పై కప్పు కోసం టార్పలిన్ పట్టను అందించినట్లు దాత సుబ్బారావు తెలిపారు.

నేర వార్తలు

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

మహిళ కాలు వేళ్లు తెగి రోడ్డుపై పడిన వైనం



తీవ్రంగా గాయపడిన నాగేష్

ముండ్లమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డినగర్ సమీపంలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... అద్దంకి నుంచి కారు దర్శి వైపు వెళ్తుండగా దర్శి పట్టణంలోని సందువారిపాలేనికి చెందిన కొందరు కూలీలు ఆటోలో పసుపుగల్లులో కరివేపాకు కోతకు వస్తున్నారు. అదే సమయంలో దర్శి మండలం కట్టుబడివారిపాలేనికి చెందిన ఐ నాగేష్ బైక్‌పై ముండ్లమూరు వస్తుండగా, వేగంగా వస్తున్న కారు.. ద్విచక్ర వాహన చోదకుడు నాగేష్‌ను తప్పించబోయి పక్కగా వెళ్తున్న ఆటోను ఢీకొంది. అందులో ఉన్న సందువారిపాలేనికి చెందిన సందు శివలీల కాలు పూర్తిగా తెగి వేళ్ల రోడ్డు మీద పడ్డాయి. అందులో ప్రయాణిస్తున్న ఒకరిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ద్విచక్ర వాహన చోదకుడు నాగేష్‌కు గాయాలయ్యాయి. వెంటనే బాధితులను 108 దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు మాత్రం ఇరువురిని ఢీకొట్టి రోడ్డు పక్కన చిల్లచెట్లలోకి దూసుకుపోయింది.

గొర్రెల కాపరులను చూసి పరారైన దొంగలు



పగులకొట్టిన విద్యుత్ మోటార్లు

కురిచేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గొర్రెల కాపరులను చూసి విద్యుత్ మోటార్లు చౌర్యం చేసే ముఠా పారిపోయిన సంఘటన మంగళవారం కురిచేడులో చోటుచేసుకుంది. కురిచేడు ఆవులమంద రోడ్డులో కరవకు సమీపంలో విద్యుత్ మోటార్లను ముగ్గురు వ్యక్తులు పగులకొడుతున్నారు. వారం రోజులకు ముందు ఎక్కడో విద్యుత్ మోటార్లు దొంగతనం చేసి చెట్ల కింద దాచారు. మంగళవారం మధ్యాహ్న సమయంలో మోటార్లను విడగొడుతున్నారు. ఆ సమయంలో మండలంలోని గొల్లపాలేనికి చెందిన గొర్రెల కాపరులు అటుగా వెళుతున్నారు. వారిని చూసిన దొంగలు పారిపోయారు.

ఎంఈవోలపై కరపత్రాలు

కురిచేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కురిచేడులో విద్యాశాఖపై వేసిన ఫ్లెక్సీలు కలకలం రేపాయి. ఆ శాఖలో అవినీతి రాజ్యమేలుతోందని, మండల విద్యాశాఖాధికారులు లంచగొండులుగా మారారని ఆరోపిస్తూ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కరపత్రాలు ముద్రించి ప్రధాన సెంటర్లలో వదిలివెళ్లారు. కురిచేడు ఎంఈవో ఆఫీసులో లీలలు అంటూ 18 పాయింట్లతో వారి అవినీతి విషయాలు బహిర్గతం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు బడికి వెళ్లకపోయినా సరే, పాఠశాలలకు విజిట్‌లకు వెళ్లినా సరే డబ్బులు వసూలు చేస్తున్నారని, యూనియన్ నాయకులను అడ్డుపెట్టుకుని ఈ తతంగం నడుపుతున్నారని అందులో పేర్కొన్నారు. అవన్నీ అవాస్తవమని, తాము ఎటువంటి అవినీతికి పాల్పడలేదని ఎంఈవోలు తెలిపారు. కరపత్రాలు పంచిన వ్యక్తిని కనిపెట్టి శిక్షించాలని ఎంఈవోలు వస్రాం నాయక్, సుబ్బారావులు కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హైవేకు బీటలు



పామూరు బైపాస్ వద్ద పగుళ్లు ఇచ్చి ఉన్న రోడ్డు



నర్రమారెళ్లవద్ద నెర్రలు ఇచ్చిన రోడ్డు

పామూరు సమీపంలో జాతీయ రహదారి పలుచోట్ల నెర్రలు కొట్టింది. కొన్నిచోట్ల లోతైన గుంతలు పడి బీటలు వారింది. రావిగుంటపల్లి, వగ్గంపల్లి నర్రమారెళ్ల, మోట్రావులపాడు, పామూరు దక్షిణం వైపు బైపాస్ జాతీయ రహదారి, తదితర ప్రాంతాల్లో రోడ్డు ఎక్కువగా దెబ్బతింది. నాసిరకం గ్రావెల్‌ను వాడటం వలనేరోడ్డు దెబ్బతింటోంది. ఇప్పటికైనా జాతీయరహదారి అధికారులు మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - పామూరు

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

169 మంది రక్తదానం

దర్శి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా దర్శిలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డీఎస్పీ లక్ష్మీనారాయణ ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశ భద్రత కోసం, సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం ద్వారా సేకరించిన రక్తం ప్రజల ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వై రామారావు, ఎస్సైలు ఎం మురళీ, నాగరాజు, మల్లికార్జున, బ్రహ్మనాయుడు, వేమన, శివబసవరాజు, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న పోలీసులు

ముండ్లమూరులో....

ముండ్లమూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : పోలీసుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని 38 మంది రక్తదానం చేశారు. వీరిని డీఎస్పీ లక్ష్మీనారాయణ అభినందించారు. ఎస్‌ఐ వై నాగరాజుతోపాటు గూడాల శివశంకర్‌రెడ్డి, సోమేపల్లి అనీల్, కర్నాటి సాయికుమార్‌రెడ్డి, నూరా శేషిరెడ్డి, దద్దాల గోపాల్ ఉన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

పామూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : లాడ్జిలో గదులు అద్దెకిస్తున్న సమయంలో వారికి సంబంధించిన పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఎస్‌ఐ కిశోర్‌కుమార్ చెప్పారు. మంగళవారం రాత్రి పట్టణంలోని పలు లాడ్జీలను ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో చెడ్డీగ్యాంగ్ కదలికలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అనుమానుతుల, కొత్త వ్యక్తుల సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు ఊళ్లకు వెళ్లేటప్పుడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని చెప్పారు.



లాడ్జిల్లో రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ కిశోర్‌బాబు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు మంగళవారం చెప్పారు. కొందరు మోసగాళ్లు హ్యూమన్ రైట్స్ పేరుతో ఫేక్ వెబ్‌సైట్లు, ఫేక్ ఐడికార్డులు, సోషల్ మీడియా గ్రూపులు సృష్టించి ప్రజల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారని చెప్పారు. మోసగాళ్లు బ్యాంక్ అధికారులమంటూ ఫోన్లు చేస్తూ బ్యాంక్ ఖాతాల పేరుతో వివరాలు అడిగితే నమ్మి చెప్పవద్దన్నారు. కొందరు పలు రకాల దర్యాప్తు సంస్థల పేరిట ఫోన్లు చేసి తప్పులు చేశారని బెదిరించటం, కేసులు ఉన్నాయని చెబుతూ న్యాయం చేస్తామని డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి చేసే మోసగాళ్లు ఉన్నారని చెప్పారు.

పలుగ్రామాలకు ఇన్‌చార్జిలుగా వీఆర్‌వోల నియామకం

తాళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జి వీఆర్వోలను నియమిస్తూ తహసీల్దార్ కె.నాగలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తురకపాలేనికి విఠలాపురం వీఆర్‌వో రమణారెడ్డిని, మన్నేపల్లి, సోమవరప్పాడు గ్రామాలకు శివరాంపురం వీఆర్‌వో పి.చంద్రశేఖర్‌రావును, నాగంబొట్లపాలెం, రామభద్రాపురం గ్రామాలకు తూర్పుగంగవరంవీఆర్‌వో పి.శివారెడ్డిని దోసకాయలపాడు, బెల్లంకొండవారిపాలెం,సార్వమిట్ల, వెలుగువారిపాలెం, బొద్దికూరపాడు, సూరాయపాలెం, శంకరనారాయణపురం గ్రామాలకు తాళ్లూరు వీఆర్‌వో నాగలక్ష్మిని నియమించారు.

ముఖాముఖి

భూసార పరీక్షల ద్వారా సూక్ష్మధాతు లోపాల గుర్తింపు

షేక్ షారూఖ్, పీసీపల్లి వ్యవసాయ అధికారి



పంటలు సాగుచేసే ముందు భూమిలో భూసార పరీక్షలు చేయడం ద్వారా సూక్ష్మధాతులోపాలను గుర్తించవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ షారూఖ్ అన్నారు.మంగళవారం ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు ఏ పరికరాలను అందిస్తున్నారు?

జవాబు : వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై డ్రైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు, స్ప్రింక్లర్ పైపులు, ట్రాక్టర్ గొర్రులు, నాగళ్లు ఇస్తాం. ఆ మేరకు ప్రభుత్వానికి ఇండెంట్ పంపించాం. ఉద్యానశాఖ ద్వారా పవర్ స్ప్రేయర్లు 50శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుంది. లక్ష రూపాయల సబ్సిడీతో అవసరమైన రైతులకు మినీ ట్రాక్టర్‌లు ఇస్తున్నాం.

ప్ర : భూమిలో సూక్ష్మధాతులోపాలను ఎలా గుర్తిస్తారు?

జ : భూమి పరీక్ష ద్వారా సూక్ష్మధాతు లోపాలను గుర్తిస్తాం. ఎంతమోతాదులో ఏయే ఎరువులు వాడాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది వివిధ గ్రామాల్లో భూసార పరీక్షల కోసం 545 మట్టి నమూనాలను సేకరించాం.

ప్ర : 'పొలం పిలుస్తుంది'తో కలిగే ప్రయోజనం ఏమిటి?

జ : వ్యవసాయశాఖతో పాటు అనుబంధ శాఖలన్నింటినీ కలిపి ప్రభుత్వం ఒకే తాటిపై తీసుకువచ్చి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అధికారులు గ్రామాల్లోకి వెళ్లి పంటల పరిశీలన, సాగులో నూతన మెళకువలు, సూచనలు అందిస్తారు. తక్కువఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర : జాతీయ ఆహార భద్రత కింద రైతులకు సౌకర్యాలు కల్పిస్తున్నారా?

జ : ఆహార భద్రత పథకం కింద రైతులకు రాయితీపై విత్తనాలు, సూక్షదాతు నివారణ మందులను అందజేస్తున్నాం.

పంటల్లో సూక్ష్మధాతు లోపాన్ని నివారించుకోవాలి

కనిగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట పొలాల్లో సూక్షధాతు లోపాన్ని నివారించుకోవాలని ఏవో జ్యోత్స్నాదేవి చెప్పారు. మండలంలోని గుడిపాడు, తాళ్లూరు, గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ జీ లక్ష్మీ, గ్రామ సహాయకులు జీవీ సుబ్బారావు, ఎంపీఈవో యోగేశ్వరి, సిబ్బంది కృష్ణకిరీటి, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు. మండలంలోని నందనమారెళ్ల, చల్లగిరగల గ్రామంలో ఉద్యానవన శాఖ ఏవో అంజలీబాయి మిరప పంటలను పరిశీలించారు.



గుడిపాడులో కంది పంటను పరిశీలించిన ఏవో జ్యోత్స్నాదేవి

డైకోడెర్మాతో తెగుళ్ల నివారణ

తాళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పంటల్లో వేరుకుళ్లు, మాగుడుఎండు తెగుళ్ల నివారణకు డైకోడెర్మా విరిడితో సమర్థవంతంగా అరికట్టవచ్చునని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. తాళ్లూరు1, -2 రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

ఉల్లి కోడ్ నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

ముండ్లమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి రైతులు సాగు చేసిన వరి పైరులో ఉల్లి కోడ్ తెగులు అధికంగా వ్యాపించిందని ఒంగోలు వ్యవసాయ శాఖ డీడీఏ సుబ్రహ్మణ్యం చెప్పారు. ఆయన సాయంత్రం ముండ్లమూరులో రైతు రాములు వరి పైరును పరిశీలించారు. దర్శి కృషి విజ్ఞాన్ కేంద్రం కో-ఆర్డినేటర్ రమేష్, ఏఆర్ఎస్ వరప్రసాదు, ఏడీఏ బాలాజీ నాయక్‌ల ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఫరూక్, వీఏఏ శోభారాణి, బాల వెంకటయ్య, ఎంపీడీ దయా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులను సవరించేందుకే గ్రామసభలు

పామూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గతంలో జరిగిన భూముల రీసర్వే లోపాలను సవరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు చెప్పారు. మండలంలోని పుట్టంనాయుడు పల్లెలో మంగళవారం జరిగిన గ్రామ సభలలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో లోపాలను సవరించి సమస్యల పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మన్నేపల్లి విజయ్‌శేఖర్, డిప్యూటి తహసీల్దార్ బ్రహ్మయ్య, మండల్ సర్వేయర్ శ్రీలత, వీఆర్వో రామాంజనేయులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభలో 32 అర్జీలు

దొనకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరం గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించిన రీసర్వే గ్రామసభలో రైతుల నుండి మొత్తం 32 అర్జీలు అందినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. గ్రామాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రభుత్వం భూముల రీసర్వే గ్రామసభలు నిర్వహిస్తుందని భూ సమస్యలు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరిష్కరించుకోవాలని తహశీల్దార్ తెలిపా రు. గ్రామ సభలో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులకు త్వరలో పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటీ నాగార్జునరెడ్డి, సర్వేయర్ మస్తాన్, లైసెన్స్ సర్వేయర్ వెంకటరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తాళ్లూరులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగలక్ష్మి

ముండ్లమూరులో...

ముండ్లమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగనపాలెంలో రీసర్వేపై జరిగిన గ్రామసభలో ఏడుగురు రైతులు అర్జీలు అందజేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఆర్ఐ మూర్తి, వీఆర్‌వోలు రాఘవరెడ్డి, సుజాత ఉన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో నిర్వహించిన భూముల రీసర్వేలో జరిగిన లోపాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ కె.నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని మల్కాపురం గ్రామంలో రీసర్వే సమస్యలపై మంగళవారం గ్రామ సర్పంచ్ కాలేషావలి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. మొత్తం 27 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మేడగం వెంకట్రామిరెడ్డి, రీసర్వే డీటీ ప్రశాంత్, వీఆర్‌వో నాగూర్‌బీ, ఇన్‌చార్జి సర్వేయర్ మల్లికార్జున పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

పీసీపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 23 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు పీసీపల్లి తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. రీసర్వేలో భూమి కొలతల్లో హెచ్చుతగ్గులు, జాయింట్ ఎల్‌పీలు తదితర ఇతర ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవాలని ఆమె చెప్పారు. ఈనెల 23న పిచ్చిగుంటపల్లి రెవెన్యూకి సంబంధించి వెంగళాయపల్లి గ్రామ సచివాలయంలో, 24న గోశిగుండాల రెవెన్యూకి సంబంధించి కమ్మవారిపల్లి రామాలయం వద్ద, 26న చౌటగోగులపల్లికి సంబంధించి ఆగ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, 29న పెదవరిమడుగుకు సంబంధించి ఆగ్రామ ప్రభుత్వ పాఠశాలలో, నవంబరు 5న ముద్దపాడు రెవెన్యూకి సంబంధించి మర్రికుంటపల్లిలో, 6న ముద్దపాడు సచివాలయంలో, నవంబరు 8న తలకొండపాడు రెవెన్యూకి సంబంధించి ఆగ్రామ సచివాలయంలో, 1న మారెళ్ల రెవెన్యూకి సంబంధించి ఆగ్రామ సచివాలయంలో సదస్సులు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

గురుకుల పాఠశాలలో విచారణ

కురిచేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం తహసీల్దార్ రజనీకుమారి విచారణ చేపట్టారు. పాఠశాలలో అక్రమాలు చోటుచేసుకున్నాయని కనిగిరి ఆర్డీవోకు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ చేసి రిపోర్టు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆమె మంగళవారం గురుకుల పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

దర్శి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల్లో ఎమ్మార్పీకే సరుకు విక్రయించాలని ఎక్సైజ్ సీఐ కె. శ్రీనివాసరావు సూచించారు. దర్శి పట్టణంలోని మద్యం షాపుల వద్ద మంగళవారం ఎమ్మార్పీలకు విక్రయించాలనే సూచించే బోర్డులను ఏర్పాటు చేయించారు.

డిపో అభివృద్ధితో పాటు ప్రయాణికుల భద్రతే లక్ష్యం



డీఎం షయానాబేగం

కనిగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి డిపో అభివృద్ధితోపాటు ప్రయాణికుల భద్రతే ముఖ్యమని డిపో మేనేజర్ షయానాబేగం చెప్పారు. ఒంగోలు డిపో నుంచి బదిలీపై వచ్చిన ఆమె కనిగిరి డీఎంగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కనిగిరి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. డిపో పరిధిలో 107 బస్సులను వివిధ ప్రాంతాలకు తిప్పుతున్నామని, రోజులో 47వేల కిలోమీటర్లు మేర బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. వచ్చే కార్తీకమాసం సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపుతామన్నారు. అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోటలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు చెప్పారు. సమావేశంలో సూపరింటెండెంట్ రాణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

ముండ్లమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జనార్దన్ చెప్పారు. ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ముండ్లమూరు, మారెళ్ల వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం జాస్మిన్, ప్రవీణ్‌కుమార్, మలేరియా అధికారి బసవారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ కుటుంబానికి ఆర్థిక సహాయం

దొనకొండ, అక్టోబరు, 22(ఆంధ్రజ్యోతి) : దొనకొండలో ఆర్ఎంపీ వైద్యుడు శ్యామ్ కుటుంబ సభ్యులకు జిల్లా ఆర్ఎంపీల అసోసియేషన్ సంఘం తరఫున ఆర్థిక సహాయం అందించారు. ఆర్ఎంపీల సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, దర్శి డివిజన్ అధ్యక్షుడు వల్లి, ట్రెజరర్ రాజు, మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డిలు డాక్టర్ శ్యామ్ భార్యకు రూ.17,500 అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీలు బాబు, బీవీ రెడ్డి, శ్రీను, జోసఫ్ పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థి దశే కీలకం

సీఎస్‌పురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిదశలో కష్టపడితే ఉజ్వల భవిషత్తుకు పునాది పడుతుందని మార్కాపురం రాంభూపాల్ రెడ్డి చెప్పారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో గత ఏడాది పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపకార్థం జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రసాదరావు, ప్రిన్సిపాల్ షేక్ రేష్మా పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఉపయోగించుకోండి

తాళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సహాయకుల ద్వారా మూడు సచివాలయాలలో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.సుందరరామయ్య మంగళవారం తెలిపారు. ఈనెల 23న శివరాంపురం, నాగంబొట్లపాలెం, మాదవరం సచివాలయాల్లో, 24, 25 మల్కాపురం, బొద్దికూరపాడు, దోసకాయలపాడు సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌లో ఏవైనా సమస్యలుంటే అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

సచివాలయాల్లో ఆధార్ క్యాంపుల నిర్వహణ

పీసీపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మురుగుమ్మి గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం ఆధార్ కేంద్రం నిర్వహించినట్లు ఎంపీడీవో ప్రభాకరశర్మ చెప్పారు. కొత్తగా ఆధార్‌కార్డులు తీయడంతో పాటు ఉన్న వాటికి బయోమెట్రిక్ అప్‌డేట్, ఇంటి అడ్రస్‌లు మార్పులు చేసినట్లు చెప్పారు. అలాగే 23, 24వ తేదీల్లో నేరేడుపల్లి సచివాలయం, 25గుదేవారిపాలెం సచివాలయం పరిధిలో క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చెప్పారు.

'రాష్ట్ర కాంగ్రెస్'లో వెంకట కృష్ణారెడ్డికి కీలక పదవి



వెంకటకృష్ణారెడ్డి

తాళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు మండలం విఠలాపురం గ్రామానికి చెందిన కైపు వెంకట కృష్ణారెడ్డిని రాష్ట్ర కాంగ్రెస్ అనార్గనైజ్డ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ చైర్మన్‌గా నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి గోపాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ అనార్గనైజ్డ్ సెక్టార్ కార్మికుల గురించి కాంగ్రెస్‌పార్టీ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. తనపై నమ్మకంతో పెద్ద బాధ్యతలు అప్పగించిన రాష్ట్రపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



- ఆరోగ్యశాఖకు నిలిచిపోయిన డీపీటీ టీకా
- త్వరలో వస్తాయంటున్న వైద్యాధికారులు
- చిన్నారులకు పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు

నిండుకున్న ట్రిపుల్ వ్యాక్సిన్

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పుట్టిన మొదటి రోజే చిన్నా రులకు మూడు రకాల అంటువ్యాధుల నుం చి రక్షణ కల్పించేందుకు ఇచ్చే ట్రిపుల్ వ్యాక్సి న్ డీపీటీ టీకా మందు వైద్య ఆరోగ్య శాఖలో నిండుకుంది. గత నెల రోజులుగా ఈ టీకాల పంపిణీ జిల్లాకు నిలిచిపోయింది. దీంతో చిన్నారులకు ఈ వ్యాక్సిన్ అందటం లేదు. ప్రమాదకరమైన కంఠసర్పి (డిఫ్తీరియా), కోరింత దగ్గు (పెర్టుసిస్), ధనుర్వాతం (టెటనస్) వ్యాధుల నుంచి డీపీటీ టీకా మందు పూర్తిరక్షణ కల్పిస్తుంది. ఇవన్నీ అం టువ్యాధులు. పిల్లల్లో ఒకరినుంచి మరొకరికి సులువుగా వ్యాప్తిచెందే స్వభావం గల వ్యాధులు. డిఫ్తీరియా ప్రాణాంతక వ్యాధి. ఇది గొంతుకు సోకే ఇన్‌ఫెక్షన్. ఈ వ్యాధి బారినపడ్డ పిల్లల్లో శ్వాససమస్యలు, పక్షవాతం, గుండె పనితీరు మందగించ డంతోపాటు అంతిమంగా మృత్యువు బారిన పడతారు. ధనుర్వాతం కూడా ప్రాణాంతక వ్యాధే. గాయమైన

(మిగతా 7వ పేజీలో...)



- నాలుగు విడతలుగా నిలిచిన ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా రూ.160 కోట్ల మేర బకాయిలు
- అప్పులు చేసి ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు
- ఎంతకీ బకాయిలు రాకపోవడంతో వారిలో కలవరం

FEES

ఎన్నాళ్లీ విద్యావేదన!

బాపట్ల,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న విద్యాదీవెన తాలూకు వేదన ఈనా టికి విద్యార్థులను వెంటాడుతోంది. ఎప్పటి నుంచో అమలులో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పేరుతో 'జగనన్న విద్యాదీవెన'గా మార్చి ఫీజులు చెల్లించకుండా విద్యార్థులను, వారి కుటుంబ సభ్యుల ను ఇబ్బంది పెట్టారు. వాటి తాలూకా సమ స్యలు ఇప్పటికీ విద్యార్థులను వెంటాడుతూనే ఉన్నాయి.

దాదాపు 83 వేల మంది విద్యార్థులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఫీజు రీయింబర్స్ మెంట్ మీద ఆధారపడి చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దాదాపు 83వేల మంది ఉన్నారు. ఈ ఏడాది ఈ సంఖ్య మరో 13 వేలు పెరిగింది. కొత్తగా ఈ ఏడాది చేరి న విద్యార్థులు మినహా పాత విద్యార్థులం దరికీ కిందటేడాది ఫీజులకు సంబంధించి మూడు దఫాల

(మిగతా 7వ పేజీలో...)

అమరావతి రైలుమార్గానికి భూసేకరణ

- 7 గ్రామాల్లో 200 ఎకరాలు
- సర్వే నంబర్లతో ప్రాథమిక నోటిఫికేషన్
- గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాల స్వీకరణ
- రైతులను ఒప్పించనున్న అధికారులు



గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజ ధాని అమరావతికి నూ తన రైలుమార్గం వేయ డానికి భూమి సేకరిం చేందుకు తొలి అడుగు పడింది. ఈ బ్రాడ్‌గేజ్ రైలుమార్గం (ఎర్రుపాలెం -నంబూరు) కోసం గుంటూరు జిల్లాలో దాదాపుగా 200 ఎకరాల వరకు భూమి సేకరించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఆ మేరకు ఎలైన్‌మెంట్‌ను రెవెన్యూ శాఖకు ఇవ్వగా.. సర్వే నంబర్లవారీగా సేకరించదలచిన భూమి విస్తీర్ణాన్ని పేర్కొంటూ ఆ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి భూసేకరణకు ముందుకెళ్తామని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. సాధ్యమైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి రైల్వే శాఖ కోరిన స్థలాన్ని స్వాధీనపరుస్తామని పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసి రాష్ట్రంలో రైల్వే ప్రాజె క్టుల గురించి చర్చించారు. వాటిలో ప్రధానమైన అమరా వతి రైలు మార్గాన్ని ముందుగా చేపట్టాలని ఆ శాఖ నిర్ణయిం చింది. మొత్తం 56.53 కిలోమీ టర్ల పొడవున తొలుత సింగిల్ లేన్ నిర్మించనుంది. ఇందుకోసం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరు, పెదకాకాని.. తాడికొండ మండలంలోని కంతేరు, మోతడక, తాడికొండ.. తుళ్లూరు మండలం లోని వడ్డమాను, పెదపరిమి గ్రామాల్లో భూసేకరణకు చర్యలు చేపట్టింది. ఈ ఏడు గ్రామాలూ రాజధాని వెలుపల ఉన్నవే. మరికొన్ని గ్రామాలు కూడా ఎలైన్‌మెంట్‌లో ఉండగా అవి రాజధానిలో భాగం కావడం, ఆ భూమి సీఆర్‌డీఏ స్వాధీనంలో ఉన్న దృష్ట్యా ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఆ భూమి తీసుకునే వెసులుబాటు ఉంది.

ఏ గ్రామంలో ఎంత భూమి..?

పెదకాకాని మండలం కొప్పురావూరులో 33 సర్వే నంబర్లలో 27.43 ఎకరాలు, పెదకాకానిలోని 6 సర్వే నంబర్లలో 5.73 ఎకరాల భూమిని సేక రిస్తారు. తాడికొండలో ఎక్కువ విస్తీర్ణంలో భూమి సేకరించాల్సి ఉంది. 95 సర్వే నంబర్లలో 69.096 ఎకరాల భూమి సేకరించాలి. అలానే మోతడకలో 15 సర్వే నంబర్లలో 31.05 ఎకరాలు, కంతేరులో 30 సర్వే నంబర్లలో 31.254, తుళ్లూరు మండలం పెదపరిమిలో 48 సర్వే నంబర్లలో 23.66 ఎకరాలు, వడ్డమానులోని 17 సర్వే నంబర్లలో 11.492 ఎకరాల భూమిని సేకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడు గ్రామాల్లో మొత్తంగా 199.712 ఎకరాల భూమి రైలుమార్గానికి అవసరం. ఇందుకోసం రైతుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించడంతో పాటు గ్రామసభలు నిర్వహించి ప్రాజెక్టు ఆవశ్యకతను తెలియజేసి వారిని ఒప్పిస్తారు. సర్వే నంబర్లు, వాటిలో ఎంత విస్తీర్ణం సేకరిస్తారో తెలియజేసే నోటిఫికేషన్‌ను తహశీల్దార్, ఆర్‌డీవో, జాయింట్ కలెక్టర్ కార్యాలయాల్లో అందు బాటులో ఉంచారు.

> నేను ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతున్నా... మీ అబ్బాయి మరో ముగ్గురితో కలసి డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడ్డాడు. వి చారణ కోసం వచ్చాం... మీ రు మాతో రావలసి ఉం టుంది.. ఇది ఒకరికొ చ్చిన కాల్

> సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ మాట్లాడుతున్నా... మీ అమ్మాయి ఇప్పుడు మీ దగ్గర ఉందా? ఉంటే నాతో మాట్లాడించండి. మీ దగ్గర ఉండదు. ఎందుకంటే మేము ఓ నేరంలో అరెస్ట్ చేశాం. ఆ కేసుకు సంబంధించి రూ.65వేలు చెల్లిస్తే కేసులో తీవ్రమైన సెక్షన్‌లు లేకుండా చేస్తాం.. రూ.లక్ష ఇస్తే అసలు కేసే లేకుండా చూస్తాం.. లేదంటే మరికొన్ని నేరాలు మోపి జైల్లో వేస్తాం... ఇది మరొక తండ్రికి వచ్చిన కాల్... ఇట్లా ఎందరికో కాల్స్.. అన్నీ +92 సిరీస్ ఫోన్ నంబర్‌తో కాల్ రావటం, వాట్సప్ డీపీ కింద సీబీఐ లోగో కానీ, ఇన్‌స్పెక్టర్ డ్రెస్‌లో ఉన్న వ్యక్తి ఫోటోతోకానీ వస్తుండటం జనాన్ని భయబ్రాంతులకు గురిచే స్తోంది.

- +92 కోడ్‌తో కాల్ వచ్చిందంటే టెర్రర్
- సీబీఐ, సైబర్ పోలీసుల పేరుతో పాకిస్తానీ నంబర్ నుంచి కాల్స్
- పోలీస్ స్టేషన్ సెట్టింగ్‌తో వీడియో కాల్స్ కూడా
- మీ పిల్లలు పలానా నేరాలు చేశారంటూ... బెదిరింపులు
- కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు వారి చేతుల్లో!
- భయం వద్దు... సంచార్ సాథీ పోర్టల్‌లో ఫిర్యాదు చెయ్యాలంటున్న టెలికం

కోడ్.. +92


బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో కొంత మంది మోసపోతుంటే, మరికొందరు వారి వలలో పడకుండా జాగ్రత్తపడుతున్నారు. తాజాగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఈ పరిస్థితి మరీ ఎక్కువయిపోయింది. పగలు, అర్ధరాత్రి తేడా లేకుండా వాట్సప్ నుంచి కాల్స్ చేయటం, కొందరికైతే ఏకంగా వీడియో కాల్ చేసిమరీ భయభ్రాంతులకు గురిచేస్తుండటం కొసమెరుపు. వారి వెనుక సీబీఐ కార్యాలయం అన్న సంకేతాలు ఉండేలా ఫోటోలు, లేక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రూమ్ సెట్టింగ్‌తో ఉండటం ఎంతటి తెలివైనవారికి కానీ, అప్రమత్తంగా ఉండేవారిని సైతం అయోమయానికి గురిచేస్తోంది. దీంతో వాట్సప్‌కు ఆ ఫోన్ కాల్ వచ్చిందంటే చాలు... వాట్సప్ యూజర్లు హడలెత్తిపోతున్నారు.

సీబీఐ, సైబర్ క్రైమ్ లోగోలు పెట్టి మరీ...

+92... ఏదైనా ఫోన్ నంబర్ ముందు ఈ సిరీస్ ఉందంటే అది పాకి స్తాన్ దేశపు టెలికం కోడ్. అయితే నంబర్ పాకిస్తాన్‌కు చెందిన సెల్ కంపెనీలదయితే, వాట్సప్ డీపీలు, వీడియోల్లో సెట్టింగ్స్ మాత్రం భారత్‌కు సంబంధించినవే కావటం విశేషం. పాకిస్తానీ సైబర్ నేర గాళ్లు, ఆర్థిక నేరస్తులు ఈ తరహాలో జనాన్ని భయపెట్టి, బెదిరించి సొమ్ము చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఈ పనిలో భాగంగానే గత కొద్ది రోజుల నుంచి మామూలు కాల్స్ కాకుండా కేవలం వాట్సప్ నుంచి మాత్రమే కాల్స్ చేస్తుండటం, భయపెట్టటం వంటి వాటికి పాల్పడుతున్నారు. ఎక్కువ శాతం కాల్స్ వచ్చిన వారికి 'ఇన్‌స్పెక్టర్ రాజీవ్ కుమార్ బోల్ రహా హరాన్' అంటూ మొదలు పెట్టి, తర్వాత మీ అబ్బాయి ఓ రేప్ కేసులో ఇరుక్కున్నాడని ఒకరికి, మీ అమ్మాయి తన ఫ్రెండ్స్‌తో కలసి డ్రగ్స్ కేసులో ఉందని, అరెస్ట్ చేశామని మరొకరికి, ఇట్లా ఏదో ఒక నేరం చూపించి అరెస్ట్ చేశామని, విడుదల కావాలంటే మేము చెప్పిన డబ్బు పంపాలని బెదిరించటం వీరి నైజం. ఐతే ఎవరికైనా అనుమానం వచ్చి ఎదురు ప్రశ్నలు వేస్తే వారికి వీడియో కాల్ చేసి, పోలీస్ సెట్‌తో స్టేషన్ వాతావరణం కనిపించేలా చూపిస్తూ, ముఖాలు కనిపించకుండా కొందరిని చూపించి వారిలో మీ అబ్బాయికూడా ఉన్నాడని చెప్పటం, డబ్బు డిమాండ్ చేయటం మరో కోణం. అప్పటికీ నమ్మకుంటే వెంటనే కాల్ కట్ చేసి, తర్వాత రోజు సీబీఐ కాకుండా, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డ్రెస్‌లో ఫోన్ నంబర్ స్థానంలో సైబర్ క్రైమ్ పోలీస్ అని వచ్చేలా వాట్సప్ డీపీ, పేరు సెట్ చేసి మరీ మరోసారి కాల్ చేస్తున్నారు. ఇక్కడా ఒకే తంతు. కాకుంటే నేరాలు మారిపోతాయి. తెనాలికి చెందిన నవీన్ చంద్ర అనే యువకుని తండ్రికి సోమవారం, మంగళ వారం వరుసగా రెండు రోజులు కాల్స్ వచ్చాయి. మీ కుమారుడు డ్రగ్స్ నేరంలో ఉన్నాడని, మా అదుపులో ఉన్నాడని, వెంటనే రూ. 35వేలు పంపాలని, లేకుంటే మీకు కనిపించ కుండా చేస్తామని బెదిరించినట్టు చెబుతున్నారు. నసీమా అనే మహి ళకు ఫోన్ చేసి, మీ అమ్మాయి మా దగ్గర ఉందని, ఒక దారుణ నేరాన్ని చెప్పి, ఆ కేసులో అరెస్ట్ చేశామని, కేసు నుంచి మీ అమ్మాయికి ఉపశ మనం రావాలంటే రూ. 75వేలు వెంటనే పంపాలని, పూర్తిగా మినహా యింపు కావాలంటే రూ. 1 లక్ష పంపా లని, చెప్పారని, దానికి ఆమె అంగీక రించటంతో పేమెంట్ లింక్ పెడతా మనిచెప్పి, ఒక లింక్ పెడితే అది పాకిస్తాన్ అడ్రస్ చూప టంతో ఆమె డబ్బు వేయ కుండా ఆపేశా మని చెప్పారు. అయితే ఆ లింక్ అర్ధ గంటలో కని పించకుండా పోయిందని వివరిం చారు. ఇదే తర హాలో చాలామందికి ఫోన్ రావటం, బెది రిస్తూ మాట్లాడి, వారి ని బయపెట్టి డబ్బు రాబట్టే ప్రయత్నాలు చేయ టం జరుగుతూనే ఉంది.

> ఒకవేళ ఇటువంటి కాల్స్ వచ్చినా- ఎవరైనా మోసపోయినా వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్‌చేసి, తర్వాత సంచార్‌సాథీ పోర్టల్‌లో కానీ, సంచార్ సాథీ.జీఓవీ.ఇన్‌కు, లేక సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా కానీ, లేక సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కానీ సమాచారం అం దించాలని టెలికం శాఖ ఒక ప్రకటన కూడా జారీ చేసింది. అయితే ఇవన్నీ చాలామందికి తెలి యక మిన్నకుంటున్నారు. కొందరయితే లోకల్ పోలీస్ స్టేషన్‌లలో రిపోర్టు ఇచ్చి వదిలేస్తున్నారు. దీంతో పాకిస్తానీ తరహా సైబర్ నేరాలు మరింత పెరిగిపోతున్నాయి.

పాకిస్తానీ వాట్సప్ కాల్...



సీబీఐ లోగోతో వాట్సప్ డీపీ పెట్టిమరీ ఫోన్ కాల్ చేస్తున్న చిత్రం

+92 315 0737371
Pakistan · CMPak Limited

నంబర్ కింద పాకిస్తాన్ పేరు, కంపెనీ పేరు కనిపించేలా ఉన్న చిత్రం

పాకిస్తాన్‌కు చెందిన +92 సిరీస్ నుంచి...

ఫోన్ నంబర్ కంట్రీ కోడ్ పాకిస్తాన్‌దయితే, డీపీలు, ఇతర చిత్రాలన్నీ ఇండియా పేరుతో ఉండేలా నేరాలకు పాల్పడటం కలవరపె డుతున్న విషయం. వాట్సప్ కాల్ వచ్చినప్పుడు దానిపై సీబీఐ అని, సైబర్ పోలీస్ అని ఉంటోంది. అయితే ట్రూ కాలర్ కానీ, ఫోన్ నంబర్ ఐడెంటిఫికేషన్ ఉన్న ఇతర యాప్‌లు ఫోన్‌లో ఉంటే వాటిలో మాత్రం పాకిస్తాన్ అని కానీ, 'సిఎం.పాక్'(చైనా మొబైల్ పాకిస్తాన్) అని నంబర్ కింద కనిపిస్తోంది. అంటే పాకిస్తాన్ మొబైల్ డేటా ఆపరేటర్ నుంచే ఇవన్నీ వస్తున్నట్లు మాత్రం కనిపి స్తోంది. అయితే వారు నేరుగా ఇక్కడి బ్యాంక్ ఖాతా నంబర్‌లు ఇవ్వకుండా, పాకి స్తాన్‌కు చెందినవే ఇస్తున్నా సైబర్ నేరాల కింద అదుపులోకి రాకపోవటం విశేషం. వారి నుంచి సంభాషణ మాత్రం పూర్తిగా హిందీ లేక ఉర్దూలో ఉంటోంది. అయితే ఇటువంటి ఫోన్ కాల్స్ వస్తే వాటిని ఆన్సర్ చెయ్యవద్దని, ఒకవేళ వారు ఏదైనా లింకులు పెట్టి చూడమన్నా ఓపెన్ చెయ్యవద్దని, మీ వ్యక్తిగత సమాచారం అస్సలు పంచుకోవద్దనేది భారత టెలికం శాఖ చేస్తున్న హెచ్చరిక.



ఎస్పీలతో సమావేశమైన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

రౌడీషీటర్లను ఉపేక్షించొద్దు

- శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మహిళలపై అఘాయిత్యాల కట్టడికి కఠినంగా వ్యవహరించాలి
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోండి
- రేంజ్‌లోని ఎస్పీలకు ఐజీ త్రిపాఠి దిశానిర్దేశం

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రేంజి పరిధిలో రౌడీషీటర్లను ఉపేక్షించొద్దని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఎస్పీలను ఆదేశిం చారు. గుంటూరులోని ఐజీ కార్యాయంలో మంగళవారం ఆయన ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీషీటర్ల కార్యకలాపాలను అణిచివేయడం, వారిపై నిఘా, సీసీ కెమెరాల పనితీరు, కేసు దర్యాప్తుల్లో ఆధునిక పరిజ్ఞానం వినియోగం, ఫ్రెండ్లీ పోలీసింగ్ తదితరాలకు సంబంధించి ఎస్పీలకు ఐజీ పలు సూచనలు చేశారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు చేసే వారిని కట్టడి చేయాల న్నారు. సైబర్ క్రైమ్‌లను తగ్గించాలన్నారు. ఇటీవల తెనాలిలో జరిగిన ఘటనలో బాధితురాలిపై రౌడీషీటర్ అత్యాచారం చేసి చంపేశాడని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందన్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్‌లో కూడా తప్పుడు ప్రచారం జరుగుతోందని అటువంటి వాటిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలు సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, తుషార్‌డూడీ, దామోదర్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

రేషన్ మాఫియా.. ఆధిపత్య పోరు

- చీరాలలో పాదంమోపిన పల్నాడు ముఠా
- ఒంగోలు టూ నరసరావుపేట వయా వెదుళ్లపల్లి
- తమకే బియ్యం ఇవ్వాలంటున్న సస్పెండ్ అయిన కానిస్టేబుల్
- స్థానిక డీలర్లకు పరిచయం చేస్తున్న మాజీ డాన్, డీలర్ల ప్రతినిధులు



కారంచేడు పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న సీజ్ చేసిన ఆటో

చీరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చీరాల, పర్చూరు నియోజకవర్గా లలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. వారి మధ్య అంతర్యుద్ధం, ఆధిపత్య పోరుతో భయానక వాతావరణం నెలకొంటుంది. చీరాలలో అక్రమంగా రేష న్ బియ్యం వ్యాపారం చేసే ఒంగోలుకు చెందిన వ్యక్తికి, గతంలో చీరాలలో అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారంలో డాన్‌గా ముద్రపడ్డ వ్యక్తికి మధ్య ఆధిపత్యపోరు నెలకొంది. ఈ క్రమంలో ఓ సస్పెండ్ అయిన కానిస్టేబుల్ నరసరావుపేట రేషన్ మాఫియా వ్యక్తిని చీరాలకు తెచ్చాడు. రేషన్ బియ్యం వ్యాపారం ఇప్పటి వరకు ఒంగోలు వ్యక్తి చేశాడు.. నరసరావుపేట వ్యక్తి మా కులపోడు.. రేషన్ బియ్యం వ్యాపారానికి సంబంధీకులకు నెలకు రూ.20 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదిరింది.. రేషన్ డాన్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి ఇప్పుడు మా వైపు ఉన్నాడు.. డీలర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన కీలక వ్యక్తి కూడా మా వైపే ఉన్నాడు. అందుకే వెదుళ్లపల్లిలో మిల్లు తీసు కున్నాం.. ఈ నెల నుంచి డీలర్లు మాకే సరుకు ఇవ్వాలి.. అంటూ సదరు సస్పెండయిన కానిస్టేబుల్ చెప్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వారికి చీరాల రేషన్ మాఫియా డాన్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి, ఓ డీలర్స్ అసోసి యేషన్ ప్రతినిధి మద్దతు ఉన్నట్లు వినికిడి. పేరాలకు చెందిన హరీష్ అనే వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలించే క్రమంలో ఒంగోలుకు చెందిన వ్యక్తితో ఘర్షణ జరిగింది. కొద్ది రోజుల కిందట కారంచేడు, స్వర్ణ గ్రామాల మధ్య రేషన్ బియ్యాన్ని ఓ వాహనం, డ్రైవర్ పట్టుబడ్డాడు. అందులో 50 బస్తాల రేషన్ బియ్యం సివిల్ సప్లయిస్ ముద్రలున్న గోతాలతో ఉన్నాయి. చీరాల దండుబాటలో బియ్యం లోడ్ చేసిన డి.కుమార్, వాహన డ్రైవర్(వేట పాలేనికి చెందిన) గోపి, వాటిని కొనుగోలు చేసి రవాణా చేసే మోటుపల్లికి చెందిన వెంకట్రావులపై కేసు నమోదు చేశారు. అనంతరం కారంచేడులో పోలీస్ స్టేషన్‌లో నిందితులకు 41ఏ నోటీసు ఇచ్చి పంపారు. వాహనాన్ని సీజ్ చేసి బియ్యాన్ని తహసీల్దారు సూచనల మేరకు సమీప డీలర్‌కు అటా చ్ చేశారు.



కారంచేడు, స్వర్ణ మధ్య పట్టుబడ్డ రేషన్ బియ్యం సివిల్ సప్లయిస్ గోతాల్లోనే(ఫైల్)

పొన్నూరు పోకడలకు పోతే ప్రమాదమే

రేషన్ బియ్యం అక్రమ రవాణా అనేది బహిరంగ రహస్యం. ప్రభుత్వం ఆ చర్యలను వ్యతిరేకిస్తోంది. చీరాలలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రేషన్ మాఫియాలో పొన్నూరులో జరిగిన సంఘటనలపై చర్చ జరుగుతోంది. పాలకులు, అధికారులు తగిన చర్యలు చేపట్టి రేషన్ సరుకులు సక్రమంగా అందేలా చూడాలని కార్డుదారులు కోరుతున్నారు.

చీరాలలో అధికారం దూకుడు

- రైల్వే స్టేషన్ వద్ద యువకుల మధ్య ఘర్షణ
- గతంలో కొత్తపేట మూడు రోడ్ల సెంటర్‌లో చిరువ్యాపారిపై దాడి
- అంతకు ముందు టీడీపీ కార్యాలయంలో సీనియర్ నాయకుడిపైనా

చీరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చీరాల టీడీపీలో దూకుడు పెరి గింది. వరుస ఘర్షణలు, కొట్లాటలపై రాజకీయవర్గాలతో పాటు, సామాన్య ప్రజల్లోనూ చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం చీరాల ఘటనలపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్ వద్ద యువకులు రెండు వర్గాలుగా కొట్లా టకు దిగారు. అందులోని ఓ వర్గంలో టీడీపీ ఎమ్మెల్యే డ్రైవర్ ఉన్నట్లు ప్రచారం ఉంది. కొద్దిరోజుల కిందట వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ మూడు రోడ్ల కూడలిలో ఓ చిరువ్యాపారిపై అధికారపార్టీకి చెందిన వ్యక్తులు దాడిచేశారు. ఆ పంచాయితీ ఎమ్మెల్యే దృష్టికి వెళ్లింది. ఈక్రమంలో వాడరేవు రోడ్డులో హాయ్ రెస్టారెంట్ సమీపంలో కృష్ణాష్టమి సందర్భంగా అధికారపార్టీ వర్గీయుల మధ్య వాగ్వాదం నడిచింది. ఒక దశ లో చేతులు, చేతులు కలిశాయి. ఈ ఘటనతో చీరాల హరిప్రసాద్‌నగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త, ఆయన కుమారుడు మనస్థాపం చెందా రు. అంతకు ముందు టీడీపీ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు నక్కల రమణారావుపై దాడి విషయం కూడా రాజకీయ వర్గాల్లో చర్చ సా గింది. ఇదిలావుంటే ఈపురుపాలెంలో ఓ యువతిపై హత్యాచారం, సంఘం థియేటర్ సెంటర్లో ఓ చిరువ్యాపారి హత్య, ఆదినారాయణపురం ప్రాంతం లో ఓ యువకుడిపై హత్యాయత్నం తదితర ఘటనలు వరుసగా జరిగా యి. వాటిలో ఎలాంటి రాజకీయ కోణం లేదు. ఆ తరువాత ఇటీవల వేట పాలెం మండలం పాపాయిపాలేనికి చెందిన పులి శ్రీనివాసరావు అనే వ్యక్తి అనుమానాస్పద మృతి తీవ్ర సంచలనం రేపింది. అందుకు సంబంధించి భిన్నాభిప్రాయాలున్నాయి. ఆ ఘటనపై విచారణ జరుగుతోంది. ఈ నేప థ్యంలో ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి గతంలో హత్యకు గురైన సం ఘటనతో తాజా పరిస్థితులను అన్వయించుకుంటూ రాజకీయవర్గాలతో పా టు, సాధారణ ప్రజల్లోనూ చర్చ జరుగుతోంది. చీరాల మండలం కావూరి వారిపాలేనికి చెందిన టీడీపీ కార్యకర్త వెంకటేశ్వరరెడ్డి అలియాస్ బుజ్జిరెడ్డి బలన్మరణం వెనుక నెలకొన్న పరిస్థితులపైనా జనాల్లో చర్చ జరుగుతుంది.

పడిపోలేదు .. కొట్టి పడేశారు

» రెండ్రోజుల తరువాత స్పృహలోకి బాధితుడు

» కూలి డబ్బులు అడిగారని దాడి



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు

చీరాలటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆటో నుంచి జారిపడ లేదని ఇద్దరు కొట్టి పడేశారని స్పృహలోకి వచ్చిన బాధితుడు కుటుంబ సభ్యులతో బోరున విలపించారు. ఈ ఘటన చీరాల సమీపంలోని రామనగర్‌లో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. రామగనర్‌కు చెందిన డీ సాల్మన్ రాడ్ బెండింగ్ పని చేస్తుంటారు. ఈక్రమంలో అదే ప్రాంతానికి చెందిన కొమ్మూరి శ్యామ్, కొమ్మూరి మిల్కీ ఇతడిని సుమారు 10రోజులు తిరుపతిలో పనికి తీసుకెళ్లి ఐదు రోజుల కిందట తిరిగి తెచ్చారు. ఆ పనికి కూలి డబ్బులు చెల్లింపు విషయమై వీరి మధ్య వివాదం నడుస్తుంది. ఈక్రమంలో ఉద్దేశపూర్వకంగా శ్యామ్, మిల్కీ ఆదివారం రాత్రి బయట నుంచి ఇంటికి వస్తున్న సాల్మన్‌ను దారికాచి తీవ్రంగా దాడి చేశారు. ఈక్రమంలో బాధితుడి తల వెనుక భాగం, ముఖంపై గాయాల య్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న సాల్మన్‌ను ఇంటి సమీపంలోని ఓ ఖాళీ ఇంట్లో పడేసి వెళ్లిపోయారు. ఆలస్యంగా గుర్తించిన స్థానికులు, కుటుంబ సభ్యులు బహుశా చీరాల నుంచి వస్తూ ఏదైనా ఆటో నుంచి జారిపడ్డాడేమోనని భావిం చారు. అతడిని ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సాల్మన్ మంగళవారం స్పృహలోకి వచ్చి తనపై జరిగిన దాడి విషయం చెప్పారు. వెంటనే అవుట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

పూనూరు వీఆర్‌ఏ గుండెపోటుతో మృతి

యద్దనపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం పూనూరు వీఆర్‌ఏ మేకా సుబ్బారావు (61) గుండెపోటుతో ఇంటిలో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం తహసీల్దార్ కే రవికుమార్, రెవెన్యూ సిబ్బందితో వెళ్లి సుబ్బారావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25వేలను అందచేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బోయపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

బల్లికురవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరేపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి గురై రావులపల్లి లింగయ్య (77) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సూరేపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు రావులపల్లి లింగయ్య సోమవారం రాత్రి ఇంటి డాబా మీదికి ఎక్కగా పైన ఉన్న సర్వీసు వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. లింగయ్య కోసం రాత్రి వరకు గాలించగా ఇంటి పైనే మృతి చెంది ఉండడం చూసిన వారు వెంటనే అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతని భార్య అంజమ్మ మంగళవారం ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మృతి

బల్లికురవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమరవరం గ్రామానికి చెందిన వృద్ధుడు గరికపాటి గోవర్ధనయ్య (71) మంగళవారం వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వేమవరం గ్రామానికి చెందిన వృద్ధుడు గోవర్ధనయ్య నాలుగు రోజుల కిందట ఇంట్లో రాత్రి సమయంలో మూత్ర విసర్జనకు లేచి కాలు జారి క్రింద పడిపోయాడు తలకు బలమైన గాయం కావడంతో వెంటనే వారి కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతు వృద్ధుడు మృతిపై అయన కుమారుడు రామకృష్ణబాబు ఫిర్యాదు మేరకు స్టేషన్ రైటర్ అంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం వ్యవహారంపై కేసు

చీరాలటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం తనకివ్వలేదని దారి కాచి దాడికి పాల్పడిన నలుగురుపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరాలకు చెందిన హరీష్ నల్లబజారుకు తరలించేందుకు 80 బస్తాల రేషన్ బియ్యంతో జాతీయ రహదారిలో లగేజి ఆటోలో వెళుతుండగా ఒంగోలుకు చెందిన ప్రసాద్, ఉప్పుగుండూరుకు చెందిన రాజా మరో ఇద్దరు దాడిచేసి బియ్యం బస్తాలను అపహరించారు. దీనిపై బాధితుడు చీరాల టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా బీఎన్ఎస్ చట్టం ప్రకారం నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనిలో ప్రథమ నిందితుడిగా ఉన్న ప్రసాద్ కారుకు పోలీస్ సైరెన్ వినియోగించడం చర్చనీయాంశం.

అర్ధరాత్రి రైల్వే స్టేషన్‌లో యువకులు హల్‌చల్

పోలీసుల ముందే బాహాబాహీ

చీరాలటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే స్టేషన్ ప్రాంగణంలో అర్ధరాత్రి కొందరు యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. స్టేషన్ సమీపంలో ఉన్న హోటల్ వద్దకు టిఫిన్ చేసేందుకు వచ్చాక చోటుచేసుకున్న వివాదంలో పరస్పరం పిడుగుద్దులకు దారితీసింది. ఈక్రమంలో ఓ వర్గానికి చెందిన వ్యక్తి ముఖానికి రక్త గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సర్ది చెప్తున్న ఏమాత్రం లక్ష్య పెట్టక దాడులు చేసుకుంటూనే ఉన్నారు. దీంతో పోలీసులు ఆగ్రహించడంతో అక్కడ నుంచి పరారయ్యారు. వీరిలో కొందరు పట్టణానికి తెలిసిన ముఖాలే. ఈ రెండు వర్గాలను సీఐ శ్రీనివాసరావు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇది మరోసారి జరిగితే రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు.

కారు ఢీకొని యువకుడు మృతి



రాజశేఖర్ మృతదేహం

మార్టూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జొన్నతాళి సెంటర్ వద్ద రోడ్డు దాటుతున్న అందె రాజశేఖర్ (30)ని ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే అతను మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. మృతి చెందిన యువకుడు అవివాహితుడు.మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన వాడు. చేనేత కుటుంబానికి చెందిన అందె ఆదినారాయణ, సుభద్ర దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నా రు. వారిలో చిన్నవాడు రాజశేఖర్ పెయింట్ పనులకు వెళుతుంటాడు. జొన్నతాళి సెంటరు వద్ద నూలుమిల్లులో పని చేస్తున్న తండ్రి ఆదినారాయణకు డబ్బులను ఇవ్వడానికి సాయంత్రం సమయంలో వలపర్ల నుంచి ఆటోలో వచ్చిన రాజశేఖర్ జొన్నతాళి సెంటర్ వద్ద దిగాడు. జొన్నతాళి రోడ్డు వైపు వెళుతున్న అతనిని కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంపై పడిపోయిన అతడు అక్కడే చనిపోయాడు. అతని శరీంపై ఎలాంటి గాయాలు లేవు. ప్రమాద వార్త తెలుసుకున్న హైవే అంబులెన్సు వారు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న లారీ

మేదరమెట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో మేదరమెట్లలోని తమ్మవరం ఫ్లైవోవర్ వద్ద ముందు వెళ్తున్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటన నుండి మంగళవారం వేకువజామున జరిగింది. విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న లారీ మరో లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో లారీలోని రెండవ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన డ్రైవర్ రాజమండ్రికి చెందిన వి సుధాకర్‌గా గుర్తించారు. గాయపడిన డ్రైవన్‌ను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

గోతులను పూడ్చిన లారీ యజమానులు

బల్లికురవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొణిదెన - మార్టూరు గ్రామాల మధ్య అర్అండ్‌బీ రోడ్డులో పడిన గోతలను లారీ యజమానులు పూడ్చారు. వర్షాల కారణంగా రోజురోజుకూ గోతులు పెద్దవి కావడంతో గ్రానైట్ రాయి లారీలు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో మంగళవారం కొందరు గ్రానైట్ రాయి రవాణా చేసే లారీల యజమానులు ఫ్యాక్టరీల వద్ద లభించే వ్యర్థరాళ్లను తెచ్చి గోతులలో పడేసి కొంత మేర పూడ్పించారు. సుమారు కిలోమీటర్ దూరం వరకు పూర్తిగా రోడ్డు మోకాటిలోతు గోతులుగా మారిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఈ రోడ్డును పూర్తిస్థాయిలో బాగు చేయాలని కోరుతున్నారు.



కొణిదెన - మార్టూరు గ్రామాల మధ్య గోతులను పూడ్పిస్తున్న గ్రానైట్ లారీల యజమానులు

అన్ని ప్రాంతాలకూ ప్రాధాన్యం

» మిత్రపక్షాలకు కూడా నామినేటెడ్ పదవులపై టీడీపీ నేతల విస్తృత చర్చ

» వెలిగొండ ప్రాజెక్టుతోపాటు పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవులపై ప్రధాన సమీక్ష

» రేపు అమరావతిలో భేటీ, సీఎంను కలిసే అవకాశం » ఒంగోలులో సమావేశమైన మంత్రులు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

నామినేటెడ్ పదవుల విషయంలో జిల్లాలోని అన్ని ప్రాంతాలకూ అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. అలాగే రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు జనసేన, బీజేపీలను కూడా కలుపుకుపోవాలని, అవసరమైన మేరకు వారికీ పదవులు కేటాయించాలనుకున్నారు. ప్రధానంగా సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ పదవిపైన, వెలిగొండ నిర్మాణ పనుల పైన సమీక్షించుకున్న నేతలు అమరావతిలో సమావేశం కావాలని, అవకాశం దొరికితే సీఎంను కలవాలని తీర్మానించుకున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామిల తోపాటు అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు మంగళవారం మధ్యాహ్నం ఒంగోలులోని ఎమ్మెల్యే జనార్దన్ ఇంట్లో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా మంగళవారం జరిగిన జడ్పీ సమావేశానికి మంత్రులతోపాటు టీడీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సోమవారం రాత్రి టెలీ కాన్ఫరెన్స్‌లో నేతలంతా మాట్లాడుకుని జడ్పీ సమావేశానికి రావాలని నిర్ణయించుకున్నారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే జనార్దన్ ఇంట్లో మంత్రులు రవికుమార్, స్వామిలతోపాటు ఎమ్మెల్యేలు జనార్దన్, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌లు సమావేశంలో పాల్గొన్నారు. డ్రోన్ సమ్మిట్ పనుల్లో ఉన్న ఎమ్మెల్యే సాంబశివరావు అందుబాటులో లేని విజయ్‌కుమార్, కొండయ్యలు హాజరుకాలేదు.

పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవిపై ప్రధాన చర్చ

నామినేటెడ్ పదవుల అంశంపై ప్రధాన చర్చ జరిగింది. అన్ని ప్రాంతాలకూ, అన్ని సామాజికవర్గాల వారికీ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరు మంత్రులతోపాటు కొత్తగా వచ్చిన కార్పొరేషన్ పదవులు కూడా తూర్పు ప్రాంతానికే దక్కాయి. దీంతో భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల విషయంలో అన్ని ప్రాంతాలకు న్యాయం జరిగేలా చూడాలని ఉగ్ర ప్రతిపాదించారు. ఆ వెంటనే మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు తమ ప్రాంతాలకు ఇంతవరకూ ఎలాంటి అవకాశాలు ఇవ్వలేదని, కార్యకర్తల నుంచి ఒత్తిడి ఉందని చెప్పారు. జిల్లాస్థాయిలో సెంట్రల్ బ్యాంక్, డీసీఎంఎస్, కోల్ సొసైటీ, పొగాకు సమాఖ్య, వక్ఫ్‌బోర్డు, గ్రంథాలయం, ఓడా చైర్మన్ తదితర పదవులపై చర్చ జరిగింది. వీటిని అన్ని ప్రాంతాలు, సామాజికవర్గాలకు అవకాశం కల్పించేలా ఎంపిక చేసుకోవాలని నిర్ణయించారు. అదేసమయంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన జనసేన, బీజేపీల అంశం కూడా చర్చకొచ్చింది. ఆ పార్టీ నేతలతో కూడా చర్చించి రాష్ట్ర పార్టీ నిర్ణయానికి అనుగుణంగా వారికి అవకాశాలు ఇచ్చి ముందుకుపోవాలని నిర్ణయించుకున్నారు. మంత్రులు రవి, స్వామిలు చేసిన ప్రతిపాదనలకు మిగిలిన వారు అంగీకారం తెలిపారు.

వెనక్కివచ్చే ప్రసక్తే లేదు

ఈ సందర్భంగాసెంట్రల్ బ్యాంక్ పదవిపై వారి మధ్య చర్చ సాగినట్లు తెలిసింది. ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ ఇప్పటికే డాక్టర్ సీతారామయ్య పేరును ఆ పదవికి ప్రతిపాదించారు. ఆయనతోపాటు కొత్త ప్రకాశం జిల్లాలోని మిగిలిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఆయన సిఫార్సు లేఖపై సంతకాలు చేయగా, మంత్రి రవి, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావులు అందరితో మాట్లాడి నిర్ణయిద్దామంటూ సంతకాలు చేయలేదని తెలిసింది. ప్రస్తుతం త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా ఆయన్ను నియమిస్తే ఆరు నెలల్లో జరిగే ఎన్నికల్లో అవసరమైన ఆర్థిక ఏర్పాట్లు చేసుకోగలరా? అని ఉగ్ర ప్రశ్నించినట్లు తెలిసింది. దామచర్ల అం దుకు ఆయన సిద్ధం అని చెప్పగా మంత్రి రవి జోక్యం చేసుకుని మీరు చెప్పండని డాక్టర్‌ను అడిగినట్లు సమాచారం. వెనక్కి వచ్చే ప్రసక్తే లేదని, ఎన్నికలు వచ్చినా తాను అన్నివిధాలా సిద్ధమేనని డాక్టర్ సీతారామయ్య చె ప్పినట్లు తెలిసింది. అలాగైతే తమకు ఇబ్బందిలేదని, సమావేశంలో ఎక్కువమంది మద్ద తు ఇచ్చినట్లు సమాచారం. మంత్రి రవి మ రోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తూ మరికొందరు ఎమ్మెల్యేలు లేనందున గురువారం అమరావతిలో జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుందామని, అక్కడికి డాక్టర్ కూడా రావాలని చెప్పినట్లు తెలిసింది.

వెలిగొండపై పట్టు

వెలిగొండ ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగడం లేదని, ఈ విషయమై ప్రభుత్వం నుంచి స్పందించకపోవడంతో పశ్చిమప్రాంత ప్రజలు ఆందోళనలో ఉన్నారని మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి సమావేశంలో ప్రస్తావించారు. తక్షణం పనులపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వెంటనే రవికుమార్, స్వామి నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడుకు ఫోన్ చేసి ఆ విషయంపై మాట్లాడారు. ఈ విషయాన్ని సీఎం వద్ద చర్చించాల్సిన అవసరం ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. తదనుగుణంగా మిగిలిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు కూడా ఉంటే బాగుంటుందని భావించి గురువారం అమరావతిలో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జిలు భేటీ కావాలని నిర్ణయించుకున్నారు. సీఎంను కలవాలని తీర్మానించారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

మార్టూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మండలంలోని రెండు కుటుంబాలకు చెందిన వారికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సాయమందించారు. మార్టూరు గ్రామానికి చెందిన తమ్ములూరి సామ్యూల్‌కు రూ.లక్షా8వేల600, వలపర్ల గ్రామానికి చెందిన మల్ల కోటమ్మకు రూ.లక్షా8వేల600 ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం మంజూరు అయింది. ఆ రెండు చెక్కులను మండలంలోని ఇసుక దర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో స్థానిక టీడీపీ నాయకులు బాధితులకు అందచేశారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు, రామకృష్ణ, చెరుకూరి అంజిబాబు, ముద్దన హనుమంతరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, కొర్రపాటి వేణుబాబు, మారుతి పాల్గొన్నారు.



బాధితులకు చెక్కును అందజేస్తున్న టీడీపీ నేతలు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య

అమర వీరుల త్యాగాలు మరువలేనివి

అద్దంకి, అక్టోబరు 22 : దేశం కోసం పోలీస్ అమర వీరులు చేసిన త్యాగాలు మరువలేనివని అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య అన్నారు. పోలీస్ వారోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి అద్దంకి పట్టణంలోని టెలిఫోన్ ఎక్చేంజ్ సమీపంలో ఉన్న బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అమర వీరులు చేసిన త్యాగాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్సై ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నేడు గంగవరంలో గ్రామసభ

ఇంకొల్లు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గంగవరంలో బుధవారం భూ సమస్యలపై గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. గతంలో జరిగిన రీ సర్వేలో తలెత్తిన సమస్యలపై గ్రామ సభలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. సభలను రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.



జిల్లా సమన్వయకర్తకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఆర్ వైద్యసేవ సిబ్బంది

సమస్యలను పరిష్కరించాలి

ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది వినతి

చీరాలటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : డా. ఎన్టీఆర్ వైద్య సేవలో సుదీర్ఘంగా పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది జిల్లా మేనేజర్, వైద్య మిత్రలు, టీం లీడర్స్, ఆఫీస్ అసోసియేట్స్, మానిటరింగ్ యూనిట్ సమస్యలు పరిష్కరించాలని ప్రతినిధులు కోరారు. ఈక్రమంలో మంగళవారం జిల్లా సమన్వయకర్త డా. సీహెచ్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు అందక అవస్థలు పడుతున్నట్లు వివరించారు. ఈక్రమంలో ఏపీ వైద్య మిత్ర ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో దశలవారీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బడుగు రాజు, అన్నంగి రేబికా, కాకాని రాంబాబు, బోయాజ్, ప్రభాకర్, రాజశేఖర్, అనిల్, ఫణి, విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలా

» చీరాలలో పలు స్కూళ్లు తనిఖీ చేసిన బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

» ఏపీ మోడల్, కేజీబీవీ, పేరాల హైస్కూల్ సిబ్బంది తీరుపై ఆగ్రహం

» చిన్నారుల ఆరోగ్యంపై ఇంత నిర్లక్ష్యమా » తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

» మూడు స్కూళ్లకు షోకాజ్ నోటీసులు

చీరాలటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల జీవితాలంటే ఆటలా ? మీ పిల్లలయితే ఇలాగే వ్యవహరిస్తారా ? తీరు మార్చుకోకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి హెచ్చరించారు. మంగళవారం జాతీయ రహదారి సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గడువు తీరిన రాగి పిండి స్కూల్ విద్యార్థులకు ఆహారంగా ఇవ్వడంతో పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నట్లు గుర్తించారు. విద్యార్థుల గదిలో విద్యుత్ మోటారు ఉండడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాపాయస్థితికి చేరితే బాధ్యులెవరని నిలదీశారు. అనంతరం సమీపంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. లైట్‌లు లేకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతోపాటు ప్రిన్సిపాల్ తీరుపై పద్మావతి మండి పడ్డారు. బియ్యం నాణ్యత ప్రమాణం కోల్పోయి ఉన్నట్లు గుర్తించి ఆరా తీశారు. ప్రిన్సిపాల్ సిబ్బందిని



కేజీబీవీలో తనిఖీ చేస్తున్న బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుసుకున్నారు. పేరాల హైస్కూల్ తనిఖీ చేసి అసంతృప్తి చెందారు. ఏపీ మోడల్, కేజీబీవీ, పేరాల స్కూల్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పద్మావతి ఎంఈవో సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. పట్టణంలోని ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 15 రోజులలో సమస్యలు పరిష్కారం కావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ నాగశ్రీను, నీలిమ, చారులత, పురుషోత్తమరావు, ప్రవీన, కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.



తిమ్మనపాలెంలో మద్యం షాపు వద్దని రోడ్డెక్కిన గ్రామస్థులు

మద్యం షాపు వద్దంటూ ఆందోళన

మేదరమెట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాన్ని తమ ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దని పలువురు మంగళవారం ఆందోళనకు దిగారు. కొత్తగా మద్యం లైసెన్స్‌లు పొందిన వారు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. తిమ్మనపాలెం నుంచి నాగులపాడు వెళ్లే రోడ్డులో మద్యం షాపును ఏర్పాటు చేశారు. మద్దిపాడు మండలంలోని బూరేపల్లి పునారావాసకాలనీలో ఈ షాపును ఏర్పాటు చేశారు. ఇది మద్దిపాడు మండలానికి సంబంధించిన మద్యం దుకాణం. నాగులుప్పలపాడు రోడ్డుకు దక్షణం వైపు ఉన్న బూరేపల్లి కాలనీలో షాప్‌ను ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఉత్తరం వైపు తిమ్మనపాలెంకు చెందిన నివాస గృహాలతోపాటు చర్చి ఉంది. చర్చికి ఎదురుగా మద్యం షాపు వద్దని భక్తులు, నివాస గృహాల ప్రజలు రోడ్డెక్కారు. మద్యం కోసం వచ్చే వారు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు వాహనాలను ఇష్టానురీతిన నిలుపుతున్నారని అన్నారు. వెంటనే ఇక్కడి నుంచి మద్యం దుకాణాన్ని వేరే చోటుకు మార్చాలని వారంతా పట్టుబట్టారు. తక్షణమే ఎక్సైజ్, పోలీస్ అధికారు లు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

ఎంపీడీవో రాజ్యలక్ష్మి

మేదరమెట్ల, అక్టోబదరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలల్లో ఆధార్ మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీపీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవాల్సిన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మంగళవారం రావినూతల, తిమ్మనపాలెం గ్రామాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పలువురు గ్రామస్థులు తమ ఆధార్ కార్డులను మార్పులు చేసుకున్నారు. 23 పమిడిపాడు, రాచపూడి, తమ్మవరం, బొడ్డువానిపాలెం, 24న కొరిశపాడు, పీగుడిపాడు, 25వ తేదీన మేదరమెట్ల, దైవాలరావూరు గ్రామాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

సాయి మందిర సేవకుడు గుండెపోటుతో మృతి



ప్రసాద్

బల్లికురవ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కబొక్కలపాడు హనుమాన్ సాయి మందిర సేవకుడు దాసరి ప్రసాద్ (60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. రెండు దశాబ్దాల నుంచి ఆయన సాయి మందిర నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించడంతో పాటు నిత్యం భక్తులందరికీ సేవలందిస్తూ సాయి సేవకుడిగా గుర్తింపు పొందారు. ప్రసాద్ హఠాన్మరణంతో భక్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సాయి మందిరం పక్కనే గృహంలో ఉండగా గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందారు. అయనకు కుమారుడు ఉన్నారు.

పోలీసుల పాత్రపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్

ఇంకొల్లు,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో పోలీసు శాఖ పాత్ర, పోలీసుల పనితీరుపై విద్యార్థులకు ఎస్ఐ జి.సురేష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని స్కూల్స్, కాలేజీలలో మంగళవారం విద్యార్థులకు పోలీసుశాఖపై అవగాహన కలిగించారు. ఏ సమస్య వచ్చినా మీకు సహాయసహకారాలు అందిస్తామని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. అనంతరం అమరవీరుల ఫ్లెక్సీలకు పూలమాలవేసి జోహర్లు అర్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం



విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ప్రతినిధులు

ఇంకొల్లు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేయూతన అందిస్తుందని ఆ సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో ఇడుపులపాడు గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ చదువుతున్న ప్రతిభకలిగిన పేద విద్యార్థి పి.అజయ్‌కు మంగళవారం ల్యాప్‌టాప్‌ను అందజేసారు. గతంలో ఈ మండలంలో నలుగురు విద్యార్థులకు ల్యాప్‌ల్యాప్‌లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌లు శివాజీ, సాంబశివరావు, ధనుంజయరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గురవారెడ్డి, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, ఆనందరావు, సాయికిరణ్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపాలి

ఇంకొల్లు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు మొగ్గు చూపాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పావులూరులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు పలు సూచనలు చేశా రు. వర్షాల వలన పంటలు దెబ్బతినకుండా పొటాషియం నైట్రేట్‌ను ఎకరానికి కేజీ చొప్పున పిచికారీ చేయాలని, మిరపలో కుళ్లు తెగులుకు ట్రైకోటెర్మను వేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహా యకులు, రైతులు పాల్గొన్నారు.

అవస్థల వసతి

» దోమలు, చాలీచాలని సౌకర్యాలతో హాస్టల్ విద్యార్థుల ఇబ్బందులు

పర్చూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అరకొర వసతులు, చాలీచాలని వసతి గృహాల్లో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక పక్క వసతుల లేమి మరో పక్క దోమల బెడదతో కాలం వెళ్లదీస్తున్నారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. ఏమిచేయాలో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మిన్నకుండి పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇది పర్చూరులోని గిరిజన సంక్షేమశాఖ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల దుస్థితి. ప్రస్తుతం ఈ పాఠశాల పర్చూరులోని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.



మరుగు దొడ్ల పరిస్థితి ఇలా



'తింటే గారెలు తినాలి.. వింటే భారతం వినాలి' అనే నానుడి కాస్తా 'తింటే నాటు కోడి తినాలి....' అన్నట్టు మారిపోయింది. దాని మాంసం మధురంగా ఉంటుంది. ఆరోగ్యానికీ శ్రేష్టమే. అందుకే చికెన్ తింటే నాటుకోడి మాంసమే తినాలంటారు. అంతేకాదు బరిలోకి దిగా అది పులిగా ఎగిరి పడుతుంది. ప్రత్యర్థిని పడగొట్టేవరకూ పోరాడుతుంది. అప్పుడు దాని రాజసం వేరే స్థాయిలో ఉంటుంది. అందుకే కరోనా తరువాత ఆరోగ్యంపై ప్రజలకు శ్రద్ధ పెరగడంతో నాటుకోళ్లవైపు మళ్లారు. దానికి అనుగుణంగా వ్యాపారం కూడా పెరిగింది. ఈ క్రమంలో కొండపి నియోజకవర్గంలో నాటుకోళ్ల పెంపకంపై ప్రత్యేక కథనం..

కొక్కొరొకో.. క్రేజ్

నాటుకోళ్ల వైపు జనం పరుగులు

- పోషకుల్లోనూ పెరుగుతున్న ఆసక్తి
- మాంసం విక్రయాల్లోనూ హెచ్చు
- రూ.లక్షలు పలుకుతున్న పందెం పుంజులు
- గోదావరి జిల్లాల నుంచి తెచ్చి పెంపకం
- కొండపి నియోజకవర్గంలో వ్యాపారం వృద్ధి

కొండపి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు వ్యవసాయం చేసుకునే రైతులు, కూలీలు, గ్రామీణులు పాడిపరిశ్రమతోపాటు అదనపు ఆదాయ వనరుగా నాటుకోళ్లను పెంచుకునేవారు. రాను రానూ వాటి పెంపకం తగ్గిపోయింది. వినియోగదారులు కూడా నాటుకోళ్లను వదిలేసి ఫారం, బాయిలర్ కోళ్ల మాంసం తినడానికి అలవాటు పడ్డారు. కరోనా తర్వాత పౌష్టికాహారంపై పెరిగిన అవగాహనతో తిరిగి నాటుకోళ్ల మాంసంవైపు మళ్లారు. వీటి పెంపకం కూడా గ్రామాల్లో చిన్నతరహా పరిశ్రమగా వృద్ధి చెందుతోంది. కంచెతోపాటు షెడ్లు వేసి పెంచి ఆదాయం పొందుతున్నారు.



తాటాకులపాలెం వద్ద సాయికృష్ణ పెంచుతున్న నాటుకోళ్లు

ఆశాజనకంగా నాటుకోళ్ల వ్యాపారం



పొదుగుతున్న కోడి

- మద్దిపాడు మండలంలోని రామాయపాలెం వద్ద కొండపి మండలం పెట్లూరు గ్రామానికి చెందిన పాలకీర్తి నాగేశ్వరరావు దాదాపు 200 కోళ్లను పెంచుతున్నారు. వీటితోపాటు భీమవరం, పాలకొల్లు, కైకలూరు, ఉండి ప్రాంతాల నుంచి జాతిగల పందెం పుంజులు తెచ్చి, మేలైన కోడిపెట్టలతో సంక్రమింపజేస్తున్నారు. వాటి గుడ్లను పొదిగించి మేలైన పుంజులను, పెట్టలను ఉత్పత్తి చేస్తున్నారు.
- కొండపి మండలంలోని తాటాకులపాలెం వద్ద ఎకరం పొలం లీజుకు తీసుకుని గుడ్లూరు మండలం సీతారామపురానికి చెందిన పేరం సాయికృష్ణ నాటుకోళ్లు పెంచుతున్నారు. 100 కోళ్లకుపైగా ఉన్నాయి. గోదావరి జిల్లాలోని భీమవరం సమీప గ్రామాల్లో కోడి నెమలి, కాకి డేగ, కక్కెర, పచ్చకాకి, సేతువ లాంటి జాతి రకాల కోళ్లను కొని ఇక్కడికి తీసుకొచ్చి పెంచుతున్నారు. ఒక్కొక్క కోడి రూ.లక్ష వరకు ఉంటుందని ఆయన చెబుతున్నారు. సకాలంలో వ్యాక్సిన్‌లు వేయిస్తే బతుకుతాయని, లేకపోతే కొక్కెర తెగులు వచ్చి చనిపోయే అవకాశం ఉంటుందని వివరించారు. మాసంకోళ్లు సగటున కేజీ రూ.750 విక్రయిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని గుర్రప్పడియ, కొండపి ప్రాంతాల్లో కూడా నాటుకోళ్ల వ్యాపారం రోజురోజుకూ పెరుగుతోంది.



రూ.లక్షల్లోనే పందెం పుంజులు

పందెం పుంజులు, నాటుకోళ్లు 400 పెంచగలిగితే ఏడాదికి రూ.6 లక్షలకుపైగా నికరాదాయం పొందొచ్చు. మా దగ్గర లక్ష రూపాయల విలువైన పందెం పుంజు నుంచి రూ.20 వేల కోడిపెట్టలు ఉన్నాయి. సంక్రాంతి సమయంలో పందెం పుంజుల్లో కొన్ని రకాలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. అప్పుడు ఒక్కొక్క పందెం కోడి ధర రూ.లక్షల్లో ఉంటుంది. **- సాయికృష్ణ, తాటాకులపాలెం**





సీఎం చంద్రబాబును కలిసి సమస్యలను వివరిస్తున్న డాక్టర్ లక్ష్మి

'దర్శి' అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి

సీఎంకు విజ్ఞప్తి చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. అమరావతిలో మంగళవారం సీఎంను కలిసిన సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దర్శి నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయని, అభివృద్ధికి తక్షణమే నిధులు ఇవ్వాలని కోరారు. వర్షాలకు సాగులో ఉన్న మిర్చి, బొప్పాయి, సజ్జ, పత్తి, వైట్‌బర్లీ, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు.

విమానాశ్రయం అభివృద్ధిపై కేంద్రమంత్రికి విజ్ఞప్తి

దొనకొండ : దొనకొండలో బ్రిటీష్ కాలంనాటి విమానాశ్రయం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లి వివరించినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన డ్రోన్ సమ్మిట్ సమావేశంలో ఆమె పాల్గొని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో దొనకొండ విమానాశ్రయం అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుపై చర్చించారు. దొనకొండలో విమానాశ్రయానికి ఉన్న భూమికి అదనంగా కేటాయించిన భూమి తదితర అంశాలతో విమానాశ్రయం నిర్మాణ సాధ్యసాధ్యాలను వివరించారు. ప్రభుత్వ భూముల్లో వలసలు నివారించే లక్ష్యంతో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు చర్యలు చేపట్టి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి పూర్తి నివేదికతో అధికారులతో కలిసి రావాలని, చర్చించి తగిన నిర్ణయం తీసకుందామని మంత్రి హామీ ఇచ్చినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.

నిండుకున్న 'ట్రిపుల్ వ్యాక్సిన్'

(5 పేజీ తరువాయి)

ప్రాంతంలో బ్యాక్టీరియా ప్రవేశించి ధనుర్వాతం కలిగిస్తుంది. వ్యాధి సోకిన పిల్లలు విల్లు ఆకారంలో వంగిపోతారు. దీంతో దీనికి ఆ పేరు వచ్చింది. సకాలంలో చికిత్స ఇవ్వకపోతే పిల్లలు మృతి చెందుతారు. కోరింత దగ్గు ప్రధానంగా శ్వాస కోశ వ్యాధి, జలుబు లక్షణాలు ఉంటాయి. వ్యాధి తీవ్రత వల్ల చిన్నారులు విపరీతమైన దగ్గుతో సతమతం అవుతారు. ఇలాంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వాస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డీపీటీ వ్యాక్సిన్ వేస్తారు. చిన్నారులకు ఐదేళ్ల వయస్సు వచ్చే నాటికి మొత్తం ఐదుసార్లు ఇంజెక్షన్ రూపంలో డీపీటీ వ్యాక్సిన్‌ను ఇస్తారు. పుట్టిన మొదటి రోజు నుంచి ఆరు వారాల మధ్య, 10 వారాలు, 14 వారాల వయస్సులో మూడు ద ఫాలుగా ఈ టీకా మందును ఇస్తారు. అనంతరం 16 నెలల నుంచి 24 నెలల్లో మొదటి బూస్టర్ డోస్, 5-6 సంవత్సరాల్లో రెండో బూస్టర్ డోస్ టీకాను సూచిస్తారు. దీనివల్ల పిల్లలకు ఈ మూడు వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.

మార్కెట్‌లోనూ లభించని పరిస్థితి

జిల్లాలోని బహిరంగ మార్కెట్‌లో డీపీటీ వ్యాక్సిన్‌లు అందుబాటులో లేవు. కొన్ని చోట్ల అరకొరగా దొరుకుతున్నా ఆయా వ్యాక్సిన్‌ల పొటెన్సీ సరిగ్గా ఉండదని వైద్య నిపుణులే చెబుతున్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో ఈ టీకాలకు పెద్ద మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా చిన్నారులందరికీ ఉచితంగా డీపీటీ వ్యాక్సిన్ ఇస్తున్నారు. నెల రోజులుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు డీపీటీ టీకాల పంపిణీ నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి సంబంధించి గన్నవరంలోని స్టేట్ వ్యాక్సిన్ స్టోర్స్‌కు పంపుతుంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నుంచి ఈ వ్యాక్సిన్ పంపిణీ నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా అవసరాలకు ఏటా 26 వేల డోసులు అవసరం. ఇంతపెద్ద సంఖ్యలో వ్యాక్సిన్‌లు అవసరమైనా జిల్లా ఆరోగ్య శాఖకు అందటం లేదు. నెల రోజులుగా డీపీటీ వ్యాక్సినేషన్ నిలిచిపోయింది.

ఏడాదిలోపు ఇవ్వొచ్చు: డీఐవో

జిల్లాకు డీపీటీ వ్యాక్సిన్ పంపిణీ నిలిపోయిన విషయం వాస్తవమేనని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్థాయి నుంచే పంపిణీ తాత్కాలికంగా నిలిచిపోయినట్లు తెలిపారు. తొలిరోజుల్లో వ్యాక్సిన్ ఇవ్వకపోయినా ఏడాది వయస్సు లోపు పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వచ్చని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో డీపీటీ వ్యాక్సిన్‌లు జిల్లాకు అందుతాయని తెలిపారు.

ఎన్నాళ్లీ విద్యావేదన!

(5 పేజీ తరువాయి)

ఫీజు రీయింబర్స్‌మెంట్ రావాల్సి ఉంది. ఈ ఏడాది తొలి మూడు నెలలు గడిచిపోవడంతో నాలుగో విడత ఫీజు చెల్లింపు కూడా బకాయిగా మారింది. దీంతో పాత వారికి సంబంధించి నాలుగు దఫాలు, కొత్తవారికి సంబంధించి ఒక దఫా ఫీజులు రావాల్సి ఉంది. మొత్తంగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి సుమారు రూ.160 కోట్ల మేర ఫీజు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. గత నాలుగు దఫాలుగా ఫీజులు రాకపోవడంతో కళాశాలల నిర్వహణే సమస్యగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులు బకాయిలు కోసం ఎదురు చూస్తున్నారు.

విద్యార్థుల కుటుంబాలకూ తప్పని కష్టాలు

గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని 'విద్యాదీవెన' పేరుతో తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసే కార్యక్రమం చేపట్టింది. దీని కారణంగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఫీజులు పడతాయి కనుక, వాటితో తమకు సంబంధం లేదని కళాశాలల యాజమాన్యాలు పట్టుపట్టాయి. 'విద్యాదీవెన పడితే ఆ డబ్బు మీరే తీసుకోండి.. ముందు మాకు కట్టాల్సిన ఫీజు బకాయి చెల్లించండి' అని పట్టుపట్టారు. వారి సర్టిఫికేట్లు ఆపేసి ఫీజులు వసూలు చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టి తమ బిడ్డల సర్టిఫికేట్లు తెచ్చుకున్నారు. వారు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారికి ఊరట లభించకపోవడంతో కలవరం చెందుతున్నారు.

ప్రభుత్వంపై గత బకాయిల మోత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించింది. కానీ ఫలితం లేకపోయింది. గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన ఫీజు బకాయిలు చెల్లించడానికే ఏం చేయాలో తెలియని స్థితిలో పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా రూ. 643 కోట్లు విడుదల చేసింది. అవి పాత బకాయిల చెల్లింపుల్లో ఒక్క మూలకి కూడా రాలేదు. దీంతో ఆ తరువాత కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తని పరిస్థితి. దీంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పద్దు మరింత పెరిగింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాసంస్థల గుండెల్లో గుబులుగా మారింది.

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

కొండపి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కొండపిలో ఆర్టీసీ బస్‌స్టేషన్ మహిళలతో మాట్లాడారు. తెలంగాణలోలాగా ఇక్కడ కూడా వెంటనే అమలు చేయాలని కోరారు.

25 నుంచి పశుగణన

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు 21వ అఖిల భారత పశుగణన సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు.

పొదుపు సంఘాలకు రూ.100 కోట్ల రుణాలు

ఒంగోలు నగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పొదుపు సంఘాలకు రూ.100 కోట్ల రుణాలను అందించేందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా డీఆర్‌డీఏ, వెలుగు పీడీ వసుంధర కోరారు. మంగళవారం స్థానిక వెలుగు టీటీడీసీ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని కెనరా బ్యాంకు బ్రాంచిల ద్వారా రూ.100 కోట్ల రుణాలను ఇచ్చేందుకు పొదుపు సంఘాలకు గుర్తించటం, వారికి రుణాలు అందించేందుకు అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఈ రుణాలతో పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకుని జీవనోపాధులను పెంపొందించుకోవాలని కోరారు.

రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22: జిల్లాలో భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో మంగళవారం నుంచి గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రీ సర్వేలో జరిగిన అనేక అవకతవకలతో భూ యజమానులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు కూటమి ప్రభుత్వం గుర్తించింది. దీంతో కూటమి ప్రభుత్వం రీ సర్వే జరిగిన గ్రామాల్లో సభలను నిర్వహించి వాటి ద్వారా సమస్యలను పరిష్కరించేలా విధంగా శ్రీకారం చుట్టింది. మండల స్థాయి గ్రామసభలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల భూసర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్‌లు ఈ గ్రామసభల్లో పాల్గొన్నారు. మంగళవారం నుంచి వచ్చేనెల 22 వతేదీ వరకు గ్రామసభలు నిర్వహించేందుకు మండల స్థాయిలో గ్రామాల వారీగా షెడ్యూల్‌ను కూడా ప్రకటించారు. దాని ప్రకారం గ్రామ సభలు నిర్వహించి అందుకు సంబంధించిన సమస్యలను రైతులతో చర్చించి వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో డివిజన్ స్థాయి ఆర్డీవోల పర్యవేక్షణలో ఈ గ్రామ సభలు జరుగుతున్నాయి. 298 రెవెన్యూ గ్రామాల్లో భూములపై గ్రామసభలను నిర్వహిస్తున్నారు.

టీజేఆర్ అక్రమాలపై సీఐడీకి ఫిర్యాదు చేస్తాం

- మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సృజన్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలంలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబు చేసిన అవినీతి, అక్రమాలపై సీఐడీకి ఫిర్యాదు చేయనున్నట్లు మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్ తెలిపారు. మంగళవారం ఒంగోలులోని అంబేద్కర్‌భవన్‌లో జరిగిన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా హోంశాఖ మంత్రి అనితపై టీజేఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. సుధాకర్‌బాబు రాజకీయజీవితమంతా అవినీతి, అక్రమాల మయమని ఆరోపించారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్ల కాలంలో సంతనూతలపాడు నియోజకవర్గంలో దళితులు, బడుగులు, నిరుపేదల వద్ద నుంచి వారికి ఇచ్చిన ఉద్యోగానికి లక్షలు వసూలు చేసి దోచుకున్నారన్నారు. మల్లవరంలో పంట కాలువను ఆక్రమించి భవనం నిర్మించడం వాస్తవం కాదని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాల్లో కూరకపోయిన టీజేఆర్, హోంమంత్రి అనితపై అవాకులు చవాకులు పేలితే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.



వర్షానికి ముందు ఇలా..

చేతిదాకొచ్చి నీటిపాలు

- సజ్జ పంట వర్షార్పణం
- హతాశులైన రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



వర్షం తరువాత ఇలా..

చీమకుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : సజ్జ పంట సాగుచేసిన రైతులపై ప్రకృతి పగబట్టింది. పంట విత్తిన నాడు కాలానికి విరుద్ధంగా కాసిన ఎండలతో పంట తొలినాళ్లలోనే ఎండిపోగా, శ్రమకోర్చి నీరుపెట్టిన పంట ఏపుగా పండి మరికొద్ది రోజుల్లోనే చేతికందే వేళ కురుస్తున్న వర్షాలతో కళ్ల ముందే కంకులు ఎందుకు పనికిరానికిపోకుండా పోతున్నాయి. దీంతో సజ్జపంట సాగుచేసిన రైతుల పరిస్థితి హృదయవిదారకంగా మారింది. పెట్టుబడిలో కనీస మొత్తం కూడా రాని దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆపన్న హస్తం అందించాలని పంట నష్టపోయిన రైతులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

500 ఎకరాలకు పైగా..

మండల పరిధిలో మంచికలపాడు, పల్లామల్లి, బండ్లమూడి, బూదవాడ తదితర ప్రాంతాల్లో దాదాపు 500ఎకరాలకు పైగా ఖరీఫ్ పంటగా సజ్జను రైతులు సాగుచేశారు. కొంతమేర నెలకొన్న బెట్ట పరిస్థితుల్లో కొంత పంట నష్టపోవటం జరిగింది. మిగిలిన పంట బాగా పండి కంకులు వచ్చి ఇంకా రెండురోజుల్లో కోతకు సిద్ధమవుతుండగా ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతుండటంతో కంకులు కాస్తా రంగుమారాయి. మొలకలు సైతం వచ్చాయి. కాస్త తెరిపించటంతో కంకులు కోసి ఆరబెట్టుకోగా మంగళవారం పల్లామల్లి కురిసిన వర్షం మరింత నష్టాన్ని మిగిలించింది. గ్రామంలో మరో పదిఎకరాల్లో కోతకు వచ్చిన పంటను కోయలేక చేలోనే కంకులు మొలకలు రావటం చూసి రైతులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన చెన్నంశెట్టి ఆంజనేయులు తన నాలుగు ఎకరాల్లో పంట వేయగా రెండు ఎకరాలు ఎండలకు ఎండిపోగా, మిగతా రెండు ఎకరాల్లో బాగా పండింది. అయితే ఈ పంట వర్షార్పణం కావటంతో దిగాలు పడ్డారు. ఇదే పరిస్థితి మిగతా గ్రామాల్లో పంట సాగుచేసి వర్షం వల్ల కోతకోయలేని వారికి నెలకొంది.



రంగుమారిన కంకి


కన్నీటి పర్యంతం అవుతున్నాం



నాలుగు ఎకరాల్లో సజ్జ పంట సాగుచేశా. ఎండలకు నీరందివ్వలేక రెండు ఎకరాల్లో ముందే పంట నష్టం అయ్యింది. చేతికి వచ్చిన సమయంలో వర్షం కారణంగా కళ్లముందే నాశనం కావటం తట్టుకోలేకపోతున్నా. ప్రభుత్వం ఆదుకోవాలి.

- చెన్నంశెట్టి ఆంజనేయులు, పల్లామల్లి

నష్టం వివరాల నమోదు ప్రారంభించాం



మండలంలో వర్షం వలకల దాదాపు 50 హెక్టార్లలో సజ్జ పంటకు నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా గుర్తించాం. మంగళవారం నుంచి వివరాలు నమోదు చేస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు అందించే సాయం నష్టపోయిన రైతులకు అందుతుంది.

- భాస్కర్, ఏవో, చీమకుర్తి

రోడ్డు ప్రమాదాలు నివారించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం సాయంత్రం రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సింగరాయకొండ వద్ద జాతీయ రహదారిపై విమానాల ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం నిర్మించిన స్ట్రైట్‌లో అధికంగా ప్రమాదాలు జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ శాశ్వత ప్రాతిపదికన లైటింగ్, ఇతర వసతులు ఏర్పాటు చేసేందుకు విమానయానశాఖ నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉందని సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు స్ట్రైట్‌లో ప్రత్యామ్నాయంగా వాటర్ బ్యారికేడ్స్, రేడియం స్టిక్కర్లు, ఇల్యూమినేషన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీధి వ్యాపారులు రహదారులను ఆక్రమించకుండా చూడాలన్నారు. జాతీయ రహదారుల్లో కలుస్తున్న సర్వీసు రోడ్లలో అవసరమైన స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు, వైద్యులు, ఇతర అధికారులు ఐ- ర్యాడ్ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మద్దిచెట్లపాలెం నుంచి చీమకుర్తి వరకు దెబ్బతిన్న రహదారిని వెంటనే మరమ్మతులు చేసేందుకు క్వారీల యజమానుల సహాయం తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీటీసీ సుశీల, జీజీహెచ్ సూపరిటెండెంట్ దుర్గాదేవి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ దేవానంద్, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

సారస్వత నికేతనం వేటపాలెంకు వరం

మాజీ ఎన్నికల కమిషనర్ రమేష్ కుమార్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సారస్వత నికేతనం గ్రంథాలయం వేటపాలెంకు వరమని మాజీ ఎన్నికల కమిషనర్ రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన వేటపాలెం సారస్వత నినేతనం గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో భద్రపరిచిన మహాత్మాగాంధీ చేతికర్రను స్పృశించారు. పుస్తకాలు, దిన, వార, పక్ష, మాస పత్రికల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. నేటికి చెక్కుచెదరకుండా ఉన్న తాళపత్ర గ్రంథాలను ఆయన పరిశీలించారు. వాటి విశిష్టతను తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని సందర్శించిన ప్రముఖులు అక్కడున్న పుస్తకంలో తమ అనుభూతిని వివరిస్తూ రాసిన విషయాలను తెలుసుకున్నారు. తన అనుభూతిని, అనుభవాన్ని రమేష్‌కుమార్ ఆ పుస్తకంలో పొందుపరిచారు. గ్రంథాలయ కమిటీ సెక్రటరీ పి.వెంకట్, లైబ్రేరియన్ వల్లీ గ్రంథాలయ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం ప్రతినిధులు రమేష్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ, పట్టభద్రుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



రమేష్ కుమార్‌కు బొకే అందజేస్తున్న గ్రంథాలయ ప్రతినిధులు

ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలను వినియోగించుకోవాలి

చినగంజాం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్సూరెన్స్ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఊటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్ సంస్థల ఆధ్వర్యంలో క్లాప్ మిత్రలకు కేంద్రప్రభుత్వ ఇన్సూరెన్సు పథకాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితానికి ఎంతో అవసరమైన ఇన్సూరెన్స్ ప్రథకాలను వినియోగించుకోవాలని, వాటి గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుబ్బారావు, సెర్ప్ సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ సుమంత్, మండల పరిధిలోని క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 24 వతేదీ గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులతో పాటు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

ఈ ప్రభుత్వమైనా ఆదుకోవాలి

- 2021లో కావూరివారిపాలెంలో షార్ట్‌సర్క్యూట్‌తో 12 పూరిళ్లు దగ్ధం
- మూడేళ్లుగా బాధితులకు రోడ్డే దిక్కు
- అప్పట్లో రూ.25 లక్షల ఆస్తి నష్టం
- పట్టించుకోని అప్పటి వైసీపీ పాలకులు



ఆహుతైన పూరిళ్లు (ఫైల్)

చీరాలటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : 2021 జూలై 29న చీరాల మండల పరిధిలోని కావూరివారి పాలెం పంచాయతీ పాలి బోయినవారిపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 12 పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. దీంతో ఒక్కసారిగా ఆ వీధంతా చిన్నాపెద్దా వృద్ధులు తేడా లేకుండా రోడ్డున పడ్డారు. ప్రమాదం కారణంగా విలువైన వస్తువులు, వెండి, బంగారు ఆభరణాలు, కొంతమంది విద్యార్థుల సర్టిఫికెట్లు మసయ్యాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. మంటలను అదుపు చేసేందుకు ఆరోజు అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు చేసిన ప్రయత్నాలు ఇంకా కళ్లల్లో మెదులుతూనే ఉన్నాయి. నాటి నుంచి నేటివరకూ అక్కడి వారు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ, చలిగాలికి సైతం పట్టలు మాటున తలదాచుకుంటూ ఆసరా కోసం ఎదురు చూస్తున్నారు. అప్పట్లో ప్రజా ప్రతినిధులు, అధికార ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పరామర్శించి హామీలు ఇచ్చారు. నేటికీ వారి బతుకుల్లో ఏమాత్రం మార్పు రాలేదు. అప్పటి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. బాధితులు సహాయం కోసం ఎక్కని గడప లేదు, తిరగని కార్యాలయం లేదు. ఫలితం లేకపోవడంతో నిలువ నీడ లేక ఒక్కసారిగా వారి జీవితాలు అయోమయంగా మారాయి. ప్రస్తుతం ఒకరిద్దరు అప్పోసొప్పో చేసి చిన్న పాటి నివాసాలు కట్టుకుంటున్నారు. అప్పటి ప్రభుత్వం నుంచి తక్షణ సాయం లేక శాశ్వత ఆదరణకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా నిలువనీడ కల్పించాలని నిరాశ్రయులు వేడుకుంటున్నారు.



నేటికీ పట్టాల కిందే నివాసం

మూడేళ్లుగా రోడ్డు మీదే



అగ్ని ప్రమాదం కారణంగా మూడేళ్ల నుంచి రోడ్డు మీదే బతుకుతున్నాం. పూరింట్లో ఉంటూ కూలి పని చేసుకుంటున్నాం. ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. చిన్నారులు బతుకు జీవుడా అంటూ బాధితులు రోదిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- శ్రీలక్ష్మి, బాధితురాలు

ఏళ్లు గడుస్తున్నా.. ఆదరణ లేదు



మంటల్లో ఇళ్లు కాలిపోయాయి. ప్రభుత్వాలు మారుతున్నా నేటికీ సాయం లేదు. వృద్ధులతో సహా రోడ్డే దిక్కయింది. ఏళ్లు గడుస్తున్నా బతుకుల్లో మార్పు లేదు. గృహాల మంజూరుకు ప్రభుత్వం చొరవచూపాలి.

- మంచాల అంకమ్మ, బాధితురాలు

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

- తహసీల్దార్ సింగారావు
- రైతుల నుంచి అర్జీల స్వీకరణ



పంగులూరులో మాట్లాడుతున్న తహసీల్దార్



మార్టూరులో సమస్యను చెప్తున్న రైతులు

పంగులూరు, అక్టోబరు, 22 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే జరిగిన గ్రామాలలో తలెత్తిన భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పోపూరి సింగారావు అన్నారు. మండలంలోని రేణంగివరం గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామసభలో తహసీల్దార్ భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఆన్‌లైన్ సబ్‌డివిజన్ కోరుతూ 4, విస్తీర్ణం హెచ్చు, తగ్గుల సవరణ కోరుతూ 4, మ్యూటేషన్‌కు 4, ఫొటోలు, పేరు సవరణ కోరుతూ 3 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీటీ ఆదినారాయణ, మండల సర్వేయర్ బండి సురేష్, నాయకులు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, గ్రామ సర్వేయర్ రాజా, వీఆర్వో సుమతి, పంచాయతీ కార్యదర్శి సునీత, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలో పి.గుడిపాడులో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. రీ సర్వే తప్పులతడక అని, దానిని రద్దు చేయాలని రైతులు కోరారు. ఎకరం ఉన్నవారికి 4, 3 ఎకరాలు ఉన్నవారికి 50 సెంట్లు నమోదు చేశారని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు రవికాంత్, మెహతాజ్, మండల సర్వేయర్ మహేష్‌బాబు, ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్వో, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.

పర్చూరు : భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలను వినియోగించుకోవాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. దేవరపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సభను నిర్వహించారు. పలు సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఎండీ.ఆల్తాఫ్, ఎంఆర్ఐ.ప్రేమ్‌కుమార్, ఎంపీటీసీ కాపు రవిచంద్ర, టీడీపీ నాయకులు కొరిటాల సురేష్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : ఏళ్ల తరబడి భూములను సాగుచేసుకుంటున్నామని, ఈ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని కోలలపూడి గ్రామానికి చెందిన రైతులు తాతా వెంకట్రావు, వాసుబాబు తహసీల్దార్ ప్రశాంతికి రైతులు వినతిపత్రం అందచేశారు. మంగళవారం కోలలపూడిలో జరిగిన గ్రామ సభలో 260 సర్వేలో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని రైతులు విజ్ఞప్తి చేశారు. పలువురు రైతులు భూ సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు నాగలక్ష్మి, సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, మండల సర్వేయర్ ఏడుకొండలు, వీఆర్వో వీరయ్య, గ్రామ సర్వేయర్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

బోరుమంటున్న వస్త్ర వ్యాపారి

- మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం

సిండికేట్ వ్యక్తికి రూ.కోటి పెట్టుబడి

- 100 దరఖాస్తులకు కేవలం నాలుగు దుకాణాలకు అనుమతి
- ఇతరుల నుంచి కూడా సిండికేట్ పేరుతో డబ్బు వసూలు

చీరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మొత్తం 24 మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటికి సంబంధించి లైసెన్స్‌లు పొందేందుకు దరఖాస్తులను భారీగా వేశారు. అందులో అధికారపార్టీ తరపున అంతా తానే చక్రం తిప్పుతానంటూ గతం నుంచి మద్యం వ్యాపారంలో ఉన్న ఓ వ్యక్తి సిండికేట్‌కు శ్రీకారం చుట్టాడు. ఆ క్రమంలో జాండ్రపేటకు చెందిన వస్త్ర వ్యాపారి రూ.కోటి పెట్టుబడిని పెట్టాడు. ఎక్కువ దుకాణాలకు లైసెన్స్‌లు వస్తే భారీగా ఆదాయం ఉంటుందని ఆ మద్యం వ్యాపారి నమ్మబలికాడు. ఈ వస్త్ర వ్యాపారితో పాటు మరికొందరి నుంచి కూడా దరఖాస్తులు పేరుతో సొమ్ము తీసుకున్నాడు. సుమారు 100 దరఖాస్తులు వేయగా వారికి కేవలం నాలుగు దుకాణాలకు మాత్రమే లాటరీలో లైసెన్స్‌లు వచ్చాయి. దీంతో ముందుస్తుగా దరఖాస్తులకు పెట్టుబడి పెట్టినవారు ఒక్కొక్కరుగా వెలుగులోకి వస్తున్నారు. మేం ఇంత ఇచ్చాం అంటే.. మేం ఇంతిచ్చామంటూ ఆ మద్యం వ్యాపారికి పెట్టుబడిగా ఇచ్చినవారు బయటకొస్తున్నారు. దీంతో దరఖాస్తు చేసిన మొత్తం కన్నా అదనంగా ఆ మద్యం వ్యాపారి సమీకిరించినట్లు వెల్లడైంది. దీంతో ఎవరికివారు తాము మోసపోయామని బోరుమంటున్నారు. ఈనేపథ్యంలో రూపాయికి 80 పైసలు వంతున ఇస్తానని, అందుకు కొంత వ్యవధి కావాలని ఆ మద్యం వ్యాపారి చెప్తుండడంతో పెట్టుబడి పెట్టినవారు తమ ఆంతరంగీకుల వద్ద గోడు వెల్లబోసుకుంటున్నారు. గతంలో ఆ మద్యం వ్యాపారి, మరో రియల్ వ్యాపారి మధ్య జరిగిన వ్యాపార లావాదేవీల్లో జరిగిన గడసరి అంశాలను గుర్తుకు చేసుకుంటున్నారు. దీంతో లాభాలు మాట అటుంచి తాము ఇచ్చిన డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. అయితే రూపాయి వస్తుందని భావించి, ఇస్తానన్న 80 పైసలు తీసుకోకుంటే అసలుకే మోసం వస్తుందేమోనని తర్జనభర్జన పడుతున్నట్లు మద్యం వ్యాపారులు, రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఎస్ఆర్ శంకరన్ చిరస్మరణీయుడు



శంకరన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయ్‌నగర్ కాలనీ వాసులు

చీరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పేద, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం అడుగులు వేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ చిరస్మరణీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని విజయ్‌నగర్‌కాలనీలో మంగళవారం శంకరన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విజయ్‌నగర్ కాలనీకి ఆయన అందించిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో డీ భాస్కరరావు, బీ లక్ష్మీనరసయ్య, గొర్రెపాటి రవికుమార్, తేళ్ల సుబ్బారావు, సుందరరావు పాల్గొన్నారు.



కొంగపాడులో పంటను పరిశీలిస్తున్న ఏవో వెకంటకృష్ణ

రాయితీపై శనగ విత్తనాలు

అద్దంకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాయితీపై శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని మణికేశ్వరం, కొంగపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ రబీలో సాగు చేసే శనగ విత్తనాలపై ప్రభుత్వం 25శాతం రాయితీ ఇస్తుందన్నారు. జేజీ 11 రకం ఎర్ర శనగలు రూ.94 కాగా, రాయితీపోను రూ.70.50 పైసలు చెల్లించాలన్నారు. కాక్ 2రకం తెల్లశనగలు కిలో రూ.121కి గాను రూ.90.75పైసలు చెల్లించాలని తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. డీఏపీ, యూరియా, కాంప్లెక్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మినుములో వర్షాలకు ఇనుపధాతు లోపం ఉన్నందున నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ ఎకరాకు 250 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. ఉద్యాన శాఖ అధికారిణి దీప్తి మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాలు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. కూరగాయల సాగు రైతులకు ఎకరాకు రూ.8వేల రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు రాణి, కరిముల్లా, గుడుపూడి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పంగులూరు : సాగులో సేంద్రీయ పద్ధతులు పాటిస్తే రైతుకు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారి డీ సుబ్బారెడ్డి అన్నారు. పంగులూరు, మల్లవరం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీలో సాగు చేసే పొగాకు, శనగ పంటలకు ఎరువుల వినియోగం, పురుగు, తెగుళ్ల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను ఏవో వివరించారు. కార్యక్రమంలో మల్లవరం సర్పంచ్ వీరయ్య, రామారావు, జనకవరం పీఏసీఎస్ సీఈవో, రావూరి లక్ష్మి, ఏఈవో ప్రభాకరరావు, నవనీత, మార్కెటింగ్ సిబ్బంది గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : రెండు మూడు రోజులలో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేస్తామని మార్టూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని డేగరమూడి, రాజుపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వీర గంధం కిరణ్ కుమార్, ఏఈవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ : వరి సాగు చేస్తున్న రైతులు ధాతు లోపం రాకుండా ఎకరాకు 20 కేజీల జింక్‌ను వేసుకోవాలని ఏవో కుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని కొప్పెరపాడు, ఎస్ఎల్‌గుడిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరి పంటను అధికారులు పరిశీలించారు. అధికార్లు పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ప్రతినిధి సురేష్, ఏఈవో వంశి, వీఏఏ పవన్‌సాయి, సురేష్, రమణయ్య, పశుసంవర్ధక శాఖ సహాయకులు జిలానీ, రైతులు పాల్గొన్నారు.

విద్యతో పాటు పోరాట విద్యను నేర్చుకోవాలి

రూరల్ సీఐ శేషగిరిరావు

చీరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతోపాటు పోరాట విద్యలలోనూ ప్రావీణ్యత సంపాదించాలని రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అంతర కళాశాలల తైక్వాండో పోటీలు, జేఎన్‌టీయూ (కె) యూనివర్సిటీ తైక్వాండో టీం ఎంపికకు పోటీలు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. కార్యక్రమానికి రూరల్ సీఐ శేషగిరిరావు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైక్వాండో పోటీలకు సంబంధించి విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో తలపడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్ బాబు, జేఎన్‌టీయూ (కె) ఫిజికల్ డైరెక్టర్, ఇంటర్ కాలేజీ టోర్నమెంట్ సెక్రటరీ డాక్టర్ బీపీ రాజు మాట్లాడుతూ తైక్వాండో క్రీడ విశిష్టతను, పోటీలో నియమాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, జేఎన్‌టీయూ కోచ్ ధనేశ్వరరావు, తైక్వాండో ఇన్‌స్పెక్టర్ ఎస్.తులసి, సయ్యద్ సలావుద్దీన్, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు సూచనలిస్తున్న రూరల్ సీఐ శేషగిరిరావు

‘సోమశిల’లో 60 టీఎంసీల నీరు


అనంతసాగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 60.594 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి మంగళవారం 18,947 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తర కాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

- **‘రాళ్లపాడు’లో 17 అడుగులు..**


లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 17 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి 475 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అక్రమాలకు అడ్డాగా నిలిచిన జగనన్న లేఅవుట్లలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని విజిలెన్స్ విభాగం తేల్చేసింది. పేదల ఇళ్ల మాటున ప్రజాధనాన్ని దిగమింగిన భోక్తల వివరాలనూ వెల్లడించింది. జిల్లావ్యాప్తంగా రూ.వంద కోట్ల వరకు అవినీతి జరిగిందని తేల్చిన అధికారులు వెంటనే బాధ్యులకు నోటీసులు ఇవ్వాలని పంచాయతీరాజ్ శాఖను ఆదేశించింది. అలాగే దిగమింగిన నిధులనూ కక్కించాలని సూచించింది. మరి క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న చర్చ విస్తృతంగా నడుస్తోంది.



గృహ నిర్మాణంలో రూ.100 కోట్లు మెక్కేశారు!

పంచాయతీరాజ్‌కు విజిలెన్స్ నివేదిక

నిర్మాణాలకు అదనంగా బిల్లులిచ్చారు!

సిమెంటు, స్టీలులోనూ అక్రమాలు

ఏఈల నుంచి వివరణ తీసుకోండి

బొక్కిన నిధులూ కక్కించండి!

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలోని జగనన్న లేఅవుట్లలో జరిగిన ఇళ్ల నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు, అవినీతి జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఇళ్ల నిర్మాణాల్లో పెద్దఎత్తున అక్రమాలు, అవినీతి జరిగినట్లు లెక్కలు తేల్చారు. ఇళ్ల నిర్మాణాలు ఎన్ని జరిగాయి. ఏ స్థాయిలో ఉన్నాయి? బిల్లులు ఎంత మంజూరు చేశారు? సిమెంటు, స్టీలు వాడకం జరిగిందా? వాటిలో అక్రమాలు ఏ మేరకు జరిగాయి తదితర అంశాలపై విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయితే, దాదాపు అనేక లే అవుట్లలో అవినీతి అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. నిర్మాణాలకంటే అధికంగా బిల్లులు ఇచ్చి ఉన్నారని సిమెంటు, స్టీలు వినియోగించకుండా బయట విక్రయించారని విచారణలో తేల్చారు. దాదాపు రూ.100 కోట్ల మేర

- మిగతా 6లో



కావలి : ముసునూరు మెగా లేఅవుట్లో అర్థంతరంగా ఆగిన ఇళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)



లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ అధికారుల బృందం

ఆ బ్రాండ్ ఏమిటి.. అమ్మినదెంత!?

- **ఎస్ఎన్‌జే లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ విస్తృత తనిఖీలు**
- **ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన ఫైళ్ల పరిశీలన**

వెంకటాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ‘ఆ బ్రాండ్ పేరేమిటి!?. ఎన్ని కేసులు అమ్మారు? విక్రయ లావాదేవీలు ఎంత!?’ ఇలా అనేక కోణాల్లో ఎస్ఎన్‌జే (ఎస్ఎన్.జయమురగన్) లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ బృందం ఆరా తీసింది. వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న ఎస్ఎన్‌జే లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ అధికారుల బృందం విస్తృత సోదాలు నిర్వహించింది. సీఐడీ డీఎస్పీ కోటారెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కూడిన బృందం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఫ్యాక్టరీలోకి ప్రవేశించింది. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మద్యాన్ని ఎస్ఎన్‌జే లిక్కర్ ఫ్యాక్టరీ నుంచే సరఫరా అయ్యింది. అప్పట్లో మద్యం అమ్మకాలు, నాసిరకమైన మద్యం బ్రాండ్ల సరఫరాపై సీఐడీ బృందం ఈ తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. రికార్డుల గదిలో ఉన్న ప్రతి ఫైలునూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రయినా తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే అప్పట్లో సరఫరా చేసిన బ్రాండ్లకు సంబంధించిన మద్యం శాంపుళ్లను సైతం అధికారులు సేకరించినట్లు సమాచారం. సీఐడీ తనిఖీలు జరుగుతుండటంతో ఫ్యాక్టరీలోకి మీడియాను సైతం అనుమతించలేదు.

స్కూల్ గ్రాంట్స్ నిధుల విడుదల

- **జిల్లాకు రూ.6 కోట్ల కేటాయింపు**

నెల్లూరు (విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : 2024-25 సంవత్సరానికి ప్రాథమిక, మాధ్యమిక, సీనియర్ సెకండరీ పాఠశాలలకు కాంపోజిట్ స్కూల్ గ్రాంట్స్ నిధులను విడుదల చేస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని పీఎం శ్రీ స్కూల్స్, కేజీబీవీలకు, జూనియర్ కళాశాలలకు కలిపి 2,498 విద్యాసంస్థలకు రూ.6 కోట్లు కేటాయిస్తూ తొలి విడతగా 50 శాతం నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులను సంబంధిత పాఠశాలలకు తక్షణమే విడుదల చేసి వివరాలను అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. అలాగే టైప్-2 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో అదనపు తరగతిగదులు, లేబొరేటరీలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ గదులు, ప్రహరీల నిర్మాణం తదితర సివిల్ పనుల కోసం, మేజర్ రిపేర్ల కోసం నిధులు ఖర్చు చేయాలని, అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి నివేదికలను తనకు అందచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



అవన్నీ ఎప్పుడో ముప్పై ఏళ్ల క్రితం కండలేరు ప్రాజెక్టు అవసరాలకు తీసుకున్న భూములు. అప్పట్లో డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు పట్టా భూముల మాదిరిగా పరిహారం ఇచ్చే నిబంధనలు లేవు. నాడు ఎక్స్‌గ్రేషియా మాత్రమే చెల్లించి ఆ భూములను కండలేరు ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించారు.. అయితే అటువంటి భూములన్నిటికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించేందుకు తెలుగుగంగ భూసేకరణ కార్యాలయంలో దస్త్రాలు కదులుతున్నాయి. ఒకసారి రిక్విజిషన్ ఇచ్చాక మళ్లీ ఇంజనీరింగ్ అధికారులు ఎలా కొత్తగా రిక్విజిషన్ ఇస్తారు? మూడు దశాబ్దాల క్రితం ప్రాజెక్టుకు అప్పగించిన భూములకు ఇప్పుడెలా కొత్త చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తారు? ఈ లెక్కన కండేలేరు ముంపులోని భూములకు, రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టుల కింద తీసుకున్న వేల ఎకరాల డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు ఎన్ని రూ.వేల కోట్లు పరిహారం ఇవ్వాలి? అన్న ప్రశ్నలకు అధికారులే సమాధానం చెప్పాలి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఇదేం వింత సామీ!

ఎప్పుడో తీసుకున్న భూములకు ఇప్పుడు పరిహారమట!

కండలేరు ముంపు పేరిట మళ్లీ కదులుతున్న దస్త్రాలు

డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు పరిహారం కోసం నోటిఫికేషన్


కొత్త చట్టం ప్రకారం ఇచ్చేందుకు ఎత్తుగడలు

రంగంలోకి దిగిన దళారులు.. బాధితుల పేరిట దోచుకునే కుట్ర

కండలేరు ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి మూడు దశాబ్దాలు గడిచినా ఇంకా పరిహారం చెల్లింపు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఈ వ్యవహారం వెనుక ఇప్పటికే అనేక అక్రమాలు జరిగాయని ఉన్నతాధికారుల విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ) భూసేకరణ విభాగాన్ని మూసివేయాలని గత కలెక్టర్ చక్రధర్‌బాబు ఏకంగా ప్రభుత్వానికి సిఫారసు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తాజాగా మరో భూ పంపిణీ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాపూరు మండలం గుండవోలు గ్రామానికి సంబంధించి డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు పరిహారం ఇచ్చేందుకు ఇటీవల ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో పేర్కొన్న సర్వే నెంబర్లలోని భూముల వివరాలను చూశాక అనేక ఫిర్యాదులు జిల్లా ఉన్నతాధికారులకు అందుతున్నాయి. ముంపు పరిహారం మాటున మళ్లీ ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు దళారులు రంగంలోకి దిగారని, ఆ క్రమంలోనే నోటిఫికేషన్ విడుదల చేశారంటూ కొందరు ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం.

- **నాడు అప్పగించి నేడు పరిహారమట**

గుండవోలులో సుమారు వంద ఎకరాల డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎకరాకు రూ.6.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు టీజీపీ భూసేకరణ అధికారులు రెండు వారాల క్రితం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో పేర్కొన్న అనేక సర్వే నెంబర్లలోని భూమిని గతంలోనే కండలేరు ప్రాజెక్టుకు అప్పగించినట్లు రికార్డులు చెబుతున్నాయి. కొన్ని సర్వే నెంబర్లలోని భూమికి సంబంధించి గతంలోనే ఇంజనీరింగ్ అధికారులు రిక్విజిషన్‌లు పంపినట్లు స్పష్టమవుతోంది. అయినా ఇప్పుడు మళ్లీ పరిహారం చెల్లించేందుకు సిద్ధమవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. 2013 కు ముందు వరకూ డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు పట్టా భూముల మాదిరి పరిహారం చెల్లించేవారు కాదు. అవి ప్రభుత్వ భూములు కాబట్టి ఎక్స్‌గ్రేషియా మాత్రమే ఇచ్చేవారు. కండలేరు ప్రాజెక్టు కోసం వేల ఎకరాల డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములను సేకరించారు. వీరందరికీ అప్పట్లోనే ఎక్స్‌గ్రేషియా చెల్లించినట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.



గత నెలలో ఈఈ ఇచ్చిన రిమార్కులతో కూడిన రిక్విజిషన్

- **కొత్త రిక్విజిషన్ ఎలా సాధ్యం?**

ఏదైనా ప్రాజెక్టు నిర్మించే సమయంలోనే అందుకు అవసరమైన భూమికి సంబంధించి ఇరిగేషన్

- మిగతా 6లో

ఆయకట్టు ఓటరు జాబితా

31లోగా సిద్ధం చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఆయకట్టు ఓటర్ల జాబితా 31లోగా సిద్ధం చేయాలనికలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యూటేషన్లు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, ఉపాధి హామీ పనిదినాల పెంపు, హౌసింగ్ తదితర అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని, 70వేల పనిదినాల లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవాలని సూచించారు. పంచాయతీల్లో ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని, అదేవిధంగా ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశించారు. పంచాయతీలు, మున్సిపాలిటీ లు, కార్పొరేషన్లలో పెండింగ్‌లో ఉన్న లైబ్రరీ సెస్సును జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, డీఆర్వో లవన్న, డీఎం హెచ్ఓ పెంచలయ్య, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ దయాకర్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను

ప్రజల్లోకి తీసుకెళ్లండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) (ఆంధ్రజ్యోతి) : పేదల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి బీమా యోజన, జీవనజ్యోతి వంటి బీమా పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో బ్యాంకర్ల జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీమా పథకాలపై వచ్చే ఏడాది జనవరి 15 వరకు గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు ఉంటాయన్నారు.

- **భూసేరణ పూర్తి చేయండి**

జిల్లాలో ఎన్‌హెచ్ఏఐ, రైల్వే, ఆర్ఓబీలు, ఆర్ అండ్‌బీ రోడ్లు, ఏపీఐఐసీ, మెగా ఇండస్ట్రియల్ హబ్ తదితర ప్రాజెక్టులకు భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. భూ సేకరణపై ఆయా శాఖల అధికారులతో మంగళవారం జేసీ సమీక్షించారు. కొన్నిచోట్ల మ్యూటేషన్స్ పెండింగ్‌లో ఉన్నాయని, దానిని పూర్తి చేసి సంబంధిత ప్రాజెక్టుల వారికి పూర్తిస్థాయిలో అందచేస్తామన్నారు.



ఆటోలో విత్తనాలను తీసుకెళుతున్న ఆటో

నకిలీలతో వర్రీ!

- **అల్లూరులో పుట్టగొడుగుల్లా వరి విత్తన విక్రయ కేంద్రాలు**
- **ప్రాసెసింగ్ లేకుండానే రైతులకు అంటగడుతున్న వైనం**
- **రూ.20 కోట్ల పైచిలుకు వ్యాపార లావాదేవీలు**
- **ముడుపుల మత్తులో అధికారులు..**
- **తెరవెనుక రాజకీయ నేతల అండ?**

అల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజోతి) : నకిలీ వరి విత్తనాలకు నిలయంగా అల్లూరు మారిపోతోంది. దాదాపు 40 మందికిపైగా భారీస్థాయిలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు. వరి విత్తన వ్యాపారుల్లో మండలంలో నలుగురికి మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. అయితే, ఎటువంటి అనుమతులు లేకుండానే వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విత్తనాల పేరుతో రైతులకు అంటగడుతు న్నారు. అల్లూరు మండలంలో దాదాపుగా 40 వేల ఎకరాల్లో వరి సాగవుతుండగా, 10 లక్షల కిలోల విత్తనాలు అవసరవుతాయి. బయటి ప్రాంతాల నుంచి కూడా ఎంతో మంది రైతులు అల్లూరుకు వచ్చి విత్తనాలు తీసుకెళుతుంటారు. ఇలా దాదాపు 30 లక్షల కిలోలు విత్తనాలను విక్రయిస్తుండగా, సుమారు రూ.15 కోట్ల పైబడి లావాదేవీలు జరుగుతున్నాయి.

- **పర్యవేక్షణ అంతంతే!**

వరి విత్తన విక్రయ కేంద్రం, విత్తన తయారీ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి. అందులోనూ కేటగిరీని బట్టి విత్తనాలు పరిమితంగానే విక్రయించాల్సి ఉంది. అనుమతి రుసుము, సెస్, ఆదాయపు పన్ను తదితర వాటితో ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. అయితే, నిబంధనలు తుంగలో తొక్కి, ఇష్టానుసారంగా వ్యాపారాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పర్యవేక్షణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. ఇక రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు వ్యాపారులు ఎటువంటి బిల్లులు ఇవ్వడం లేదు. కనీసం తాము చెల్లించిన మొత్తానికి రశీదు పొందాల్సిన రైతులు ఆ దృష్టితో ఆలోచించే పరిస్థితి లేదు.

- **నామమాత్రపు దాడులు**

ఇటీవల అల్లూరు మండలంలో మూడు విత్తన తయారీ కేంద్రాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి సీజ్ చేశారు. అల్లూరు, ఇస్కపల్లి, నార్త్‌మోపూరులలో ఎంతో మంది వ్యాపారులు భారీస్థాయిలో విత్తనాలు విక్రయిస్తూ రూ.కోట్లు గడిస్తున్నా వ్యవసాయశాఖాధికారులు వద్ద ఉన్నా కేవలం మూడు కేద్రారలపైనే దాడులు చేయడం విమర్శలకు తావిస్తోంది.

- **రాజకీయ, అధికార అండదండలు**

నకిలీ విత్తన విక్రయాలపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు తమకు ముడుపులు అందితే చాలు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయ అధికారులు, రాజకీయ ప్రతినిధులే వ్యాపారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అధికారులకు

- వివరాలు 6లో..





శిథిలభవనంలో బిక్కు బిక్కుమంటూ..

ఇది లింగసముద్రంలోని బీసీ బాలుర వసతి గృహం. వారం రోజుల కిందట కురిసిన వర్షాలకు వసతిగృహ భవనం గదుల గోడలు, స్లాబు పైకప్పు పెచ్చులూడి పడుతోంది. ఈ సమస్యతో విద్యార్థులు భయంతో బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. మంగళవారం కూడా కొన్ని పెచ్చులూడి కింద పడటంతో కొందరు విద్యార్థులు భయంతో ఇళ్లకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ కె.శ్రీనివాసులు వసతిగృహానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు. సచివాలయం-1కి చెందిన ఖాళీగా ఉన్న రైతు సేవా కేంద్రం భవనంలో మార్పు చేశారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)






నింగినేల కలిసినట్టు!

పుడమిపై పచ్చని చెట్లు.. మబ్బులు కమ్మిన ఆకాశం ఈ రెండూ కలిసిపోయిన సుందర దృశ్యాలు నెల్లూరు రూరల్ మండలం వేదగిరి నృసింహ కొండపై అబ్బుర పరిచాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఆయన కుంచె కదిపితే ప్రకృతి పులకరిస్తుంది. సెలయేళ్లు పరవళ్లు తొక్కుతాయి.. మేఘాలు వర్షిస్తాయి.. నెమలి పురివిప్పి నాట్యం చేస్తుంది.. పడుచుపిల్లలు ఊహల పల్లకీలో విహరిస్తారు. దేవతామూర్తులు ప్రత్యక్షమై ఆశీర్వదిస్తారు. ఇలా ఆ కుంచె ఎన్నో అద్భుత చిత్రాలను సృష్టించింది. మనసులోని భావాలను అందంగా మనసుకు నచ్చేలా హృదయానికి హత్తుకునేలా వివరించే శక్తి ఒక్క కళకే ఉంటుంది. ముఖ్యంగా ఆకులపై (రావి, కుంకుడు, ఇరికి, కానుగ) భిన్న రంగులతో కళాకారులు చేసే మ్యాజిక్ చూపరులను మంత్రముగ్ధ లను చేస్తుంది. ఇలా దాదాపు 300లకు పైగా అద్భుతమైన చిత్రాలు గీశారు పొద లకూరు మండలానికి చెందిన పచ్చా పెంచలయ్య.

ఆకులపై 'అద్భుతాలు

- లీఫ్స్‌పై 300లకుపైగా చిత్రాలు
- ఎన్నో అవార్డులు, మరెన్నో ప్రశంసలు
- విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ పచ్చా పెంచలయ్య

పొదలకూరు మండలంలోని మహమ్మదాపురం హరిజనవాడలో 1951లో పెంచలదాసు, నరసమ్మ దంపతుల ఏకైక కుమారుడు పచ్చా పెంచలయ్య. అదే గ్రామంలో డీఎస్ఆర్ హైస్కూల్లో అప్పట్లో హయ్యర్ సెకండరీ చదివారు. తర్వాత ఆనాటి స్కూల్ డ్రాయింగ్ మాస్టర్ కొమ్మూరి జీవరత్నం మాస్టర్ ప్రోత్సాహంతో మద్రాసులోని కమిషనర్ ఆఫ్ గవర్నమెంటు టెక్నికల్ ఎగ్జామినేషన్‌లో డ్రాయింగ్ విభాగంలో లోయర్, హయ్యర్ పూర్తి చేసి ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. ఆ తర్వాత టీటీసీ పూర్తి చేసి 1971లో డ్రాయింగ్ మాస్టర్‌గా ఏఎస్‌పేటలో చేరారు. రూ.126 జీతంతో తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి 38 ఏళ్లపాటు డ్రాయింగ్ మాస్టర్‌గా వివిధ పాఠశాలల్లో పనిచేసి, తాను విద్య నేర్చుకున్న మహమ్మదాపురం పాఠశాలలోనే అత్యధిక కాలం పనిచేసి అక్కడే రిటైర్డ్ అయ్యారు. ఏ చిత్రాన్నైనా ఉన్నది ఉన్నట్లుగా చూసిన వెంటనే గీయగలిగిన సమర్థుడు పెంచలయ్య. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆర్ట్ క్రాఫ్ట్‌కు సంబంధించి ప్రత్యేక విభాగంలో కావలి, విడవలూరు, గూడూరు, అలాగే ఆలిండియా ఆర్ట్ కాంపిటిషన్ తెనాలి, భీమవరం, కాకినాడలో పలు అవార్డులను ప్రశంసలను అందుకున్నారు. అలాగే మైక్రో ఆర్ట్‌లో 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు బియ్యపు గింజపై పార్టీ గుర్తును పంపగా ఆయన అభినందనలతో ఒక ప్రత్యేక లేఖను పెంచలయ్యకు పంపారు. అలాగే పెంచలయ్య కేవలం చిత్రకారుడే కాకుండా తెలుగుపై పట్టు ఉన్న కవిగా చెప్పుకోవచ్చు. 2012లో పెంచలయ్య శ్రీనృసింహ శతకం అనే పేరుతో శతకం రాశారు. ఈ శతకాన్ని హైదరాబాదు శ్రీ పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం వారు కవులను ప్రోత్సహించుటలో భాగంగా అచ్చువేసి, పచ్చా పెంచలయ్యకు 20 కాపీలను అందించారు. విజయవాడ ఆల్ ఇండియా రేడియో నిర్వాహకులు ప్రతి వారం సమస్యా -పూరణాలు అనే పద్యపాదాలకు సమాధానాలు ఇస్తూ ఉంటారు. సింహపురి రేడియోలో సూక్తి - సుధా కార్యక్రమానికి ఆయన సూక్తులు, వ్యాఖ్యానం అందిస్తుంటారు.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)







రావి ఆకుపై శ్రీకృష్ణుడు



రావి ఆకుపై భరతమాత



రావి ఆకుపై ప్రధానమంత్రి మోడీ



సమీక్షలో మాట్లాడుతున్న పెంచలయ్య

హైరిస్క్ గర్భిణులకు తక్షణ చికిత్సలు అందించండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి వెంటనే వైద్య చికిత్సలు సంపూర్ణంగా అందేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో మాతా,శిశు మరణాల సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జరిగిన మాతా, శిశు మరణాలపై సమీక్ష జరిపారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భిణులకు తగిన పరీక్షలు నిర్వహించి సుఖ ప్రసవం అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. రక్తహీనత వల్ల తల్లీబిడ్డ మరణాలు సంభవిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జీజీహెచ్ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

దానా తుఫాన్ కారణంగా పలు రైళ్లు రద్దు

విజయవాడ(రైల్వేస్టేషన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ కోస్టు రైల్వే డివిజన్ పరిధిలో దానా తుఫాను కారణంగా 23, 24 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీన కామాఖ్య - ఎస్ఎంబిటి బెంగళూరు, సిల్‌చార్ - సికింద్రాబాద్, డిబ్రూగర్ - కన్యాకుమారి, సికింద్రబాద్ - భువనేశ్వర్, చెన్నై సెంట్రల్ - హౌరా, పుదుచ్చేరి - హౌరా, చెన్నై - షాలిమార్, పుదుచ్చేరి - భువనేశ్వర్, కెఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్, సిఎస్‌టి ముంబయి - భువనేశ్వర్, ఎస్ఎంబిటి బెంగళూరు - గౌహతి, హైదరాబాద్ - హౌరా, కన్యాకుమారి - డిబ్రూగర్, సికింద్రాబాద్ - హౌరా, ఎస్ఎంబిటి బెంగళూరు - హౌరా, సికింద్రాబాద్ - మాల్డా టౌన్, యశ్వంతపూర్ - హౌరా, తిరున్వేలి - షాలిమార్ రైళ్లను రద్దు చేశారు. ఈనెల 24వ తేదీన పూరీ - తిరుపతి, హౌరా - సికింద్రాబాద్, ఖర్గపూర్ - విల్లుపురం, హౌరా - భువనేశ్వర్, షాలిమార్ - చెన్నై సెంటర్, సత్రాగచ్చి - మంగళూరు సెంటర్, హౌరా - తిరుచురాపల్లి, హౌరా - ఎస్ఎంబిటి బెంగళూరు, షాలిమార్ - వాస్కోడగామ, హౌరా - చెన్నై సెంట్రల్, పాట్నా - ఎర్నాకులం, సత్రాగచ్చి - చెన్నై సెంట్రల్ రైళ్లను రద్దు చేశారు.



వేణుగోపాలుడి పవిత్రోత్సవం

నెల్లూరులోని మూలాపేటలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణు గోపాల స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి గోపురోత్సవం నయనానందకరంగా జరిగింది. ఉదయం విశేష పూజలు, నిత్యహోమం, పూర్ణాహుతి జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సహాయ కమిషనర్, ఈవో జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

నకిలీలతో వర్రీ!

(5వ పేజీ తరువాయి)

ముడుపులు చెల్లించడం ఆలస్యమైనందువల్లే విజిలెన్స్ దాడులు జరిగాయని ఒకరు, తన వెనుక ఓ ప్రజాప్రతినిధి ఉన్నారని మరికొందరు బహిరంగంగానే చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నకిలీ విత్తన వ్యాపారులపై నిక్కచ్చిగా వ్యవహరించాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు ఎందుకు తీసుకోరు!



ఎటువంటి అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలను విక్రయిస్తూ వ్యాపారులు రూ.కోట్లు గడిస్తున్నారు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. అధికారులకు సమాచారం అందించినా ప్రజాప్రతినిధుల వల్ల తామేమీ చేయలేమని చెబుతున్నారు. ఇదెక్కడి విడ్డూరం.

- నిరంజన్‌రెడ్డి, రైతు, నార్తుమోపూరు, అల్లూరు మండలం

రూ.20 కోట్లపైనే విత్తన వ్యాపారాలు



ఇతర ప్రాంతాలు, జిల్లాల నుంచి ఎంతోమంది రైతులు అల్లూరులోని పలువురు వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. రూ.20 కోట్ల పైబడి లావాదేవీలు జరుపుతున్న వ్యాపారుల్లో ఒకరికో, ఇద్దరికో మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. నకిలీ విత్తనాలతో రైతుల నష్టపోతే మంచి పేరున్న అల్లూరు అక్రమాల నిలయంగా మారే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- దశరథరామిరెడ్డి, నార్తుమోపూరు, అల్లూరు మండలం

వైసీపీ నేతల ఒత్తిళ్లతోనే తప్పులు

- సోమిరెడ్డి ఎదుట హౌసింగ్ ఇంజనీర్ల ఆవేదన
- అక్రమార్కుల వివరాలివ్వండి : సోమిరెడ్డి



హౌసింగ్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : 'వైసీపీ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల తీవ్ర ఒత్తిళ్లతోనే నాడు పేదల ఇళ్ల నిర్మాణాల్లో తప్పులు జరిగాయి. అక్రమాలు జరుగుతున్నాయని తెలిసినా ఏమీ చేయలేక పోయాం. ఆ రోజే తిరుగుబాటు చేసి ఉంటే మాకు ఈ దుస్థితి దాపురించేది కాదు. విజిలెన్స్ విచారణ నుంచి మమ్మల్ని కాపాడండి' అంటూ హౌసింగ్ ఇంజనీర్లు, ఉద్యోగులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఎదుట వాపోయారు. జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాల మాటున వైసీపీ ప్రభుత్వంలో భారీ అక్రమాలు జరిగాయి. రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారు. నాసిరకంగా నిర్మించిన ఇళ్లపై సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించగా, ప్రస్తుతం ఆ విచారణ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే అనేక లేఅవుట్లలో నాసిరకంగా నిర్మాణాలు చేసినట్లు గుర్తించారు. దీంతో హౌసింగ్ అధికారులు, ఉద్యోగుల్లో భయం పట్టుకుంది. ఈ క్రమంలో మంగళవారం పెద్ద సంఖ్యలో నెల్లూరులోని సోమిరెడ్డి కార్యాలయానికి తరలివచ్చారు. ఆయన ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ విజిలెన్స్ విచారణలో ఇప్పటికే రూ.120 కోట్లకుపైగా అవినీతి వెలుగులోకి వచ్చిందని, నెల్లూరు, కావలి మెగా లేఅవుట్లలోనే రూ.45 కోట్ల అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయిందని వ్యాఖ్యానించారు. ఎవరి ప్రోద్బలంతో అక్రమాలను చూసీచూడనట్లుగా ఊరుకున్నారో, వారి వివరాలు వెల్లడించాలని హౌసింగ్ ఉద్యోగులకు సోమిరెడ్డి సూచించారు.

రూ.100 కోట్లు మెక్కేశారు!

(5వ పేజీ తరువాయి)

అవినీతి అక్రమాలు జరిగినట్లు నివేదికను సిద్ధం చేశారు. దీంతో ఆయా లేఅవుట్ల పరిధిలో విధులు నిర్వహించి, గృహ నిర్మాణాలు పర్యవేక్షించిన అసిస్టెంట్ ఇంజనీర్లకు నోటీసులు జారీ చేసి రాత పూర్వక వివరణ తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈకి విజిలెన్స్‌శాఖ సూచించింది. లే అవుట్ల వారీగా అక్రమాలు ఎంత జరిగాయో ఆ మేరకు రికవరీ చేయాలన్న వివరాలను ఎస్ఈకి అందజేశారు. దీనికి అనుగుణంగా ఇంజనీరు అసిస్టెంట్ల నుంచి వివరణ తీసుకుని బాధ్యులైన ఉద్యోగులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ శాఖ సూచించింది.

బిర్యానీ ఎలా ఉంది!?

- నగరంలో ఫుడ్‌కంట్రోల్ అధికారుల తనిఖీలు

నెల్లూరు(సిటీ),అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) : కమ్మని బిర్యానీ తయారీ వెనుకున్న ఆందోళనకర వాస్తవాలను పరిశోధనాత్మకంగా ఆంధ్రజ్యోతి ఆదివారం వెలుగులోకి తెచ్చింది. దీనిపై సమగ్ర వాస్తవాలు సమీకరించిన ఆహార భద్రత, కార్పొరేషన్ అధికారులు బిర్యానీ తయారీ వంటశాలలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం సహాయ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఎన్ఎంసీకి చెందిన ఆరోగ్య అధికారి చైతన్య నేతృత్వంలోని బృందం నగరంలో రియాజ్ హోటల్‌పై ఆకస్మిక తనిఖీలు చేశారు. కనీస ప్రమాణాలు పాటించలేదని, కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు గురించామని తెలిపారు. అలాగే చికెన్, మటన్ బిర్యానీలకు సంబంధించిన నమూనాలనూ ల్యాబ్‌కు పంపారు. కాగా, కార్పొరేషన్, ఎఫ్ఎస్‌వో అధికారుల దాడుల విషయం తెలుసుకున్న నగరంలోని ప్రముఖ హోటళ్ల యజమానులంతా అప్రమత్తమయ్యారు. ఇప్పటికే నగరంలోని గణేష్ మెస్‌కు నోటీసులు జారీ చేశామని ఎఫ్ఎస్‌వో అధికారులు తెలిపారు.

ఇదేం వింత సామీ!

(5వ పేజీ తరువాయి)

అధికారులు రిక్విజిషన్లు పంపుతారు. వాటి ఆధారంగా రెవెన్యూ వర్గాలు బాధితులకు పరిహారం చెల్లిస్తుంటాయి ఒకసారి రిక్విజిషన్ పంపాక మరోసారి పంపడానికి కుదరదు. గుండవోలు గ్రామానికి సంబంధించి రెండేళ్ల క్రితం కొత్తగా రిక్విజిషన్ పంపాలని ఇరిగేషన్ అధికారులకు లేఖలు అందినా ముప్పై ఏళ్ల క్రితం నాటి ప్రాజెక్టుకు నేడు రిక్విజిషన్ పంపడం వీలు కాదని, అప్పట్లోనే రిక్విజిషన్లు పంపారని నాటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సమాధానం ఇచ్చారు. అయితే తాజాగా గత నెలలో ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాత్రం కొత్త రిక్విజిషన్ పంపడం గమనార్హం. అయితే భూసేకరణ విభాగం అధికారులు పంపిన ప్రతీ సర్వే నంబర్ పక్కన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రిమార్కులు రాశారు. ఈ భూమిని గతంలోనే తమకు అప్పగించారని, మరికొంత భూమికి గతంలోనే రిక్విజిషన్లు పంపామని, తాజాగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అడుగుతుండటంతోనే కొత్తగా రిక్విజిషన్ పంపుతున్నామని అందులో స్పష్టం చేశారు. 1992లోనే పలు సర్వే నంబర్లలోని భూములను ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించినట్లు రికార్డులు కనిపిస్తున్నా.. ఆ భూములకు మళ్లీ కొత్తగా పరిహారం ఇచ్చేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం రికార్డులు పరిశీలిస్తే ఇటువంటి ఇంకెన్ని ఉంటాయోనన్న అనుమానం కలుగుతోంది. అయితే ఈ రికార్డులు చాలా వరకూ మాయమైనట్లు తెలుస్తోంది. టీజీపీలో అల్ప సంపాదనకు అలవాటు పడిన కొందరు దళారులు ఇప్పుడు కూడా ముంపు బాధితులకు డబ్బులు ఆశ చూపి 50 శాతం డీల్ కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో కొందరు టీజీపీ ఉద్యోగులు కూడా భాగస్వాములైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అభ్యంతరాలుంటే చెప్పవచ్చు

గుండవోలు గ్రామంలోని డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములకు గతంలో పరిహారం చెల్లించలేదు కాబట్టే ఇప్పుడు చెల్లించేందుకు నోటిపికేషన్ ఇచ్చాం. గతంలో పరిహారం చెల్లించిన భూములు ఇందులో ఉన్నట్లు అభ్యంతరాలు ఉంటే మాకు తెలియజేయవచ్చు. వాటిని నోటిఫికేషన్ నుంచి తొలగిస్తాం. గుండవోలుకు సంబంధించి పరిహారం చెల్లింపు ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారమే జరుగుతోంది.

- ప్రేమ్‌కుమార్, టీజీపీ రాపూరు ఎస్‌డీసీ

కేజీబీవీ పోస్టులకు ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

- 31 పోస్టులకు 355 మంది హాజరు

నెల్లూరు(విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఉద్యోగాలకు అభ్యర్థులు పోటెత్తారు. జిల్లాలోని 12 కేజీబీవీల్లో ఉన్న పీజీటీలు 16, సీఆర్‌టీలు 7, పార్ట్‌టైమ్ టీచర్స్ 7, అకౌంటెంట్ 1 కలిపి మొత్తం 31 పోస్టులను ఒప్పంద, పొరుగుసేవల ప్రాతిపదిన ఏడాది పాటు భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్య ర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. 498 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారంతో ముగిసింది. 30 టీచింగ్ పోస్టులకు 422 మంది దరఖాస్తు చేసుకోగా 298 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. మొత్తంగా 355 మంది సర్టిఫికెట్ల పరి శీలనకు హాజరైనట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఎనిమిది మంది సీనియర్ గెజిటెడ్ హోదా కలిగిన ప్రధానోపాధ్యాయులను నియమించామని పేర్కొన్నారు. మెరిట్ ఆధా రంగా జాబితా సిద్ధం చేస్తున్నామని, జాబితాపై అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయంలో నియామకాలు చేపడతారని తెలిపారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలు

ఆత్మకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రక్తదాతలు స్ఫూర్తిప్రదాతలుగా నిలిచి పలువురికి ప్రాణదానం చేస్తున్నారని డీఎస్పీ కే వేణుగోపాల్, సీఐ జీ గంగాధర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన 115 మందిని పోలీసు అధికారులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు షేక్ జిలాని, సాయిప్రసాద్, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



దరఖాస్తు గడువు పొడిగింపు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ కోసం నిర్వహించే స్క్రీనింగ్ టెస్టు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువు పొడిగించినట్లు ఉదయగిరి సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి ఆదిలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.









శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

● ఇబ్బందులు పడుతున్న అధికారులు

కలిగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీల్దారు, మండల విద్యావనరుల కేంద్రం, మండల పరిషత్ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గదులన్నీ ఉరుస్తున్నాయి. ఈ సమస్యతో అధికారులు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు తలుపులు, కిటికీలు దెబ్బతినిపోయి వర్షపునీరు లోపలికి వస్తుండటంతో రికార్డులు తడిసిపోతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం లోపల ఇలా ఉంటే వెలుపల వర్షపునీరు నిలిచి లోపలికి వచ్చేందుకు కూడా వీలులేకుండా ఉందని చెబుతున్నారు. జిల్లా అధికారులు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.



శ్లాబు పెచ్చులూడిన ఎంపీడీవో కార్యాలయం, దెబ్బతిన్న తలుపులు

క్వార్ట్జ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం సమీపంలో వేద మైన్స్ మినరల్స్ వారికి క్వార్ట్జ తవ్వకాలకు ప్రభుత్వం లీజు అనుమతులు ఇచ్చింది. దీంతో మంగళవారం కావలి ఆర్డీవో వంశీకృష్ణ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తూ యాజమాన్యం ఏడాదికి 1,02,950 టన్నుల క్వార్ట్జ తవ్వకాలు చేపడుతుందన్నారు. ఈ విషయమై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించాలన్నారు. స్పందించిన గ్రామస్థులు తాము వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తామన్నారు. తమ గ్రామంలో అత్యధికులు మూగజీవాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆ జీవాల మేతకు ఈ కొండే ఆధారమని, ఈ తరుణంలో ఆ కొండను క్వార్ట్జ తవ్వకాలు ఇస్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని తేల్చిచెప్పారు. స్పందించిన అధికారులు మీ అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎస్పీ శ్రీధర్, తహసీల్దారు నాగరాజు, ఎస్ఐ ఆదిలక్ష్మి, పలు శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్న అధికారులు

ఎస్సీ వర్గీకరణతో విభేదాలు సృష్టించడం తగదు : సాల్మన్‌రాజు

అల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలను వర్గీకరించి దళితుల్లో విభేదాలు సృష్టించడం అన్యాయమని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం ఆయన గ్రద్దగుంటలో సంఘం సభ్యులతో నిరసన చేపట్టారు. రాజకీయ లబ్ధి కోసం అన్నతమ్ములుగా కలసిమెలసి ఉన్న మాల,మాదిగలను విభజించాలనే ఉద్దేశ్యంతో వర్గీకరణ ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభేదాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. దీనిపై త్వరలో మాల మహాగర్జనను నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ముసలి నరేంద్ర, పంగులూరు సుధాకర్, గంగపట్నం సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

ఉదయగిరి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల నరసింహులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, డక్కన్‌వీల్స్ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో చదివిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఇంటర్వ్యూలకు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

ఘనంగా అష్ఫాఖుల్లా ఖాన్ జయంతి

అనంతసాగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం స్వాతంత్ర సమరయోధుడు అష్ఫాఖుల్లా ఖాన్ 124వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆవాజ్ కమిటీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, ఇఫ్తియార్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అనంతసాగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపల్లిలో మంగళవారం ఉపాధి పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన కూలీల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పనులు నిర్దేశిత కొలతల ప్రకారం చేస్తే కూలి ధర గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో దయాసాగర్ పాల్గొన్నారు. కాగా గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. ఈ మేరకు వారితో ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వరికుంటపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం నల్లబోతులవారిపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సకాలంలో ఈకేవైసీ చేయించుకోకపోవడంతోపాటు సాంకేతిక సమస్యల కారణంగా పీఎం కిసాన్ నగదు జమ కాని రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

వెలుగు వీవోఏలతో సమీక్ష

వింజమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో మంగళవారం వీవోఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీఎం కృష్ణారావు అధ్యక్షత వహించారు. స్త్రీనిధి ఉన్నతి, సీఐఎఫ్ నిధుల రికవరీ, లోకోస్ వీపీఆర్‌పీవోఎన్‌డీ సీహెచ్‌ఓఈ ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు సుశీల, లక్ష్మీకుమారి, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, అకౌంటెంట్ సువార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

వింజమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఊటుకూరు సచివాలయం, వింజమూరు-2 సచివాలయాల పరిధిలో మంగళవారం ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో ఆధార్ చేర్పులు, మార్పులు, ఫోన్ నెంబరు అనుసంధానం చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 25 వరకు శిబిరాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సూపర్‌వైజర్‌లు అబ్దుల్‌బాషా, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయంలో ప్రత్యేక హోమం

సంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో మంగళవారం లలితా సహస్రనామ పారాయణం ముగింపును పురస్కరించుకుని ప్రత్యేక హోమం నిర్వహించారు.. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం

జలదంకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పాలకవర్గం సమావేశం మంగళవారం గ్రామ సచివాలయం-1 భవనంలో సర్పంచ్ చలంచర్ల అనూరాధ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రూ.10లక్షలకు పైగా జరుగనున్న పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. గ్రామసచివాలయం ఆవరణలో సందర్శకుల అవసర నిమిత్తం మరుగుదొడ్ల ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో తాగునీటి అవసరాల నిమిత్తం కొత్తగా బోర్ల నిర్మాణం, మరమ్మతులకు గురైన తాగునీటి పథకాల పునర్నిర్మాణం, పలు చోట్ల రచ్చబండల నిర్మాణం లాంటి పనులను ఆర్థికసంఘం, పంచాయతీ సాధారణ నిధుల నుండి వెచ్చించి అభివృద్ధి పనులు చేసేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి, వార్డుసభ్యులు, మాజీసర్పంచ్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకటక్రిష్ణ, గ్రామ సచివాయాల సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లిలో కావలి నృత్యకారిణుల ప్రతిభ

కావలి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోనసీమలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన నృత్యకళా ప్రదర్శనలో కావలి నృత్యకారిణిలు అద్భుత ప్రదర్శన చేసి ప్రశంసలు అందుకున్నారు. రెండురోజులుగా జరిగిన ధర్మపథం సాంస్కృతిక కార్యక్రమంలో జరిగిన నృత్య ప్రదర్శనలో జయం కూచిపూడి నాట్యాలయం విద్యార్థినులు భావన, నిఖిత, మహిత, మాన్వి సంహిత, మేఘశ్రీ, ఆరాధ్య, శ్రీదేవిష్ణు, లోహిత్‌లు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు అందుకున్నారు. నాట్యాలయం గురువు జాహ్నవి, నిర్వాహకురాలు జమునలు వీరికి ప్రత్యేక అభినందలు తెలిపారు.

నేటి శిక్షణకు హాజరుకండి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వింజమూరు మండలం బొమ్మరాజు చెరువు సమీపంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ సభ్యత్వాల నమోదుపై శిక్షణ నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ సీహెచ్ బయ్యన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణకు మండల టీడీపీ నాయకులు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలన్నారు.

● పార్టీసభ్యత్వ నమోదుపై శిక్షణ

కొండాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో బొమ్మరాజుచెరువు వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీసభ్యత్వ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకార్ తెలిపారు. కార్యక్రమానికి బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిల తోపాటు, మండల నాయకులు హాజరు కావాలని కోరారు.

భక్తుల ఇక్కట్లు

బిట్రగుంట, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట వేంకటేశ్వరస్వామి ఆలయం ఉత్తర ముఖద్వార రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతలకు గురైంది. దీంతో మంగళవారం స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇక్కట్లు పడ్డారు. ప్రతి శనివారమే కాకుండా ప్రతి రోజు వందలాది భక్తులు దూరప్రాంతాల నుంచి వస్తుంటారు. రోడ్డు కోతకు గురి కావడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

నిబంధనల మేరకే మద్యం దుకాణాలు

● సుంకర శ్రీనివాసరావు, కావలి ఎక్సైజ్ సీఐ



కావలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కావలి సర్కిల్ పరిధిలో ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం దుకాణాలు ఏర్పాటు అయ్యేలా చర్యలు చేపడుతున్నామని కావలి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుంకర శ్రీనివాసరావు తెలిపారు.

? సర్కిల్‌లో ఎన్ని మద్యం దుకాణాలు కేటాయించారు. వాటిలో ఎన్ని ఏర్పాటు చేశారు?

! కావలి సర్కిల్‌లో 17మద్యం దుకాణాలు కేటాయించగా వాటిలో 15దుకాణాలను ఏర్పాటు చేశారు.

? నిబంధనల మేరకు దుకాణాల ఏర్పాటు జరిగిందా?

! ప్రస్తుతం తాత్కాలికంగా ప్రొవిజన్ లైసెన్సులు ఇచ్చాం. నిబంధనల మేరకు ఏర్పాటు చేస్తేనే నవంబరు ఒకటి నుంచి పర్మినెంట్ లైసెన్స్‌లు ఇస్తాం

ఈ వారం ముఖాముఖి

? దుకాణాల ఏర్పాటు విషయంలో వ్యాపారుల మధ్య గొడవలు ఎందుకు..

! మండలంలో ఎక్కడైనా దుకాణాలు పెట్టుకునే వెసులుబాటు ఉండటంతో మంచి ప్రదేశాలు కోసం పోటీ పడి తర్వాత వారు సర్దుకుంటున్నారు.

? వ్యాపారులు కొన్ని మండలాల్లో సిండికేట్ అయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి?

! ఎక్కడా వ్యాపారులు సిండికేట్ అయినట్లు తమ దృష్టికి రాలేదు. ఎక్కడైనా సిండికేట్ అయితే వారిపై చర్యలు తీసుకుంటాం.

ఇద్దరికి గాయాలు

కలిగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కలిగిరి-వింజమూరు రహదారిలోని నాగిరెడ్డిపాలెం సమీపంలో మంగళవారం గొర్రెల లోడ్‌తో వింజమూరు వైపు వెళ్తున్న టాటా-ఏస్ ఆటో, కలిగిరి వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనలో రెండు వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కలిగిరి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

చెక్కు అందజేత

కావలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని గౌరవరం షేక్ మస్తాన్‌బాషకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అందజేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందినందుకు పెట్టిన ఖర్చులను ఈ నగదు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతం బాబుల్‌రెడ్డి, సురే శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

డ్రాపవుట్స్‌పై ప్రత్యేక దృష్టి

కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి): డ్రా పౌవుట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో గోవిందయ్య తెలిపారు. మంగళవారం విశ్వోదయా బాలుర, బాలికోన్నత పాఠశాలలు, మున్సిపల్ హైస్కూల్ పాఠశాలలను ఎంఈవో సందర్శించారు. హెచ్‌ఎంలతో మాట్లాడారు.

పరిమితికి మించి పొగాకు సాగు చేయొద్దు

● పొగాకుబోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు

కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వచ్చే సీజన్‌లో రైతులు పరిమితికి మించి పొగాకు సాగుచేసి నష్టాలు కొనితెచ్చుకోవద్దని పొగాకుబోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు రైతులకు సూచించారు. మంగళవారం కందుకూరు-2 వేలం కేంద్రంలో ఈఏడాదికి పొగాకు వేలం ప్రక్రియ ముగింపు సందర్భంగా రైతులు విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయంగా అనేక దేశాలలో ఈ ఏడాది పొగాకు సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. అనంతరం వేలం నిర్వహణా ధికారి ఎం.కిరణ్ మాట్లాడుతూ గడచిన సీజన్‌లో కందుకూరు 2వేలం కేంద్రంలో 16.32 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు జరగ్గా అత్యధిక ధర రూ. 360, అత్యల్ప ధర రూ.100గా నమోదై సరా సరి ధర రూ. 276.03లు దక్కిందని వివరించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి కిరణ్ , పొగాకుబోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ఆర్‌ఎం ఎం. కృష్ణ, విశ్రాంత ఆర్‌ఎం గూడూరి ఉమామహేశ్వరరావు, పొగాకు బోర్డు మెంబరు బొడపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వలేటివారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొగనారు మళ్లలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన దిగుబడులు లభిస్తాయని కందుకూరు వేలం కేంద్రం కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. అయ్యవారిపల్లెలో మంగళవారం పొగనాట్లు, విడుపులు, అంతరసేద్యం, నీటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, ఎరువులు యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే పొగాకు పండించాలని చెప్పారు. నారుమడుల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన నారు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, బోర్డు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అద్దంకి శ్రీధర్‌బాబు



రైతు సమస్యలు తక్షణం పరిష్కరించాలి

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రైతు సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసు కోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో తిరుమణి శ్రీపూజ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల తహసీల్దార్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. నియో జకవర్గంలో కొన్ని మండలాల్లో ఇద్దరు రైతులు ఒకే నెంబరుతో అసైన్‌మెంటు భూమిని కలిగిఉన్నట్లు సమస్యలు ఉన్నాయని ఈ విషయంలో నిజమైన హక్కు దారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అసైన్‌మెంటు భూముల రికార్డులు ఈనెలాఖరుకల్లా రెవెన్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాస్ అక్టోబరు 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నవంబరు 5న విజయవాడలోని ఎస్వీకే విజ్ఞానకేంద్రంలో జరిగే సభలకు సంబంధించి గోడపత్రికలను మంగళవారం విడుదల చేశారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జాన్, దాస్, సురేష్, వంశీ, మానస తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు సహకరించాలి: సీఐ

కందుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : నేరాల అదుపుకు ప్రజలు సహకరించాలని కందుకూరు సీఐ కె. వెంకటేశ్వరరావు కోరారు. కోవూరులో మంగళవారం రాత్రి విలేజ్ విజిట్‌లో ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించి వివిధ నేరాలపై అవగాహన కల్పించారు. నేరస్తుల కదలికలు ఎక్కడ ఉన్నా తక్షణం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యగా తీసుకోవాలన్నారు.

ఇంటింటి లార్వా సర్వే

ఉలవపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చాకిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి సింధుప్రియ వైద్యఆరోగ్య సిబ్బందితో కలిసి మంగళవారం బద్దిపూడిలో ఇంటింటి సర్వే చేపట్టారు. నీరు నిల్వ ఉన్న తొట్టెలు, ప్లాస్టిక్ డ్రమ్ములు, టైర్లుల నుంచి నీరు బయటకు తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు, దోమల బెడద ఎక్కువయ్యే అవకాశాలు ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంవో నీ నాగరాజు, సబ్ యూనిట్ అధికారి విజయచంద్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి

ఉలవపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నుంచి కావలి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు మంగళవారం ఉలవపాడు జాతీయ రహదారి జేబీ దాబా సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వృద్ధ యాచకుడుని ఢీకొంది. తీవ్ర గాయాలైన అతన్ని 108లో కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలి

● ఏఓ హేమంత్‌భరత్‌కుమార్

వలేటివారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పొగాకు మిర్చి పంటల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ మాట్లాడారు. మిర్చి పంట నాటుకునే ముందు ఎకరాకు 20 కిలోలు జింక్ సల్ఫేట్ దుక్కిలో వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞానకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్ గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు రవీంద్ర నాగరాజు, సురేష్, రైతులు పాల్గొన్నారు.